# నిర్గమకాండము

●**1.** ఐగుప్తులోనికి యాకోబుతో వచ్చిన ఇశ్రాయేలీయుల పేరులు ఏవనగా, రూబేను షిమ్యోను లేవి యూదా ఇశ్శాఖారు జెబూలూను బెన్యామీను దాను నఫ్తాలి గాదు ఆషేరు. వీరిలో ప్రతివాడు తన తన కుటుంబముతో వచ్చెను. యాకోబు గర్భమున పుట్టినవారందరు డెబ్బదిమంది. అప్పటికి యోసేపు ఐగుప్తులో ఉండెను.। (1-5)

6.యోసేపును అతని అన్నదమ్ములందరును ఆ తరము వారందరును చనిపోయిరి.।

7.ఇశ్రాయేలీయులు బహుసంతానము గలవారై అభివృద్ధి పొంది విస్తరించి అత్యధికముగా ప్రబలిరి,వారున్న ప్రదేశము వారితో నిండియుండెను.।

8.అప్పుడు యోసేపును ఎరుగని క్రొత్త రాజు ఐగుప్తును ఏల నారంభించెను.।

9.అతడు తన జనులతో ఇట్లనెను-ఇదిగో ఇశ్రాయేలు సంతతియైన యీ జనము మనకంటె విస్తారముగాను బలిష్ఠముగాను ఉన్నది. ।

10.వారు విస్తరింపకుండునట్లు మనము వారియెడల యుక్తిగా జరిగించుదము రండి; లేనియెడల యుద్ధము కలుగునప్పుడు కూడ మనశత్రువులతో చేరి మనకు విరోధముగా యుద్ధము చేసి యీ దేశములోనుండి, వెళ్లిపోదురేమో అనెను.।

11.కాబట్టి వారిమీద పెట్టిన భారములలో వారిని శ్రమపెట్టుటకు వెట్టి పనులుచేయించు అధికారులనువారిమీద నియమింపగా వారు ఫరోకొరకు ధాన్యాదులను నిలువచేయు పీతోము రామెసేసను పట్టణములు కట్టిరి.।

12.అయినను ఐగుప్తీయులు వారిని శ్రమపెట్టినకొలది వారు విస్తరించి ప్రబలిరి గనుక వారు ఇశ్రాయేలీయుల యెడల అసహ్యపడిరి.।

13.ఇశ్రాయేలీయులచేత ఐగుప్తీయులు కఠినముగా సేవ చేయించుకొనిరి;।

14.వారు ఇశ్రాయేలీయులచేత చేయించుకొనిన ప్రతి పనియు కఠినముగా ఉండెను. వారు జిగటమంటి పనిలోను, ఇటుకల పనిలోను, పొలములో చేయు ప్రతిపనిలోను కఠినసేవ చేయించి వారి ప్రాణములను విసికించిరి.।

15.మరియు ఐగుప్తురాజు షిఫ్రాపూయా అను హెబ్రీయుల మంత్రసానులతో మాటలాడి ।

16.-మీరు హెబ్రీ స్త్రీలకు మంత్రసానిపని చేయుచు వారిని కాన్పు పీటలమీద చూచినప్పుడు మగవాడైనయెడల వాని చంపుడి, ఆడుదైనయెడల దాని బ్రదుకనియ్యుడని వారితో చెప్పెను.।

17.అయితే ఆ మంత్రసానులు ఎలోహీంకు భయపడి. ఐగుప్తురాజు తమ కాజ్ఞాపించినట్లు చేయక మగపిల్లలను బ్రదుకనియ్యగా ।

18.ఐగుప్తురాజు ఆ మంత్రసానులను పిలిపించి-మీరెందుకు మగపిల్లలను బ్రదుకనిచ్చితిరి? ఈ పని యేల చేసితిరి అని అడిగెను.।

19.అందుకు ఆ మంత్రసానులు-హెబ్రీ స్త్రీలు ఐగుప్తు స్త్రీలవంటివారు కారు. వారు చురుకైనవారు. మంత్రసాని వారియొద్దకు వెళ్లిన మునుపే వారు ప్రసవించి యుందురని ఫరోతో చెప్పిరి.।

20.ఎలోహీం ఆ మంత్రసానులకు మేలు చేసెను. ఆ జనము విస్తరించి మిక్కిలి ప్రబలెను.।

21.ఆ మంత్రసానులు ఎలోహీంకు భయపడినందున ఆయన వారికి వంశాభివృద్ధి కలుగజేసెను.।

22.అయితే ఫరో-హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయుడి, ప్రతి కుమార్తెను బ్రదుకనియ్యుడి అని తన జనులందరికి ఆజ్ఞాపించెను.।

●**2.** లేవీ వంశస్థుడొకడు వెళ్లి లేవి కుమార్తెను వివాహము చేసికొనెను.।

2.ఆ స్త్రీ గర్భవతియై కుమారుని కని, వాడు సుందరుడై యుండుట చూచి మూడునెలలు వానిని దాచెను.।

3.తరువాత ఆమె వాని దాచలేక వానికొరకు ఒక జమ్ముపెట్టె తీసికొని, దానికి జిగటమన్నును కీలును పూసి, అందులో ఆ పిల్లవానిని పెట్టి యేటియొడ్డున జమ్ములో దానిని ఉంచగా, ।

4.వానికేమి సంభవించునో తెలిసికొనుటకు వాని అక్క దూరముగా నిలిచియుండెను.।

5.ఫరో కుమార్తె స్నానము చేయుటకు ఏటికి వచ్చెను. ఆమె పనికత్తెలు ఏటియొడ్డున నడుచుచుండగా ఆమె నాచులోని ఆ పెట్టెను చూచి, తన పనికత్తె నొకతెను పంపి దాని తెప్పించి ।

6.తెరచి ఆ పిల్లవాని చూచినప్పుడు ఆ పిల్లవాడు ఏడ్చుచుండగా చూచి వానియందు కనికరించి-వీడు హెబ్రీయుల పిల్లలలో నొకడనెను.।

7.అప్పుడు వాని అక్క ఫరో కుమార్తెతో నీకొరకు ఈ పిల్లవాని పెంచుటకు నేను వెళ్లి హెబ్రీ స్త్రీలలో ఒక దాదిని పిలుచుకొని వత్తునా అనెను.।

8.అందుకు ఫరో కుమార్తె-వెళ్లుమని చెప్పగా ఆ చిన్నది వెళ్లి ఆ బిడ్డ తల్లిని పిలుచుకొని వచ్చెను.।

9.ఫరో కుమార్తె ఆమెతో-ఈ బిడ్డను తీసికొనిపోయి నాకొరకు వానికి పాలిచ్చి పెంచుము, నేను నీకు జీతమిచ్చెదనని చెప్పగా, ఆ స్త్రీ ఆ బిడ్డను తీసికొని పోయి పాలిచ్చి పెంచెను.।

10.ఆ బిడ్డ పెద్దవాడైన తరువాత ఆమె ఫరో కుమార్తెయొద్దకు అతని తీసికొని వచ్చెను, అతడు ఆమెకు కుమారుడాయెను. ఆమె-నీటిలోనుండి ఇతని తీసితినని చెప్పి అతనికి మోషే అను పేరు పెట్టెను.

11.ఆ దినములలో మోషే పెద్దవాడై తన జనులయొద్దకు పోయి వారి భారములను చూచెను. అప్పుడతడు తన జనులలో ఒక హెబ్రీయుని ఒక ఐగుప్తీయుడు కొట్టగా చూచెను.।

12.అతడు ఇటు అటు తిరిగి చూచి యెవడును లేకపోగా ఆ ఐగుప్తీయుని చంపి యిసుకలో వాని కప్పిపెట్టెను.।

13.మరునాడు అతడు బయట నడిచి వెళ్లుచుండగా హెబ్రీయులైన మనుష్యులిద్దరు పోట్లాడుచుండిరి.।

14.అప్పుడతడు అన్యాయము చేసినవాని చూచి-నీవేల నీ పొరుగువాని కొట్టుచున్నావని అడుగగా అతడు-మామీద నిన్ను అధికారినిగాను తీర్పరినిగాను నియమించినవాడెవడు? నీవు ఆ ఐగుప్తీయుని చంపినట్లు నన్నును చంపవలెనని అనుకొనుచున్నావా అనెను. అందుకు మోషే -నిశ్చయముగా ఈ సంగతి బయలుపడెననుకొని భయపడెను.।

15.ఫరో ఆ సంగతి విని మోషేను చంపచూచెను గాని, మోషే ఫరో యెదుటనుండి పారిపోయి మిద్యాను దేశములో నిలిచిపోయి యొక బావియొద్ద కూర్చుండెను.।

16.మిద్యాను యాజకునికి ఏడుగురు కుమార్తెలుండిరి. వారు వచ్చి తమ తండ్రి మందకు పెట్టుటకు నీళ్లు చేది తొట్లను నింపుచుండగా.।

17.మందకాపరులు వచ్చి వారిని తోలివేసిరి.అప్పుడు మోషే లేచి వారికి సహాయము చేసి మందకు నీళ్లు పెట్టెను.।

18.వారు తమ తండ్రియైన రగూయేలు నొద్దకు వచ్చినప్పుడు అతడు-నేడు మీరింత త్వరగా ఎట్లు వచ్చితిరనెను.।

19.అందుకు వారు-ఐగుప్తీయుడొకడు మందకాపరుల చేతిలోనుండి మమ్మును తప్పించి వడిగా నీళ్లు చేది మన మందకు పెట్టెననగా ।

20.అతడు తన కుమార్తెలతో-అతడెక్కడ? ఆ మనుష్యుని ఏల విడిచి వచ్చితిరి? భోజనమునకు అతని పిలుచుకొని రండనెను.।

21.మోషే ఆ మనుష్యునితో నివసించుటకు సమ్మతించెను. అతడు తన కుమార్తెయైన సిప్పోరాను మోషే కిచ్చెను.।

22.ఆమె ఒక కుమారుని కనినప్పుడు మోషే-నేను అన్యదేశములో పరదేశినై యుంటిననుకొని వానికి గెర్షోము[1] (పరదేశి) అను పేరు పెట్టెను.

23.ఆలాగున అనేకదినములు జరిగినమీదట ఐగుప్తురాజు చనిపోయెను. ఇశ్రాయేలీయులు తాము చేయుచున్న వెట్టిపనులనుబట్టి నిట్టూర్పులు విడుచుచు మొరపెట్టుచుండగా, తమ వెట్టిపనులనుబట్టి వారుపెట్టిన మొర ఎలోహీం యొద్దకు చేరెను.।

24.కాగా ఎలోహీం వారి మూలుగును విని, అబ్రాహాము ఇస్సాకు యాకోబులతో తాను చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికొనెను.।

25.ఎలోహీం ఇశ్రాయేలీయులను చూచెను; ఎలోహీం వారియందు

లక్ష్యముంచెను.।

**3.**మోషే మిద్యాను యాజకుడైన యిత్రో అను తన మామ మందను మేపుచు, ఆ మందను అరణ్యము అవతలకు తోలుకొని ఎలోహీం పర్వతమైన హోరేబుకు వచ్చెను.।
2.ఒక పొదనడిమిని అగ్నిజ్వాలలో **యావె** దూత అతనికి ప్రత్యక్షమాయెను. అతడు చూచినప్పుడు అగ్ని వలన ఆ పొద మండుచుండెను గాని పొద కాలిపోలేదు.।
3.అప్పుడు మోషే-ఆ పొద యేల కాలిపోలేదో నేను ఆ తట్టు వెళ్లి యీ గొప్ప వింత చూచెదననుకొనెను.।
4.దానిని చూచుటకు అతడు ఆ తట్టు వచ్చుట **యావె** చూచెను. ఎలోహీం ఆ పొద నడుమనుండి-మోషే మోషే అని అతని పిలిచెను. అందుకతడు-చిత్తము సర్వాధికారీ అనెను.।
5.అందుకాయన-దగ్గరకు రావద్దు,నీ పాదములనుండి నీ చెప్పులు విడువుము, నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము అనెను.।
6.మరియు ఆయన-నేను నీ తండ్రి ఎలోహీంను, అబ్రాహాము ఎలోహీంను, ఇస్సాకు ఎలోహీంను, యాకోబు ఎలోహీంను అని చెప్పగా మోషే తన ముఖమును కప్పుకొని ఎలోహీంవైపు చూడ వెరచెను.।
7.మరియు **యావె** యిట్లనెను-నేను ఐగుప్తులో నున్న నా ప్రజల బాధను నిశ్చయముగా చూచితిని, పనులలో తమ్మును కష్టపెట్టువారినిబట్టి వారు పెట్టిన మొరను వింటిని, వారి దు:ఖములు నాకు తెలిసే యున్నవి.।
8.కాబట్టి ఐగుప్తీయుల చేతిలోనుండి వారిని విడిపించుటకును, ఆ దేశములోనుండి విశాలమైన మంచి దేశమునకు అనగా కనానీయులకు హిత్తీయులకు అమోరీయులకు పెరిజ్జీయులకు హివ్వీయులకు యెబూసీయులకు నివాసస్థానమై, పాలు తేనెలు ప్రవహించు దేశమునకు వారిని నడిపించుటకును దిగివచ్చి యున్నాను.।
9.ఇశ్రాయేలీయుల మొర నిజముగా నాయొద్దకు చేరినది, ఐగుప్తీయులు వారిని పెట్టుచున్న హింస చూచితిని.।
10.కాగా రమ్ము, నిన్ను ఫరో యొద్దకు పంపెదను; ఇశ్రాయేలీయులైన నా ప్రజలను నీవు ఐగుప్తులోనుండి తోడుకొని పోవలెననెను.।
11.అందుకు మోషే-నేను ఫరో యొద్దకు వెళ్లుటకును, ఇశ్రాయేలీయులను ఐగుప్తులోనుండి తోడుకొని పోవుటకును ఎంతటివాడనని ఎలోహీంతో అనగా ।
12.ఆయన-నిశ్చయముగా నేను నీకు తోడైయుందును, నేను నిన్ను పంపితిననుటకు ఇది నీకు సూచన; నీవు ఆ ప్రజలను ఐగుప్తులోనుండి తోడుకొని వచ్చిన తరువాత మీరు ఈ పర్వతముమీద ఎలోహీంను సేవించెదరనెను.।
13.మోషే-చిత్తగించుము; నేను ఇశ్రాయేలీయులయొద్దకు వెళ్లి వారిని చూచి-మీ పితరుల ఎలోహీం మీ యొద్దకు నన్ను పంపెనని వారితో చెప్పగా వారు-ఆయన పేరేమి అని అడిగినయెడల వారితో నేనేమి చెప్పవలెనని ఎలోహీంను అడిగెను.।
14.అందుకు ఎలోహీం - నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను. మరియు ఆయన-ఉందుననువాడు మీయొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను.।
15.మరియు ఎలోహీం మోషేతో నిట్లనెను-మీ పితరుల ఎలోహీమైన **యావె**, అనగా అబ్రాహాము ఎలోహీం ఇస్సాకు ఎలోహీం యాకోబు ఎలోహీమైన **యావె** మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెను. నిరంతరము నా నామము ఇదే, తరతరములకు ఇది నా జ్ఞాపకార్థక నామము.।
16.నీవు వెళ్లి ఇశ్రాయేలీయుల పెద్దలను పోగుచేసి-మీ పితరుల ఎలోహీమైన **యావె** , అనగా అబ్రాహాము ఇస్సాకు యాకోబుల ఎలోహీం, నాకు ప్రత్యక్షమై యిట్లనెను-నేను మిమ్మును, ఐగుప్తులో మీకు సంభవించిన దానిని, నిశ్చయముగా చూచితిని.।
17.ఐగుప్తు బాధలో నుండి పాలు తేనెలు ప్రవహించు దేశమునకు, అనగా కనానీయులు హిత్తీయులు అమోరీయులు పెరిజ్జీయులు హివ్వీయులు యెబూసీయులున్న దేశమునకు మిమ్ము రప్పించెదనని సెలవిచ్చితినని వారితో చెప్పుము.।
18.వారు నీ మాట విందురు గనుక నీవు ఇశ్రాయేలీయుల పెద్దలును ఐగుప్తు రాజునొద్దకు వెళ్లి అతని చూచి-హెబ్రీయుల ఎలోహీమైన **యావె** మాకు ప్రత్యక్షమాయెను గనుక మేము అరణ్యమునకు మూడు దినముల ప్రయాణమంత దూరము పోయి మా ఎలోహీమైన **యావె**కు బలిని సమర్పించుదుము సెలవిమ్మని అతనితో చెప్పవలెను.।
19.ఐగుప్తు రాజు మహాబలముతో మీ మీదికి వచ్చి మిమ్ము పోనియ్యడని నేనెరుగుదును;।
20.కాని, నేను నా చెయ్యి చాపి ఐగుప్తు మధ్యమున నేను చేయదలచియున్న నా అద్భుతములన్నిటిని చూపి దాని పాడుచేసెదను. అటుతరువాత అతడు మిమ్ము పంపివేయును.।
21.మరియు నేను ఈ జనుల యెడల ఐగుప్తీయులకు కటాక్షము కలుగజేసెదను గనుక మీరు వెళ్లునప్పుడు వట్టిచేతులతో వెళ్లరు.।
22.ప్రతి స్త్రీయు తన పొరుగుదానిని తన యింటనుండు దానిని వెండినగలను బంగారునగలను వస్త్రములను ఇమ్మని అడిగి తీసికొని, మీరు వాటిని మీ కుమారులకును మీ కుమార్తెలకును ధరింపచేసి ఐగుప్తీయులను దోచుకొందురనెను.॥

**4.**అందుకు మోషే-చిత్తగించుము; వారు నమ్మరు నా మాట వినరు -**యావె** నీకు ప్రత్యక్షము కాలేదందురు అని ఉత్తరమియ్యగా ।
2.**యావె**-నీ చేతి లోనిది ఏమిటి అని అతని నడిగెను. అందుకతడు -కఱ్ఱ అనెను.।
3.అప్పుడాయన-నేలను దాని పడవేయుమనెను. అతడు దాని నేల పడవేయగానే అది పామాయెను.।
4.అప్పుడు **యావె**-నీ చెయ్యి చాపి దాని తోక పట్టుకొనుమనగా, అతడు తన చెయ్యి చాపి దాని పట్టుకొనగానే అది అతని చేతిలో కఱ్ఱ ఆయెను.।
5.ఆయన-దానిచేత వారు తమ పితరుల ఎలోహీమైన **యావె**, అనగా అబ్రాహాము ఎలోహీం, ఇస్సాకు ఎలోహీం యాకోబు ఎలోహీం నీకు ప్రత్యక్షమాయెనని నమ్ముదురనెను.।
6.మరియు **యావె**-నీ చెయ్యి నీ రొమ్మున ఉంచుకొనుమనగా, అతడు తన చెయ్యి రొమ్మున ఉంచుకొని దాని వెలుపలికి తీసినప్పుడు ఆ చెయ్యి కుష్ఠముగలదై హిమమువలె తెల్లగా ఆయెను.।
7.తరువాత ఆయన-నీ చెయ్యి మరల నీ రొమ్మున ఉంచుకొనుమనగా, అతడు తన చెయ్యి మరల తన రొమ్మున ఉంచుకొని తన రొమ్మునుండి వెలుపలికి తీసినప్పుడు అది అతని మిగిలిన శరీరమువలె ఆయెను.।
8.మరియు ఆయన-వారు నిన్ను నమ్మక, మొదటి సూచననుబట్టి వినకపోయినయెడల రెండవదాని బట్టి విందురు.।
9.వారు ఈ రెండు సూచనలనుబట్టి నమ్మక నీ మాట వినకపోయినయెడల నీవు కొంచెము ఏటి నీళ్లు తీసి యెండిన నేలమీద పోయవలెను. అప్పుడు నీవు ఏటిలోనుండి తీసిన నీళ్లు పొడినేలమీద రక్తమగుననెను.।
10.అప్పుడు మోషే-సర్వాధికారీ, ఇంతకుమునుపైనను, నీవు నీ దాసునితో మాటలాడినప్పటినుండి యైనను,నేను మాట నేర్పరినికాను, నేను నోటి మాంద్యము నాలుక మాంద్యము గలవాడనని **యావె**తో చెప్పగా ।
11.**యావె**-మానవునకు నోరిచ్చినవాడు ఎవడు? మూగవానినేగాని చెవిటివానినేగాని దృష్టిగలవానినేగాని గ్రుడ్డివానినేగాని పుట్టించినవాడెవడు? **యావె**నైన నేనే గదా.।
12.కాబట్టి వెళ్లుము, నేను నీ నోటికి తోడైయుండి నీవు ఏమి పలుకవలసినది నీకు బోధించెదనని అతనితో చెప్పెను.।
13.అందుకతడు-అయ్యో సర్వాధికారీ, నీవు పంపతలంచిన వానినే పంపుమనగా ।
14.ఆయన మోషేమీద కోపపడి-లేవీయుడగు నీ అన్నయైన అహరోను లేడా?అతడు బాగుగా మాటలాడగలడని నేనెరుగుదును, ఇదిగో అతడు నిన్ను ఎదుర్కొనవచ్చుచున్నాడు; అతడు నిన్ను చూచి తన హృదయమున సంతోషించును; ।

15.నీవు అతనితో మాటలాడి అతని నోటికి మాటలు అందించవలెను, నేను నీ నోటికి అతని నోటికి తోడైయుండి, మీరు చేయవలసినదానిని మీకు బోధించెదను.।
16.అతడే నీకు బదులు జనులతో మాటలాడును, అతడే నీకు నోరుగా నుండును,నీవు అతనికి దేవుడవుగా ఉందువు.।
17.ఈ కఱ్ఱను చేతపట్టుకొని దానితో ఆ సూచకక్రియలు చేయవలెనని చెప్పెను.
18.అటుతరువాత మోషే బయలుదేరి తన మామయైన యిత్రోయొద్దకు తిరిగి వెళ్లి-సెలవైయనెడలనేను ఐగుప్తులోనున్న నా బంధువులయొద్దకు మరల పోయి వారింక సజీవులైయున్నారేమో చూచెదనని అతనితో చెప్పగా యిత్రో-క్షేమముగా వెళ్లుమని మోషేతో అనెను.।
19.అంతట **యూవె**-నీ ప్రాణమును వెదకిన మనుష్యులందరు చనిపోయిరి గనుక ఐగుప్తునకు తిరిగి వెళ్లుమని మిద్యానులో మోషేతో చెప్పగా, ।
20.మోషే తన భార్యను తన కుమారులను తీసికొని గాడిదమీద నెక్కించుకొని ఐగుప్తునకు తిరిగి వెళ్లెను. మోషే ఎలోహీం కఱ్ఱను తన చేత పట్టుకొని పోయెను.।
21.అప్పుడు **యూవె** మోషేతో ఇట్లనెను-నీవు ఐగుప్తునందు తిరిగి చేరిన తరువాత, చేయుటకు నేను నీకిచ్చిన మహత్కార్యములన్నియు ఫరోయెదుట చేయవలెను సుమీ అయితే నేను అతని హృదయమును కఠినపరచెదను, అతడు ఈ జనులను పోనియ్యడు. ।
22.అప్పుడు నీవు ఫరోతో-ఇశ్రాయేలు నా కుమారుడు, నా జ్యేష్ఠపుత్రుడు;
23.నన్ను సేవించునట్లు నా కుమారుని పోనిమ్మని నీకు ఆజ్ఞాపించు చున్నాను; వాని పంపనొల్లనియెడల ఇదిగో నేను నీ కుమారుని నీ జ్యేష్ఠపుత్రుని చంపెదనని **యూవె** సెలవిచ్చుచున్నాడనిఅతనితో చెప్పుమనెను.।
24.అతడు పోవుమార్గమున సత్రములో **యూవె** అతనిని ఎదుర్కొని అతని చంపచూడగా ।
25.సిప్పోరా వాడిగల రాయి తీసికొని తన కుమారునికి సున్నతి చేసి అతని పాదములయొద్ద అది పడవేసి-నిజముగా నీవు నాకు రక్తసంబంధమైన పెనిమిటివైతివనెను; అంతట ఆయన అతనిని విడిచెను.।
26.అప్పుడు ఆమె-ఈ సున్నతినిబట్టి నీవు నాకు రక్తసంబంధమైన పెనిమిటివైతివనెను.।
27.మరియు **యూవె**-మోషేను ఎదుర్కొనుటకు అరణ్యములోనికి వెళ్లుమని అహరోనుతో చెప్పగా అతడు వెళ్లి ఎలోహీం పర్వతమందు అతని కలిసికొని అతని ముద్దుపెట్టుకొనెను.।
28.అప్పుడు మోషే తన్ను పంపిన **యూవె** పలుకుమన్న మాటలన్నిటిని, ఆయన చేయనాజ్ఞాపించిన సూచకక్రియలన్నిటిని అహరోనుకు తెలిపెను.
29.తరువాత మోషే అహరోనులు వెళ్లి ఇశ్రాయేలీయుల పెద్దలనందరిని పోగుచేసి, ।
30.**యూవె** మోషేతో చెప్పినమాటలన్నియు అహరోను వివరించి, జనులయెదుట ఆ సూచకక్రియలను చేయగా జనులు నమ్మిరి.।
31.మరియు-**యూవె** ఇశ్రాయేలీయులను చూడవచ్చి తమ బాధను కనిపెట్టెనను మాట జనులు విని తలవంచుకొని నమస్కారము చేసిరి.।

●**5.**తరువాత మోషే అహరోనులు వచ్చి ఫరోను చూచి-ఇశ్రాయేలీయుల ఎలోహీమైన **యూవె**-అరణ్యములో నాకు ఉత్సవము చేయుటకు నా జనమును పోనిమ్మని ఆజ్ఞాపించుచున్నాడనిరి.।
2.ఫరో-నేను అతని మాట విని ఇశ్రాయేలీయులను పోనిచ్చుటకు **యూవె** ఎవడు? నేను **యూవె**ను ఎరుగను, ఇశ్రాయేలీయులను పోనీయననెను.।
3.అప్పుడు వారు-హెబ్రీయుల ఎలోహీం మమ్మును ఎదుర్కొనెను, సెలవైన యెడల మేము అరణ్యములోనికి మూడు దినముల ప్రయాణమంత దూరముపోయి మా ఎలోహీమైన **యూవె**కు బలి అర్పించుదుము; లేనియెడల ఆయన మామీద తెగులుతోనైనను ఖడ్గముతోనైనను పడునేమో అనిరి.।
4.అందుకు ఐగుప్తు రాజు-మోషే అహరోనూ, ఈ జనులు తమ పనులను చేయకుండ మీరేల ఆపుచున్నారు? మీ బరువులు మోయుటకు పొండనెను.।
5.మరియు ఫరో-ఇదిగో ఈ జనము ఇప్పుడు విస్తరించియున్నది; వారు తమ బరువులను విడిచి తీరికగా నుండునట్లు మీరు చేయుచున్నారని వారితో అనెను.।
6.ఆ దినమున ఫరో ప్రజలపైనున్న కార్యనియామకులకును వారి నాయకులకును ఇట్లు ఆజ్ఞాపించెను.।
7.-ఇటుకలు చేయుటకు మీరు ఇకమీదట ఈ జనులకు గడ్డి ఇయ్యకూడదు, వారు వెళ్లి తామే గడ్డి కూర్చుకొనవలెను.।
8.అయినను వారు ఇదివరకు చేసిన యిటుకల లెక్కనే వారిమీద మోపవలెను, దానిలో ఏమాత్రము తక్కువ చేయవద్దు; వారు సోమరులు గనుక-మేము వెళ్లి మా ఎలోహీంకు బలి నర్పించుటకు సెలవిమ్మని మొఱపెట్టుచున్నారు.।
9.ఆ మనుష్యులచేత ఎక్కువ పని చేయింపవలెను, దానిలో వారు కష్టపడవలెను, అబద్ధపుమాటలను వారు లక్ష్యపెట్టకూడదనెను.।
10.కాబట్టి ప్రజలు కార్యనియామకులును వారి నాయకులును పోయి ప్రజలను చూచి-నేను మీకు గడ్డి ఇయ్యను; ।
11.మీరు వెళ్లి గడ్డి యెక్కడ దొరుకునో అక్కడ మీరే సంపాదించుకొనుడి, అయితే మీ పనిలో నేమాత్రము తక్కువ చేయబడదని ఫరో సెలవిచ్చెననిరి.।
12.అప్పుడు ప్రజలు గడ్డికి మారుగా కొయ్యకాలు కూర్చుటకు ఐగుప్తు దేశమందంతటను చెదిరిపోయిరి.।
13.మరియు కార్యనియామకులు వారిని త్వరపెట్టి గడ్డి ఉన్నప్పటివలెనే యేనాటిపని ఆనాడే ముగించుడనిరి.।
14.ఫరో కార్యనియామకులు తాము ఇశ్రాయేలీయులలో వారిమీద ఉంచిన నాయకులను కొట్టి-ఎప్పటివలె మీ లెక్క చొప్పున ఇటుకలను నిన్న నేడు మీరు ఏల చేయించలేదని అడుగగా।
15.ఇశ్రాయేలీయుల నాయకులు ఫరోయొద్దకు వచ్చి-తమ దాసుల యెడల తమ రెందుకిట్లు జరిగించుచున్నారు? ।
16.తమ దాసులకు గడ్డినియ్యరు అయితే ఇటుకలు చేయుడని మాతో చెప్పుచున్నారు; చిత్తగించుము, వారు తమరి దాసులను కొట్టుచున్నారు; అయితే తప్పిదము తమరి ప్రజలయందే యున్నదని మొఱపెట్టిరి.।
17.అందుకతడు-మీరు సోములు మీరు సోమరులు అందుచేత-మేము వెళ్లి **యూవె**కు బలినర్పించుటకు సెలవిమ్మని మీరడుగుచున్నారు.।
18.మీరు పొండి, పనిచేయుడి, గడ్డి మీకియ్యబడదు, అయితే ఇటుకల లెక్క మీరప్పగింపక తప్పదని చెప్పెను.।
19.-మీ ఇటుకల లెక్కలో నేమాత్రమును తక్కువ చేయవద్దు, ఏనాటి పని ఆనాడే చేయవలెనని రాజు సెలవియ్యగా, ఇశ్రాయేలీయుల నాయకులు తాము దురవస్థలో పడియున్నట్లు తెలిసికొనిరి.।
20.వారు ఫరోయొద్దనుండి బయలుదేరి వచ్చుచు, తమ్మును ఎదుర్కొను టకు దారిలో నిలిచియున్న మోషే అహరోనులను కలిసి కొని ।
21.-**యూవె** మిమ్మును చూచి న్యాయము తీర్చును గాక; ఫరో యెదుటను అతని దాసుల యెదుటను మమ్మును అసహ్యులుగా చేసి మమ్ము చంపుటకై వారి చేతికి ఖడ్గమిచ్చితిరని వారితో అనగా ।
22.మోషే **యూవె** యొద్దకు తిరిగి వెళ్లి-సర్వాధికారీ, నీవేల ఈ ప్రజలకు కీడు చేసితివి? నన్నేల పంపితివి? ।
23.నేను నీ పేరట మాటలాడుటకు ఫరోయొద్దకు వచ్చినప్పటినుండి అతడు ఈ జనులకు కీడే చేయుచున్నాడు, నీ జనులను నీవు విడిపింపను లేదనెను.।

●**6.**అందుకు **యూవె**-ఫరోకు నేను చేయబోవుచున్నదానిని నీవు నిశ్చయ ముగా చూచెదవు; బలమైన హస్తము చేత అతడు వారిని పోనిచ్చును, బలమైన హస్తము చేతనే అతడు తన దేశములోనుండి వారిని తోలివేయు నని మోషేతో అనెను.।
2.మరియు ఎలోహీం మోషేతో ఇట్లనెను-నేనే **యూవె**ను;।
3.నేను సర్వశక్తిగల ఎలోహీం అను పేరున అబ్రాహాము ఇస్సాకు యకోబులకు ప్రత్యక్షమైతిని కాని, **యూవె** అను నామమున నేను వారికి

తెలుపబడలేదు.।
4.మరియు వారు పరవాసము చేసిన దేశమగు కనానుదేశమును వారికిచ్చుటకు నా నిబంధనను వారితో స్థిరపరచితిని.।
5.ఐగుప్తీయులు దాస్యత్వమునకు లోపరచియున్న ఇశ్రాయేలీయుల మూలుగును విని నా నిబంధనను జ్ఞాపకము చేసికొనియున్నాను.।
6.కాబట్టి నీవు ఇశ్రాయేలీయులతో ఈలాగు చెప్పుము-నేనే **యావె**ను; నేను ఐగుప్తీయులు మోయించు బరువుల క్రింద నుండి మిమ్మును వెలుపలికి రప్పించి, వారి దాసత్వములో నుండి మిమ్మును విడిపించి, నా బాహువు చాపి గొప్ప తీర్పులు తీర్చి మిమ్మును విడిపించి,।
7.మిమ్మును నాకు ప్రజలుగా చేర్చుకొని మీకు ఎలోహీంనై యుందును. అప్పుడు ఐగుప్తీయుల బరువు క్రిందనుండి మిమ్మును వెలుపలికి రప్పించిన మీ ఎలోహీమైన **యావె**ను నేనే అని మీరు తెలిసికొందురు.।
8.నేను అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఇచ్చెదనని చెయ్యి యెత్తి ప్రమాణము చేసిన దేశములోనికి మిమ్మును రప్పించి దాని మీకు స్వాస్థ్యముగా ఇచ్చెదను; నేను **యావె**నని చెప్పుమనగా ।
9.మోషే ఇశ్రాయేలీయులతో ఆలాగు చెప్పెను.అయితే వారు మనోవ్యాకుల మునుబట్టియు కఠిన దాసత్వమును బట్టియు మోషే మాట వినరైరి.।
10.మరియు **యావె** మోషేతో ।
11.నీవు లోపలికి వెళ్లి, ఐగుప్తురాజైన ఫరోతో-ఇశ్రాయేలీయులను తన దేశములోనుండి వెలుపలికి పోనియ్యవలెనని అతనితో చెప్పుమనెను.।
12.అప్పుడు మోషే-చిత్తగించుము, ఇశ్రాయేలీయులే నా మాట వినలేదు; మాటమాంద్యము గలవాడనగు నా మాట ఫరో యెట్లు వినునని **యావె** సన్నిధిని పలికెను.।
13.మరియు **యావె** మోషే అహరోనులతో నిట్లనెను-ఇశ్రాయేలీయులను ఐగుప్తు దేశములోనుండి తాము వెలుపలికి రప్పించుటకై ఇశ్రాయేలీయుల యొద్దకును ఫరోయొద్దకును వెళ్లవలెనని వారి కాజ్ఞాపించెను.।
14.వారి పితరుల కుటుంబముల మూలపురుషులు ఎవరనగా,ఇశ్రాయేలు జ్యేష్ఠ కుమారుడైన రూబేను కుమారులు హనోకు పల్లు హెస్రోను కర్మీ; వీరు రూబేను కుటుంబములు.।
15.షిమ్యోను కుమారులు యెమూయేలు యామీను ఓహదు యాకీను సోహరు కనాను స్త్రీకి కుమారుడైన షావూలు; వీరు షిమ్యోను కుటుంబములు.।
16.లేవి కుమారుల పేరులు వారి వారి వంశావళుల చొప్పున ఏవేవనగా, గెర్షోను కహాతు మెరారి. లేవి నూట ముప్పదియేండ్లు బ్రదికెను.।
17.గెర్షోను కుమారులు వారి వారి వంశావళుల చొప్పున లిబ్నీ షిమీ.।
18.కహాతు కుమారులు అమ్రాము ఇస్హారు హెబ్రోను ఉజ్జీయేలు. కహాతు నూట ముప్పది మూడేండ్లు బ్రదికెను.।
19.మెరారి కుమారులు మహలిమూషి; వీరు తమ తమ వంశావళుల చొప్పున లేవి కుటుంబములు.।
20.అమ్రాము తన మేనత్తయైన యోకెబెదును పెండ్లిచేసికొనెను; ఆమె అతనికి అహరోనును మోషేను కనెను. అమ్రాము నూట ముప్పది యేడేండ్లు బ్రదికెను.।
21.ఇస్హారు కుమారులు కోరహు నెపెగు జిఖ్రీ ।
22.ఉజ్జీయేలు కుమారులు మిషాయేలు ఎల్సాఫాను సిత్రీ।
23.అహరోను అమ్మీనాదాబు కుమార్తెయు నయస్సోను సహోదరియునైన ఎలీషెబను పెండ్లిచేసికొనెను. ఆమె అతనికి నాదాబును అబీహును ఎలియాజరును ఈతామారును కనెను.।
24.కోరహు కుమారులు అస్సీరు ఎల్కానా అబీయాసాపు; వీరు కోరహీయుల కుటుంబములు.।
25.అహరోను కుమారుడైన ఎలియాజరు పూతీయేలు కుమార్తెలలో ఒకతెను పెండ్లిచేసికొనెను ఆమె అతనికి ఫినెహాసును కనెను; వీరు తమ తమ కుటుంబములచొప్పున లేవీయుల పితరుల మూలపురుషులు.।
26.ఇశ్రాయేలీయులను వారి సేనల చొప్పున ఐగుప్తుదేశములోనుండి వెలుపలికి రప్పించుడని **యావె** ఆజ్ఞాపించిన అహరోను మోషేలు వీరు.।
27.ఇశ్రాయేలీయులు ఐగుప్తులోనుండి వెలుపలికి రప్పించవలెనని ఐగుప్తు రాజైన ఫరోతో మాటలాడినవారు వీరు; ఆ మోషే అహరోనులు వీరే.।
28.ఐగుప్తుదేశములో **యావె**-మోషేతో మాటలాడిన దినమున ।
29.**యావె**-నేను **యావె**ను; నేను నీతో చెప్పునది యావత్తు నీవు ఐగుప్తు రాజైన ఫరోతో పలుకుమని మోషేతో చెప్పగా ।
30.మోషే-చిత్తగించుము; నేను మాట మాంద్యము గలవాడను, ఫరో నా మాట యెట్లు వినునని **యావె** సన్నిధిని పలికెను.।।

●**7.**కాగా **యావె** మోషేతో ఇట్లనెను-ఇదిగో నిన్ను ఫరోకు దేవునిగా నియమించితిని; నీ అన్న అహరోను నీకు ప్రవక్తగా నుండును.।
2.నేను నీ కాజ్ఞాపించునది యావత్తు నీవు పలుకవలెను. ఫరో తన దేశములో నుండి ఇశ్రాయేలీయులను పోనియ్యవలెనని నీ అన్నయైన అహరోను అతనితో చెప్పును;।
3.అయితే నేను ఫరో హృదయమును కఠినపరచి, ఐగుప్తు దేశములో నా సూచకక్రియలను నా మహత్కార్యములను విస్తరింపచేసెదను.।
4.ఫరో మీ మాట వినడు గాని నేను నా చెయ్యి ఐగుప్తుమీద వేసి గొప్ప తీర్పులచేత నా సేనలను ఇశ్రాయేలీయులైన నా ప్రజలను ఐగుప్తుదేశము లోనుండి వెలుపలికి రప్పించెదను.।
5.నేను ఐగుప్తుమీద నా చెయ్యి చాపి ఇశ్రాయేలీయులను వారి మధ్యనుండి రప్పింపగానే నేను **యావె**నని ఐగుప్తీయులు తెలిసికొందురనెను.।
6.మోషే అహరోనులు **యావె** తమకు ఆజ్ఞాపించినట్లు చేసిరి, ఆలాగుననే చేసిరి.।
7.వారు ఫరోతో మాటలాడినప్పుడు మోషేకు ఎనుబదియేండ్లు,అహరోనుకు ఎనుబది మూడేండ్లు
8.మరియు **యావె** మోషే అహరోనులతో ఇట్లనెను-ఫరో మీ శక్తి చూపుటకై ఒక మహత్కార్యము కనుపరచుడని మీతో చెప్పునప్పుడు నీవు అహరోనును చూచి-నీ కఱ్ఱను పట్టుకొని ఫరో యెదుట దాని పడవేయు మనుము; అది సర్పమగును.।
10.కాబట్టి మోషే అహరోనులు ఫరోయొద్దకు వెళ్లి **యావె** తమ కాజ్ఞాపించినట్లు చేసిరి. అహరోను ఫరో యెదుటను అతని సేవకుల యెదుటను తన కఱ్ఱను పడవేయగానే అది సర్పమాయెను.।
11.అప్పుడు ఫరో తన విద్వాంసులను మంత్రజ్ఞులను పిలిపించెను. ఐగుప్తు శకునగాండ్రు కూడ తమ మంత్రములచేత ఆలాగే చేసిరి.।
12.వారిలో ప్రతివాడును తన కఱ్ఱను పడవేసినప్పుడు అది సర్పమాయెను గాని అహరోను కఱ్ఱ వారి కఱ్ఱలను మ్రింగివేయగా ।
13.**యావె** చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను గనుక అతడు వారి మాట వినకపోయెను.।
14.తరువాత **యావె** మోషేతో ఇట్లనెను-ఫరో హృదయము కఠినమైనది, అతడు ఈ ప్రజలను పోనియ్యనొల్లడాయెను.।
15.ప్రొద్దున నీవు ఫరో యొద్దకు వెళ్లుము, ఇదిగో అతడు ఏటిదరికి పోవును. నీవు అతనిని ఎదుర్కొనుటకు ఏటియొడ్డున నిలిచి పాముగా చేయబడిన కఱ్ఱను చేతపట్టుకొని ।
16.అతని చూచి-అరణ్యమందు నన్ను సేవించుటకై నా ప్రజలను పోనిమ్మని ఆజ్ఞాపించుటకుగాను హెబ్రీయుల ఎలోహీమైన **యావె** నన్ను నీ యొద్దకు పంపెను. నీవు-ఇదివరకు వినకపోతివి.।
17.కాగా **యావె** ఆజ్ఞఏదనగా నేను **యావె**నని దీనిబట్టి నీవు తెలిసికొందువని **యావె** చెప్పుచున్నాడు. ఇదిగో నా చేతిలోనున్న యీ కఱ్ఱతో నేను ఏటి నీటిని కొట్టుదును అది రక్తముగా మార్చబడును.।
18.ఏటిలోని చేపలు చచ్చును, ఏరు కంపుకొట్టును, ఏటి నీళ్లు త్రాగుటకు ఐగుప్తీయులు అసహ్యపడుదురని చెప్పుమనెను.।
19.మరియు **యావె** మోషేతో ఇట్లనెను-నీవు అహరోనుతో-నీ కఱ్ఱను పట్టుకొని ఐగుప్తు జనులమీద, అనగా వారి నదులమీదను వారి కాలువలమీదను, వారి చెరువులమీదను, వారి నీటిగుంటలన్నిటిమీదను నీ చెయ్యి చాపుము; అవి రక్తమగును; ఐగుప్తు దేశమందంతటను మ్రానుపాత్రలలోను రాతిపాత్రలలోను రక్తము ఉండునని అతనితో చెప్పుమనెను.।

20.**యావె** ఆజ్ఞాపించినట్లు మోషే అహరోనులు చేసిరి. అతడు ఫరో యెదుటను అతని సేవకుల యెదుటను తన కఱ్ఱను పైకెత్తి ఏటినీళ్లను కొట్టగా ఏటి నీళ్లన్నియు రక్తముగా మార్చబడెను.।
21.ఏటిలోని చేపలు చచ్చెను, ఏరు కంపుకొట్టెను; ఐగుప్తీయులు ఏటి నీళ్లు త్రాగలేకపోయిరి, ఐగుప్తుదేశమందంతట రక్తము ఉండెను.।
22.ఐగుప్తు శకునగాండ్రుకూడ తమ మంత్రములవలన అట్లు చేయగా **యావె** చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను, అతడు మోషే అహరోనుల మాట వినకపోయెను.।
23.జరిగినదానిని మనస్సున పెట్టక ఫరో తిరిగి తన యింటికి వెళ్లెను
24.అయితే ఐగుప్తీయులందరు ఏటినీళ్లు త్రాగలేక త్రాగు నీళ్లకొరకు ఏటిప్రక్కలను త్రవ్విరి.।

●**8.యావె** ఏటిని కొట్టి యేడు దినములైన తరువాత **యావె** మోషేతో ఇట్లనెను-నీవు ఫరో యొద్దకు వెళ్లి అతనితో నన్ను సేవించుటకు నా జనులను పోనిమ్ము; ।
2.నీవు వారిని పోనియ్యనొల్లనియెడల ఇదిగో నేను నీ పొలిమేరలన్నిటిని కప్పలచేత బాధించెదను.।
3.ఏటిలో కప్పలు విస్తారముగా పుట్టును; అవి నీ యింట నీ పడకగదిలోనికి నీ మంచముమీదికి నీ సేవకుల యిండ్లలోనికి నీ జనుల మీదికి నీ పొలములలోనికి నీ పిండి పిసుకు తొట్లలోనికి ఎక్కి వచ్చును;।
4.ఆ కప్పలు నీమీదికి నీ జనులమీదికి నీ సేవకులందరిమీదికి వచ్చునని **యావె** సెలవిచ్చుచున్నాడని చెప్పుమనెను.।
5.మరియు **యావె** మోషేతో ఇట్లనెను-నీవు అహరోనును చూచి-నీ కఱ్ఱ పట్టుకొని యేటిపాయలమీదను కాలువలమీదను చెరువులమీదను నీ చెయ్యి చాపి ఐగుప్తుదేశముమీదికి కప్పలను రాజేయుమని అతనితో చెప్పుమనగా ।
6.అహరోను ఐగుప్తు జలములమీద తన చెయ్యి చాపెను; అప్పుడు కప్పలు ఎక్కివచ్చి ఐగుప్తు దేశమును కప్పెను.।
7.శకునగాండ్రు కూడ తమ మంత్రములవలన ఆలాగు చేసి ఐగుప్తు దేశముమీదికి కప్పలను రాజేసిరి.।
8.అప్పుడు ఫరో మోషే అహరోనులను పిలిపించి-నా యొద్దనుండి నా జనులయొద్దనుండి ఈ కప్పలను తొలగించుమని **యావె**ను వేడుకొనుడి, అప్పుడు **యావె**కు బలి అర్పించుటకు ఈ ప్రజలను అగత్యముగా పోనిచ్చెదననెను.।
9.అందుకు మోషే-నన్ను గెలిచినట్టుగా నీవు అతిశయింపవచ్చును, ఈ కప్పల శేషము ఏటిలోనే ఉండునట్లును అవి నీ మీదను నీ యిండ్లలోను ఉండకుండ చంపబడునట్లును నీ కొరకును నీ సేవకుల కొరకును నీ ప్రజలకొరకును నేనెప్పుడు వేడుకొనవలెనో చెప్పుమని ఫరోను అడుగగా అతడు రేపే అనెను.।
10.అందుకతడు-మా ఎలోహీమైన **యావె** వంటి వారెవరును లేరు అని నీవు తెలిసికొనునట్లు నీ మాట చొప్పున జరుగును; ।
11.అనగా కప్పలు నీ యొద్దనుండియు నీ యిండ్లలో నుండియు నీ సేవకుల యొద్దనుండియు నీ ప్రజలయొద్దనుండియు తొలగిపోవును; అవి యేటిలోనే ఉండుననెను.।
12.మోషే అహరోనులు ఫరో యొద్దనుండి బయలువెళ్లినప్పుడు **యావె** ఫరోమీదికి రాజేసిన కప్పల విషయములో మోషే అతనికొరకుమొఱపెట్టగా
13.**యావె** మోషే మాటచొప్పున చేసెను గనుక ఇండ్లలోనేమి వెలుపలనేమి పొలములలోనేమి కప్పలు ఉండకుండ చచ్చిపోయెను.।
14.జనులు వాటిని కుప్పలుగా వేసినప్పుడు భూమి కంపుకొట్టెను.।
15.ఫరో ఉపశమనము కలుగుట చూచి **యావె** సెలవిచ్చినట్టు తన హృదయమును కఠినపరచుకొని వారి మాట వినకపోయెను.।
16.అందుకు **యావె** మోషేతో నీవు నీ కఱ్ఱ చాపి యీ దేశపు ధూళిని కొట్టుము. అది ఐగుప్తు దేశమందంతటను పేలగునని అహరోనుతో చెప్పుమనగా వారు అట్లు చేసిరి.।
17.అహరోను తన చెయ్యి చాపి ఆ దేశపు ధూళిని కొట్టినప్పుడు పేలు[1] (లేక మిన్నల్లి) మనుష్యులమీదను జంతువులమీదను ఉండెను; ఐగుప్తు దేశమందంతటను ఆ దేశపు ధూళి అంతయు పేలాయెను.।
18.శకునగాండ్రు కూడ పేలను పుట్టించవలెనని తమ మంత్రములచేత అట్లు చేసిరి గాని అది వారివలన కాకపోయెను. పేలు మనుష్యులమీదను జంతువులమీదను ఉండగా ।
19.శకునగాండ్రు-ఇది **యావె** శక్తి[2] (మూలభాషలో ఎలోహీం వ్రేలు)అని ఫరోతో చెప్పిరి. అయితే **యావె** చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను, అతడు వారిమాట వినకపోయెను.।
20.కాబట్టి **యావె** మోషేతో-నీవు ప్రొద్దున లేచి ఫరో యెదుట నిలువుము, ఇదిగో అతడు ఏటియొద్దకు పోవును. నీవు అతని చూచి-నన్ను సేవించుటకు నా ప్రజలను పోనిమ్ము.।
21.నీవు నా ప్రజలను పోనియ్యని యెడల చూడుము నేను నీ మీదికిని నీ సేవకుల మీదికిని నీ ప్రజలమీదికిని నీ యిండ్లలోనికి ఈగల గుంపులను పంపెదను; ఐగుప్తీయుల యిండ్లును వారున్న ప్రదేశమును ఈగల గుంపులతో నిండియుండును.।
22.మరియు భూలోకములో నేనే **యావె**ను అని నీవు తెలిసికొనునట్లు, ఆ దినమున నేను నా ప్రజలు నివసించుచున్న గోషెను దేశమును వినాయించెదను, అక్కడ ఈగలగుంపులుండవు.।
23.నా ప్రజలను నీ ప్రజలనుండి ప్రత్యేకపరచెదను, రేపు ఈ సూచకక్రియ జరుగునని **యావె** సెలవిచ్చినట్టు నీవు చెప్పవలెననెను.।
24.**యావె** ఆలాగు చేసెను. బాధకరమైన ఈగలగుంపులు ఫరో యింటిలోకిని అతని సేవకుల యిండ్లలోకిని వచ్చి ఐగుప్తు దేశమంతట వ్యాపించెను. ఆ దేశము ఈగల గుంపులవలన చెడిపోయెను.।
25.అప్పుడు ఫరో మోషే అహరోనులను పిలిపించి-మీరు వెళ్లి ఈ దేశములో మీ ఎలోహీంకు బలి అర్పించుడని వారితో చెప్పగా ।
26.మోషే-అట్లు చేయతగదు; మా ఎలోహీమైన **యావె**కు మేము అర్పించవలసిన బలి ఐగుప్తీయులకు హేయము ఇదిగో మేము ఐగుప్తీయులకు హేయమైన బలిని వారి కన్నుల యెదుట అర్పించిన యెడల వారు మమ్ము రాళ్లతో కొట్టి చంపుదురు గదా.।
27.మేము అరణ్యములోనికి మూడు దినముల ప్రయాణమంత దూరము పోయి మా ఎలోహీమైన **యావె** మాకు సెలవిచ్చినట్లు ఆయనకు బలి నర్పించుదుమనెను.।
28.అందుకు ఫరో-మీరు అరణ్యములో మీ ఎలోహీమైన **యావె**కు బలి నర్పించుటకు మిమ్మును పోనిచ్చెదను గాని దూరము పోవద్దు; మరియు నా కొరకు వేడుకొనుడనెను.।
29.అందుకు మోషే-నేను నీ యొద్దనుండి వెళ్లి రేపు ఈ యీగల గుంపులు ఫరోయొద్దనుండియు అతని సేవకుల యొద్దనుండియు అతని జనుల యొద్దనుండియు తొలగిపోవునట్లు **యావె**ను వేడుకొందును గాని, **యావె**కు బలి అర్పించుటకు ఫరో జనులను పోనియ్యక ఇకను వంచన చేయకూడదని చెప్పి ।
30.ఫరో యొద్దనుండి బయలువెళ్లి **యావె**ను వేడుకొనెను.।
31.**యావె** మోషే మాటచొప్పున చేయగా ఈగల గుంపులు ఫరో యొద్దనుండియు అతని సేవకుల యొద్దనుండియు అతని ప్రజలయొద్దనుండియు తొలగిపోయెను; ఒక్కటియైనను నిలువలేదు.।
32.అయితే ఫరో ఆ సమయము కూడ తన హృదయమును కఠిన పరచుకొని జనులను పోనియ్యడాయెను.।

●9.తరువాత **యావె** మోషేతో ఇట్లనెను-నీవు ఫరో యొద్దకు వెళ్లి-నన్ను సేవించుటకు నా ప్రజలను పోనిమ్ము.।
2.నీవు వారిని పోనియ్యనొల్లక ఇంకను వారిని నిర్బంధించినయెడల ।
3.ఇదిగో **యావె** బాహుబలము పొలములోనున్న నీ పశువులమీదికిని నీ గుఱ్ఱములమీదికిని గాడిదలమీదికిని ఒంటెలమీదికిని ఎద్దులమీదికిని గొఱ్ఱెలమీదికిని వచ్చును, మిక్కిలి బాధకరమైన తెగులు కలుగును.।
4.అయితే **యావె** ఇశ్రాయేలీయుల పశువులను ఐగుప్తు పశువులను వేరుపరచెను;ఇశ్రాయేలీయులకున్న వాటన్నిటిలో ఒక్కటైనను చావదని

హెబ్రీయుల ఎలోహీమగు**యావే** సెలవిచ్చుచున్నాడని అతనితోచెప్పుమనెను
5.మరియు **యావే** కాలము నిర్ణయించి-రేపు **యావే** ఈ దేశములో ఆ కార్యము జరిగించుననెను.।
6.మరునాడు **యావే** ఆ కార్యము చేయగా ఐగుప్తీయుల పశువులన్నియు చచ్చెను గాని ఇశ్రాయేలీయుల పశువులలో ఒకటియు చావలేదు.।
7.ఫరో ఆ సంగతి తెలిసికొన పంపినప్పుడు ఇశ్రాయేలు పశువులలలో ఒకటియు చావలేదు; అయినను అప్పటికిని ఫరో హృదయము కఠినమై నందున జనులను పంపకపోయెను.
8.కాగా **యావే**-మీరు మీ పిడికిళ్లనిండ ఆవపు బుగ్గి తీసికొనుడి, మోషే ఫరో కన్నులయెదుట ఆకాశమువైపు దాని చల్లవలెను.।
9.అప్పుడు ఆ ఐగుప్తు దేశమంతట సన్నపు ధూళియై ఐగుప్తు దేశమంతట మనుష్యులమీదను జంతువులమీదను పొక్కులు పొక్కు దద్దురులగునని మోషే అహరోనులతో చెప్పెను.।
10.కాబట్టి వారు ఆవపుబుగ్గి తీసికొని వచ్చి ఫరో యెదుట నిలిచిరి.మోషే ఆకాశమువైపు దాని చల్లగానే అది మనుష్యులకును జంతువులకును పొక్కులు పొక్కు దద్దురులాయెను.।
11.ఆ దద్దురులవలన శకునగాండ్రు మోషే యెదుట నిలువలేకపోయిరి ఆ దద్దురులు శకునగాండ్రకును ఐగుప్తీయులందరికిని పుట్టెను.।
12.అయినను **యావే** మోషేతో చెప్పినట్లు **యావే** ఫరో హృదయమును కఠినపరచెను, అతడు వారి మాట వినకపోయెను.।
13.తరువాత **యావే** మోషేతో ఇట్లనెను-హెబ్రీయుల ఎలోహీమైన **యావే** ఈలాగు సెలవిచ్చుచున్నాడు; నీవు తెల్లవారగానే లేచిపోయి ఫరో యెదుట నిలిచి-నన్ను సేవించుటకు నా జనులను పోనిమ్ము.।
14.సమస్త భూమిలో నావంటివారెవరును లేరని నీవు తెలిసికొనవలెనని ఈ సారి నేను నా తెగుళ్లన్నియు నీ హృదయము నొచ్చునంతగా నీసేవకుల మీదికిని ఈ ప్రజలమీదికిని పంపెదను, ।
15.భూమిమీద నుండకుండ నీవు నశించిపోవునట్లు నేను నా చెయ్యి చాపియుంటినేని నిన్నును నీ జనులను తెగులుతో కొట్టివేయుదును.।
16.నా బలమును నీకు చూపునట్లును, భూలోకమందంతట నా నామ మును ప్రచురము చేయునట్లును ఇందుకే నేను నిన్ను నియమించితిని.।
17.నీవుఇంక నాప్రజలను పోనియ్యనొల్లకవారిమీద అతిశయపడుచున్నావు
18.ఇదిగో రేపు ఈ వేళకు నేను మిక్కిలి బాధాకరమైన వడగండ్లను కురిపించెదను; ఐగుప్తురాజ్యము స్థాపించిన దినము మొదలుకొని యిది వరకు అందులో అట్టి వడగండ్లు పడలేదు.।
19.కాబట్టి నీవు ఇప్పుడు పంపి నీ పశువులను పొలములో నీకు కలిగినది యావత్తును త్వరగా భద్రముచేయుము. ఇంటికి రప్పింపబడక పొలములో ఉండు ప్రతిమనుష్యుని మీదను జంతువుమీదను వడగండ్లు కురియును, అప్పుడు అవి చచ్చునని చెప్పుమనెను.।
20.ఫరో సేవకులలో **యావే** మాటకు భయపడినవారు తన సేవకులను తన పశువులను ఇండ్లలోనికి త్వరగా రప్పించెను.।
21.అయితే **యావే** మాట లక్ష్యపెట్టనివాడు తనపనివారిని తనపశువులను పొలములో ఉండనిచ్చెను.।
22.**యావే**-నీ చెయ్యి ఆకాశమువైపు చూపుము; ఐగుప్తుదేశమందలి మనుష్యులమీదను జంతువులమీదను పొలముల కూరలన్నిటిమీదను వడగండ్లు ఐగుప్తుదేశమంతట పడునని మోషేతో చెప్పెను.।
23.మోషే తన కఱ్ఱను ఆకాశమువైపు ఎత్తినప్పుడు **యావే** ఉరుములను వడగండ్లను కలుగజేయగా పిడుగులు భూమిమీద పడుచుండెను.**యావే** ఐగుప్తుదేశముమీద వడగండ్లు కురిపించెను.।
24.ఆలాగు వడగండ్లను వడగండ్లతో కలిసిన పిడుగులును బహు బలమైన వాయెను.ఐగుప్తుదేశమందంతటను అది రాజ్యమైనది మొదలుకొని యెన్నడును అట్టివి కలుగలేదు.।
25.ఆ వడగండ్లు ఐగుప్తుదేశమందంతట మనుష్యులనేమి జంతువులనేమి బయటనున్నది యావత్తును నశింపచేసెను.వడగండ్లు పొలములోని ప్రతి కూరను చెడగొట్టెను, పొలములోని ప్రతి చెట్టును విరుగగొట్టెను.।
26.అయితే ఇశ్రాయేలీయులున్న గోషెను దేశములో మాత్రము వడగండ్లు పడలేదు.।
27.ఇది చూడగా ఫరో మోషే అహరోనులను పిలువనంపి-నేను ఈసారి పాపము చేసియున్నాను; **యావే** న్యాయవంతుడు, నేను నా జనులును దుర్మార్గులము;।
28.ఇంతమట్టుకు చాలును; ఇకను బ్రహ్మాండమైన ఉరుములు వడగండ్లు రాకుండునట్లు **యావే**ను వేడుకొనుడి.మిమ్మును పోనిచ్చెదను, మిమ్మును ఇకను నిలుపనని వారితో చెప్పగా ।
29.మోషే అతని చూచి-నేను ఈ పట్టణమునుండి బయలువెళ్లగానే నా చేతులు **యావే** వైపు ఎత్తెదను, ఈ ఉరుములు మానును, ఈ వడగండ్లును ఇకమీదట పడవు. అందువలన భూమి **యావే**దని నీకు తెలియబడును.।
30.అయినను నీవును నీ సేవకులును ఇకను ఎలోహీమైన **యావే**కు భయపడరని నాకు తెలిసియున్నదనెను.।
31.అప్పుడు జనుపచెట్లు పువ్వులు పూసెను, యవలచేలు వెన్నులు వేసినవి గనుక జనుపయవల చేలును చెడగొట్టబడెను గాని ।
32.గోధుమలు మెరపమొలకలు ఎదగనందున అవి చెడగొట్టబడలేదు.।
33.మోషే ఫరోను విడిచి ఆ పట్టణమునుండి బయలువెళ్లి **యావే** వైపు తన చేతులు ఎత్తినప్పుడు ఆ యురుములును వడగండ్లును నిలిచిపోయెను, వర్షము భూమిమీద కురియుట మానెను.।
34.అయితే ఫరో వర్షమును వడగండ్లును ఉరుములును నిలిచిపోవుట చూచి, అతడును అతని సేవకులును ఇంక పాపము చేయుచు తమ హృదయములను కఠినపరచుకొనిరి.।
35.**యావే** మోషే ద్వారా పలికినట్లు ఫరో హృదయము కఠినమాయెను; అతడు ఇశ్రాయేలీయులను పోనియ్యకపోయెను.।

●**10.**కాగా **యావే** మోషేతో-ఫరోయొద్దకు వెళ్లుము. నేనే **యావే**నని మీరు తెలిసికొనునట్లును, నేను చేయు సూచకక్రియలను ఐగుప్తీయుల యెదుట కనుపరచుటకు నేను వారియెడల జరిగించిన వాటిని వారి యెదుట కలుగజేసిన సూచకక్రియలను ।
2.నీవు నీ కుమారునికి నీ కుమారుని కుమారునికి ప్రచురము చేయు నట్లును, నేను అతని హృదయమును అతని సేవకుల హృదయములను కఠిన పరచితిననెను.।
3.కాబట్టి మోషే అహరోనులు ఫరో యొద్దకు వెళ్లి, అతనిని చూచి యాలాగు చెప్పిరి-హెబ్రీయుల ఎలోహీమగు **యావే** సెలవిచ్చినదేమనగా-నీవు ఎన్నాళ్లవరకు నాకు లొంగనొల్లకయుందువు? నన్ను సేవించుటకు నా జనులను పోనిమ్ము.।
4.నీవు నా జనులను పోనియ్యనొల్లనియెడల ఇదిగో రేపు నేను మిడతలను నీ ప్రాంతములోనికి రప్పించెదను.।
5.ఎవడును నేలను చూడలేనంతగా అవి దాని కప్పును. తప్పించుకొనిన శేషమును, అనగా వడగండ్లదెబ్బను తప్పించుకొని మిగిలిన దానిని అవి తినివేయును, పొలములో మొలిచిన ప్రతి చెట్టును అవి తినును.।
6.మరియు అవి నీ యిండ్లలోను నీ సేవకులందరి యిండ్లలోను ఐగుప్తీయులందరి యిండ్లలోను నిండిపోవును. నీ పితరులు గాని నీ పితామహులుగాని యీ దేశములో నుండిన నాటనుండి నేటివరకు అట్టి వాటిని చూడలేదని చెప్పి ఫరో యెదుటనుండి బయలువెళ్లెను.।
7.అప్పుడు ఫరోసేవకులు అతని చూచి-ఎన్నాళ్లవరకు వీడు మనకు ఉరిగా నుండును? తమ ఎలోహీమైన **యావే**ను సేవించుటకు ఈ మనుష్యులను పోనిమ్ము; ఐగుప్తుదేశము నశించినదని నీకింకను తెలియదా అనిరి.।
8.మోషే అహరోనులు ఫరోయొద్దకు మరల రప్పింపబడగా అతడు-మీరు వెళ్లి మీ ఎలోహీమైన **యావే**ను సేవించుడి;అందుకు ఎవరెవరు వెళ్లుదురని వారినడిగెను.।
9.అందుకు మోషే-మేము **యావే**కు పండుగ ఆచరింపవలెను గనుక మా కుమారులను మా కుమార్తెలను మా మందలను మా పశువులను వెంటబెట్టుకొని మా పిన్నపెద్దలతో కూడ వెళ్లెదమనెను.।
10.అందుకతడు-**యావే** మీకు తోడైయుండునా?నేను మిమ్మును మీ

పిల్లలను పోనిచ్చెదనా?ఇదిగో మీరు దురాలోచన గలవారు.।

11.పురుషులైన మీరు మాత్రము వెళ్లి **యావే**ను సేవించుడి; మీరు కోరినది అదే గదా అని వారితో అనగా ఫరో సముఖమునుండి వారు వెళ్లగొట్టబడిరి.।

12.అప్పుడు **యావే** మోషేతో-మిడతలు వచ్చునట్లు ఐగుప్తుదేశముమీద నీ చెయ్యి చాపుము, అవి ఐగుప్తుదేశముమీదికి వచ్చి యీ దేశపు పైరులన్నిటిని, అనగా వడగండ్లు పాడుచేయని వాటినన్నిటిని తినివేయునని చెప్పెను.।

13.మోషే ఐగుప్తుదేశముమీద తన కఱ్ఱను చాపగా **యావే** ఆ పగలంతయు ఆ రాత్రి అంతయు ఆ దేశముమీద తూర్పుగాలిని విసరజేసెను; ఉదయమందు ఆ తూర్పుగాలికి మిడతలు వచ్చెను.।

14.ఆ మిడతలు ఐగుప్తుదేశమంతటిమీదికి వచ్చి ఐగుప్తు సమస్త ప్రాంతములలో నిలిచెను. అవి మిక్కిలి బాధకరమైనవి, అంతకు మునుపు అట్టి మిడతలు ఎప్పుడును ఉండలేదు. తరువాత అట్టివి ఉండబోవు. అవి నేలంతయు కప్పెను.।

15.ఆ దేశమున చీకటి కమ్మెను, ఆ దేశపు కూరగాయలన్నిటిని ఆ వడగండ్లు పాడుచేయని వృక్షఫలములన్నిటిని అవి తినివేసెను .ఐగుప్తుదేశ మంతట చెట్లేగాని పొలముల కూరయే గాని పచ్చనిదేదియు మిగిలియుండ లేదు.।

16.కాబట్టి ఫరో మోషే అహరోనులను త్వరగా పిలిపించి-నేను మీ ఎలోహీమైన **యావే** యెడల మీ యెడలను పాపముచేసితిని.।

17.మీరు దయచేసి, యీసారి మాత్రమే నా పాపము క్షమించి, నా మీదనుండి యీ చావు మాత్రము తొలగించుమని మీ ఎలోహీమైన **యావే**ను వేడుకొనుడనగా ।

18.అతడు ఫరోయొద్దనుండి బయలువెళ్లి **యావే**ను వేడుకొనెను.।

19.అప్పుడు **యావే** గాలిని త్రిప్పి మహాబలమైన పడమటిగాలిని విసర జేయగా అది ఆ మిడతలను కొంచుపోయి ఎఱ్ఱసముద్రములో పడవేసెను. ఐగుప్తు సమస్తప్రాంతములలో ఒక్క మిడతయైనను నిలువలేదు.।

20.అయినను **యావే** ఫరో హృదయమును కఠినపరచెను; అతడు ఇశ్రాయేలీయులను పోనియ్యడాయెను.।

21.అందుకు **యావే** మోషేతో-ఆకాశమువైపు నీ చెయ్యి చాపుము. ఐగుప్తుదేశము మీద చీకటి[1] (తడవులాడునంత చీకటి) చేతికి తెలియనంత చిక్కని చీకటి కమ్మునననెను.।

22.మోషే ఆకాశమువైపు తన చెయ్యి యెత్తినప్పుడు ఐగుప్తుదేశమంతయు మూడు దినములు గాఢాంధకారమాయెను.।

23.మూడు దినములు ఒకని నొకడు కనుగొనలేదు, ఎవడును తానున్న చోటనుండి లేవలేకపోయెను; అయినను ఇశ్రాయేలీయులకందరికి వారి నివాసములలో వెలుగుండెను.।

24.ఫరో మోషేను పిలిపించి-మీరు వెళ్లి **యావే**ను సేవించుడి. మీ మందలు మీ పశువులు మాత్రమే ఇక్కడ ఉండవలెను, మీ బిడ్డలతో మీరు వెళ్లవచ్చుననగా ।

25.మోషే-మేము మా ఎలోహీమైన **యావే**కు అర్పింపవలసిన బలుల నిమిత్తమును హోమార్పణలనిమిత్తమును నీవు మాకు పశువులనియ్య వలెను.।

26.మా పశువులును మాతోకూడ రావలెను. ఒక డెక్కయైనను విడువ బడదు, మా ఎలోహీమైన **యావే**ను సేవించుటకు వాటిలోనుండి తీసికొన వలెను. మేము దేనితో **యావే**ను సేవింపవలెనో అక్కడ చేరకమునుపు మాకు తెలియదనెను.।

27.అయితే **యావే** ఫరో హృదయమును కఠినపరపగా అతడు వారిని పోనియ్యనొల్లక యుండెను.।

28.గనుక ఫరో-నా యెదుటనుండి పొమ్ము భద్రము సుమీ; నా ముఖము ఇకను చూడవద్దు,నీవు నా ముఖమును చూచు దినమున మరణ మవుదువని అతనితో చెప్పెను.।

29.అందుకు మోషే-నీవన్నది సరి, నేనికను నీ ముఖము చూడననెను.।

●**11.**మరియు **యావే** మోషేతో ఇట్లనెను-ఫరో మీదికిని ఐగుప్తు మీదికిని ఇంకొక తెగులును రప్పించెదను. అటుతరువాత అతడు ఇక్కడనుండి మిమ్మును పోనిచ్చునప్పుడు ఇక్కడనుండి మిమ్మును బొత్తిగా వెళ్లగొట్టును.।

2.కాబట్టి తన చెలికానియొద్ద ప్రతి పురుషుడును తన చెలికత్తెయొద్ద ప్రతి స్త్రీయును వెండి నగలను బంగారు నగలను అడిగి తీసికొనుడని ప్రజలతో చెప్పుము.।

3.**యావే** ప్రజలయెడల ఐగుప్తీయులకు కటాక్షము కలుగజేసెను; అదిగాక ఐగుప్తుదేశములో మోషే అను మనుష్యుడు ఫరో సేవకుల దృష్టికిని ప్రజల దృష్టికిని మిక్కిలి గొప్పవాడాయెను.

4.మోషే ఫరోతో ఇట్లనెను-**యావే** సెలవిచ్చినదేమనగా-మధ్యరాత్రి నేను ఐగుప్తుదేశములోనికి బయలు వెళ్లెదను.।

5.అప్పుడు సింహాసనముమీద కూర్చున్న ఫరో తొలిపిల్ల మొదలుకొని తిరుగలివిసురుదాని తొలిపిల్లవరకు ఐగుప్తుదేశమందలి తొలిపిల్లలందరును చచ్చెదరు; జంతువులలోను తొలిపిల్లలన్నియు చచ్చును.।

6.అప్పుడు ఐగుప్తుదేశమందంతట మహాఘోష పుట్టును. అట్టి ఘోష అంతకుముందు పుట్టలేదు.అట్టిది ఇకమీదట పుట్టదు.।

7.**యావే** ఐగుప్తీయులను ఇశ్రాయేలీయులను వేరుపరచునని మీకు తెలియబడునట్లు,మనుష్యులమీదగాని జంతువులమీదగాని ఇశ్రాయేలీ యులలో ఎవరిమీదనైనను ఒక కుక్కయు తన నాలుక ఆడించదు.।

8.అప్పుడు నీ సేవకులైన వీరందరు నా యొద్దకు వచ్చి నాకు నమస్కారము చేసి-నీవును, నిన్ను ఆశ్రయించియున్న యీ ప్రజలందరును బయలు వెళ్లుడని చెప్పుదురు. ఆ తరువాత నేను వెళ్లుదుననెను. మోషే ఆలాగు చెప్పి ఫరో యొద్దనుండి అత్యాగ్రహముతో వెళ్లిపోయెను.।

9.అప్పుడు **యావే**-ఐగుప్తుదేశములో నా మహాత్కార్యములు విస్తారమగు నట్లు ఫరో మీ మాట వినడని మోషేతో చెప్పెను.।

10.మోషే అహరోనులు ఫరో యెదుట ఈ మహాత్కార్యములను చేసిరి. అయినను **యావే** ఫరో హృదయమును కఠినపరపగా అతడు తన దేశము లోనుండి ఇశ్రాయేలీయులను పోనియ్యడాయెను.।

●**12.**మోషే అహరోనులు ఐగుప్తుదేశములో ఉండగా **యావే** వారితో ఈలాగు సెలవిచ్చెను ।

2.-నెలలో ఈ నెల మీకు మొదటిది, యిది మీ సంవత్సరమునకు మొదటి నెల.।

3.మీరు ఇశ్రాయేలీయుల సర్వసమాజముతో-ఈ నెల దశమినాడు వారు తమ తమ కుటుంబముల లెక్కచొప్పున ఒక్కొక్కడు గొఱ్ఱెపిల్లనైనను, మేకపిల్లనైనను, అనగా ప్రతి యింటికిని ఒక గొఱ్ఱెపిల్లనైనను ఒక మేకపిల్లనైనను తీసికొనవలెను.।

4.ఆ పిల్లను తినుటకు ఒక కుటుంబము చాలకపోయినయెడల వాడును వాని పొరుగువాడును తమ లెక్కచొప్పున దాని తీసికొనవలెను.।

5.ఆ గొఱ్ఱెపిల్లను భుజించుటకు ప్రతివాని భోజనము పరిమితినిబట్టి వారిని లెక్కింపవలెను.।

6.నిర్దోషమైన యేడాది మగపిల్లను తీసికొనవలెను. గొఱ్ఱెలలోనుండి యైనను మేకలలోనుండియైనను దాని తీసికొనవచ్చును.।

7.ఈ నెల పదునాలుగవ దినమువరకు మీరు దాని నుంచుకొనవలెను; తరువాత ఇశ్రాయేలీయులసమాజపు వారందరు తమ తమ కూటములలో సాయంకాలమందు దాని చంపి దాని రక్తము కొంచెము తీసి తాము దాని తిని యిండ్ల ద్వారబంధపు రెండు నిలువు కమ్ములమీదను పైకమ్మి మీదను చల్లి ।

8.ఆ రాత్రియే వారు అగ్నిచేత కాల్చబడిన ఆ మాంసమును పొంగని రొట్టెలను తినవలెను. చేదుకూరలతో దాని తినవలెను.।

9.దాని తలను దాని కాళ్లను దాని ఆంత్రములను అగ్నితో కాల్చి దాని తినవలెను;।

10.దానిలో ఉడికి ఉడకనిదైనను నీళ్లతో వండబడినదైనను తినవే తినకూడదు; ఉదయకాలమువరకు దానిలోనిదేదియు మిగిలింపకూడదు. ఉదయకాలమువరకు దానిలో మిగిలినది అగ్నితో కాల్చివేయవలెను.।

11.మీరు దానిని తినవలసిన విధమేదనగా, మీ నడుము కట్టుకొని మీ చెప్పులు తొడుగుకొని మీ కఱ్ఱలు చేత పట్టుకొని, త్వరపడుచు దాని తినవలెను; అది **యావే**కు పస్కా బలి.।
12.ఆ రాత్రి నేను ఐగుప్తుదేశమందు సంచరించి, ఐగుప్తు దేశమందలి మనుష్యులలోనేగాని జంతువులలోనేగాని తొలి సంతతియంతయు హతముచేసి, ఐగుప్తు దేవతలకందరికిని తీర్పు తీర్చెదను; నేను **యావే**ను.।
13.మీరున్న యిండ్లమీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తము చూచి మిమ్మును నశింపచేయక దాటిపోయెదను.నేను ఐగుప్తు దేశమును పాడుచేయుచుండగా మిమ్ము సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు.।
14.కాబట్టి యీ దినము మీకు జ్ఞాపకార్థమైన దినము. మీరు **యావే**కు పండుగగా దాని నాచరింపవలెను; తరతరములకు నిత్యమైన కట్టడగా దాని నాచరింపవలెను।
15.ఏడుదినములు పులియని రొట్టెలను తినవలెను.మొదటిదినమున మీ యిండ్లలో నుండి పొంగినది పారవేయవలెను. మొదటి దినము మొదలుకొని యేడవ దినమువరకు పులిసినదానిని తిను ప్రతిమనుష్యుడు ఇశ్రాయేలీయులలోనుండి కొట్టివేయబడును.।
16.ఆ మొదటి దినమున మీరు పరిశుద్ధ సమాజముగాను, ఏడవ దినమున పరిశుద్ధ సమాజముగాను కూడుకొనవలెను.ఆ దినములయందు ప్రతివాడు తినవలసినది మాత్రమే మీరు సిద్ధపరచవచ్చును;అదియు గాక మరి ఏ పనియు చేయకూడదు.।
17.పులియని రొట్టెల పండుగను మీరు ఆచరింపవలెను.ఈ దినమందే నేను మీ సమూహములను ఐగుప్తుదేశములోనుండి వెలుపలికి రప్పించితిని గనుక మీరు మీ తరములన్నిటిలో ఈ దినము నాచరింపవలెను; ఇది మీకు నిత్యమైన కట్టడగా ఉండును.।
18.మొదటి నెల పదునాలుగవ దినము సాయంకాలము మొదలుకొని ఆ నెల యిరువది యొకటవ దినము సాయంకాలము వరకు మీరు పులియని రొట్టెలను తినవలెను.।
19.ఏడు దినములు మీ యిండ్లలో పొంగినదేదియు ఉండకూడదు, పులిసిన దానిని తినువాడు అన్యుడేగాని దేశములో పుట్టినవాడేగాని ఇశ్రాయేలీయుల సమాజములో నుండక కొట్టివేయబడును.।
20.మీరు పులిసినదేదియు తినక మీ నివాసములన్నిటిలోను పులియని వాటినే తినవలెనని చెప్పుమనెను.
21.కాబట్టి మోషే ఇశ్రాయేలీయుల పెద్దల నందరిని పిలిపించి వారితో ఇట్లనెను-మీరు మీ కుటుంబముల చొప్పున మందలోనుండి పిల్లను తీసికొని పస్కాపశువును వధించుడి.।
22.మరియు హిస్సోపు కుంచె తీసికొని పళ్లెములోనున్న రక్తములో దాని ముంచి, ద్వారబంధపు పైకమ్మికిని రెండు నిలువు కమ్ములకును పళ్లెములోని రక్తమును తాకింపవలెను. తరువాత మీలో నెవరును ఉదయమువరకు తన యింటి ద్వారమునుండి బయలువెళ్లకూడదు.।
23.**యావే** ఐగుప్తీయులను హతము చేయుటకు దేశ సంచారము చేయుచు, ద్వారబంధపు పైకమ్మి మీదను రెండు నిలువు కమ్ములమీదను ఉన్న రక్తమును చూచి **యావే** ఆ తలుపును దాటిపోవును; మిమ్ము హతముచేయుటకు మీ యిండ్లలోనికి సంహారకుని చొరనియ్యడు.।
24.కాబట్టి మీరు నిరంతరము మీకును మీ కుమారులకును దీనిని కట్టడగా ఆచరింపవలెను.।
25.**యావే** తాను సెలవిచ్చినట్లు మీ కిచ్చుచున్నదేశమందు మీరు ప్రవేశించిన తరువాత మీరు దీని నాచరింపవలెను.।
26.మరియు మీ కుమారులు-మీరు ఆచరించు ఈ ఆచారమేమిటని మిమ్ము నడుగునప్పుడు ।
27.మీరు-ఇది **యావే**కు పస్కాబలి; ఆయన ఐగుప్తీయులను హతము చేయుచు మన యిండ్లను కాచినప్పుడు ఆయన ఐగుప్తులో నున్న ఇశ్రాయేలీయుల యిండ్లను విడిచి పెట్టెను అనవలెనని చెప్పెను. అప్పుడు ప్రజలు తలలు వంచి నమస్కారముచేసిరి.।
28.అప్పుడు ఇశ్రాయేలీయులు వెళ్లి ఆలాగుచేసిరి; **యావే** మోషే అహరోనులకు ఆజ్ఞాపించినట్లే చేసిరి.
29.అర్థరాత్రివేళ జరిగినదేమనగా, సింహాసనముమీద కూర్చున్న ఫరో మొదలుకొని చెరసాలలోనున్న ఖైదీయొక్క తొలిపిల్ల వరకు ఐగుప్తు దేశమందలి తొలిపిల్లల నందరిని పశువుల తొలిపిల్లలనన్నిటిని **యావే** హతము చేసెను.।
30.ఆ రాత్రి ఫరోయు అతని సేవకులందరును ఐగుప్తీయులందరును లేచినప్పుడు శవములేని ఇల్లు ఒకటైన లేకపోయినందున ఐగుప్తులో మహాఘోష పుట్టెను.।
31.ఆ రాత్రివేళ ఫరో మోషే అహరోనులను పిలిపించి వారితో-మీరును ఇశ్రాయేలీయులును లేచి నా ప్రజలమధ్యనుండి బయలు వెళ్లుడి, మీరు చెప్పినట్లు పోయి **యావే**ను సేవించుడి.।
32.మీరు చెప్పినట్లు మీ మందలను మీ పశువులను తీసికొని పోవుడి; నన్ను దీవించుడని చెప్పెను.।
33.ఐగుప్తీయులు-మనమందరము చచ్చినవారమనుకొని, తమ దేశములో నుండి ప్రజలను పంపుటకు త్వరపడి వారిని బలవంతము చేసిరి.
34.కాబట్టి ప్రజలు తమ పిండిముద్దను తీసికొని అది పులియక మునుపే పిండి పిసుకు తొట్లలో దానిని మూటకట్టుకొని, తమ భుజముల మీద పెట్టుకొని పోయిరి.।
35.ఇశ్రాయేలీయులు మోషే మాటచొప్పున చేసి ఐగుప్తీయులయొద్ద వెండి బంగారు నగలను వస్త్రములను అడిగి తీసికొనిరి.।
36.**యావే** ప్రజలయెడల ఐగుప్తీయులకు కటాక్షము కలుగజేసెను గనుక వారు వారికి కావలసినవాటిని ఇచ్చిరి. అట్లు వారు ఐగుప్తీయులను దోచుకొనిరి.।
37.అప్పుడు ఇశ్రాయేలీయులు రామసేసునుండి సుక్కోతుకు ప్రయాణమై పోయిరి వారు పిల్లలు గాక కాల్బలము ఆరులక్షల వీరులు.।
38.అనేకులైన అన్యజనుల సమూహమును, గొఱ్ఱెలు ఎద్దులు మొదలైన పశువుల గొప్ప మందయును వారితోకూడ బయలుదేరెను.।
39.వారు ఐగుప్తులో నుండి తెచ్చిన పిండి ముద్దతో పొంగని రొట్టెలు చేసి కాల్చిరి. వారు ఐగుప్తులోనుండి వెళ్లగొట్టబడి తడవుచేయలేకపోయిరి గనుక అది పులిసి యుండలేదు, వారు తమ కొరకు వేరొక ఆహారమును సిద్ధపరచుకొనియుండలేదు.।
40.ఇశ్రాయేలీయులు ఐగుప్తులో నివసించిన కాలము నాలుగు వందల ముప్పది సంవత్సరములు.।
41.ఆ నాలుగు వందల ముప్పది సంవత్సరములు గడిచిన తరువాత జరిగినదేమనగా, ఆ దినమందే **యావే** సేనలన్నియు ఐగుప్తుదేశములో నుండి బయలుదేరిపోయెను.।
42.ఆయన ఐగుప్తుదేశములో నుండి వారిని బయటికి రప్పించినందుకు ఇది **యావే**కు ఆచరింపదగిన రాత్రి. ఇశ్రాయేలీయులందరు తమ తమ తరములలో **యావే**కు ఆచరింపవలసిన రాత్రి యిదే.
43.మరియు **యావే** మోషే అహరోనులతో ఇట్లనెను-ఇది పస్కా పండుగను గూర్చిన కట్టడ; అన్యుడెవడును దాని తినకూడదు గాని ।
44.వెండితో కొనబడిన దాసుడు సున్నతిపొందినవాడైతే దాని తినవచ్చును.।
45.పరదేశియు కూలికివచ్చిన దాసుడును దాని తినకూడదు.।
46.మీరు ఒక్క యింటిలోనే దాని తినవలెను దాని మాంసములో కొంచెమైనను ఇంటిలోనుండి బయటికి తీసికొని పోకూడదు, దానిలో ఒక్క యెముకనైనను మీరు విరువకూడదు.।
47.ఇశ్రాయేలీయుల సర్వసమాజము ఈ పండుగను ఆచరింపవలెను.।
48.నీ యొద్ద నివసించు పరదేశి **యావే** పస్కాను ఆచరింపగోరినయెడల అతనికి కలిగిన ప్రతి మగవాడు సున్నతి పొందవలెను; తరువాత అతడు సమాజములో చేరి దానిని ఆచరింపవచ్చును. అట్టివాడు మీ దేశములో పుట్టినవానితో సమముగను సున్నతి పొందనివాడు దానిని తినకూడదు.।
49.దేశస్థునికిని మీలో నివసించు పరదేశికిని దీని గూర్చి ఒకటే విధి యుండవలెననెను.।
50.ఇశ్రాయేలీయులందరు ఆలాగు చేసిరి; **యావే** మోషే అహరోనులకు

ఆజ్ఞాపించినట్లు చేసిరి.।
51.**యావె** ఇశ్రాయేలీయులను వారి వారి సమూహముల చొప్పున ఆనాడే
ఐగుప్తు దేశములోనుండి వెలుపలికి రప్పించెను.।

●**13.**మరియు **యావె** మోషేతో ఈలాగు సెలవిచ్చెను ।
2.-ఇశ్రాయేలీయులలో మనుష్యులయొక్కయు పశువులయొక్కయు
ప్రథమసంతతి, అనగా ప్రతి తొలిచూలు పిల్లను నాకు ప్రతిష్ఠించుము;
అది నాదని చెప్పెను.।
3.మోషే ప్రజలతో నిట్లనెను-మీరు దాసగృహమైన ఐగుప్తునుండి
బయలుదేరివచ్చిన దినమును జ్ఞాపకము చేసికొనుడి.**యావె** తన బాహు
బలముచేత దానిలోనుండి మిమ్మును బయటికి రప్పించెను; పులిసిన
దేదియు తినవద్దు.।
4.అబీబు నెలలో ఈ దినమందే మీరు బయలుదేరి వచ్చితిరిగదా.।
5.**యావె**-నీకిచ్చెదనని నీ పితరులతో ప్రమాణము చేసినట్లు, కనానీ
యులకు హిత్తీయులకు అమోరీయులకు హివ్వీయులకు యెబూసీయులకు
నివాసస్థానమైయుండు, పాలు తేనెలు ప్రవహించు దేశమునకు నిన్ను
రప్పించిన తరువాత నీవు ఈ ఆచారమును ఈ నెలలోనే జరుపుకొనవలెను
6.ఏడు దినములు నీవు పులియని రొట్టెలను తినవలెను, ఏడవ దినమున
**యావె** పండుగ ఆచరింపవలెను, ।
7.పులియని వాటినే యేడు దినములు తినవలెను. పులిసినదేదియు
నీయొద్ద కనబడకూడదు. నీ ప్రాంతములన్నిటిలోను పొంగినదేదియు నీ
యొద్ద కనబడకూడదు.।
8.మరియు ఆ దినమున నీవు-నేను ఐగుప్తులోనుండి వచ్చినప్పుడు **యావె**
నాకు చేసినదాని నిమిత్తము పొంగని రొట్టెలను తినుచున్నానని నీ
కుమారునికి తెలియచెప్పవలెను.।
9.**యావె** ధర్మశాస్త్రము నీ నోట నుండునట్లు బలమైన చేతితో **యావె**
ఐగుప్తులోనుండి నిన్ను బయటికి రప్పించెననుటకు, ఈ ఆచారము నీ
చేతిమీద నీకు సూచనగాను నీ కన్నుల మధ్య జ్ఞాపకార్థముగా ఉండును.।
10.కాబట్టి ప్రతిసంవత్సరము ఈ కట్టడను దాని నియామక కాలమున
ఆచరింపవలెను.।
11.**యావె** నీతోను నీ పితరులతోను ప్రమాణము చేసినట్లు ఆయన
కనానీయుల దేశములోనికి నిన్ను చేర్చి దానిని నీకిచ్చిన తరువాత.।
12.ప్రతి తొలి చూలిపిల్లను, నీకు కలుగు పశువుల సంతతిలో ప్రతి
తొలి పిల్లను **యావె**కు ప్రతిష్ఠింపవలెను. వానిలో మగసంతానము
**యావె**దగును.।
13.ప్రతి గాడిద తొలి పిల్లను వెలయిచ్చి విడిపించి దానికి మారుగా
గొఱ్ఱెపిల్లను ప్రతిష్ఠింపవలెను. అట్లు దానిని విడిపించనియెడల దాని
మెడను విరుగదీయవలెను.నీ కుమారులలో తొలిచూలియైన ప్రతి
మగవానిని వెలయిచ్చి విడిపింపవలెను.।
14.ఇకమీదట నీ కుమారుడు-ఇది ఏమిటని నిన్ను అడుగునప్పుడు నీవు
వాని చూచి-బాహుబలముచేత **యావె** దాసగృహమైన ఐగుప్తులోనుండి
మనలను బయటికి రప్పించెను.।
15.ఫరో మనలను పోనియ్యకుండ తన మనస్సును కఠినపరచుకొనగా
**యావె** మనుష్యుల తొలి సంతానమేమి జంతువుల తొలి సంతానమేమి
ఐగుప్తుదేశములో తొలి సంతానమంతయు సంహరించెను. ఆ హేతువు
చేతను నేను మగదైన ప్రతి తొలిచూలు పిల్లను **యావె**కు బలిగా
అర్పించుదును; అయితే నా కుమారులలో ప్రతి తొలిసంతానము వెల
యిచ్చి విడిపించుదునని చెప్పవలెను.।
16.బాహు బలముచేత **యావె** మనలను ఐగుప్తులోనుండి బయటికి
రప్పించెను గనుక ఆ సంగతి నీ చేతిమీద సూచనగాను నీ కన్నుల
మధ్యలలాట పత్రికగాను ఉండవలెను అని చెప్పెను.।
17.మరియు ఫరో ప్రజలను పోనియ్యగా ఎలోహీం-ఈ ప్రజలు యుద్ధము
చూచునప్పుడు వారు పశ్చాత్తాపపడి ఐగుప్తునకు తిరుగుదురేమో అనికొని,
ఫిలిష్తీయులదేశము సమీపమైనను ఆ మార్గమున వారిని నడిపింపలేదు.।
18.అయితే ఎలోహీం ప్రజలను చుట్టుదారియగు ఎఱ్ఱసముద్రపు
అరణ్యమార్గమున నడిపించెను. ఇశ్రాయేలీయులు యుద్ధసన్నద్ధులై
ఐగుప్తులోనుండి వచ్చిరి.।
19.మరియు మోషే యోసేపు యెముకలను తీసికొని వచ్చెను. అతడు
-ఎలోహీం నిశ్చయముగా దర్శనమిచ్చును; అప్పుడు మీరు నా ఎముకలను
ఇక్కడ నుండి తీసికొని పోవలెనని ఇశ్రాయేలీయుల చేత రూఢిగా
ప్రమాణము చేయించుకొని యుండెను.।
20.వారు సుక్కోతునుండి ప్రయాణమై పోయి, అరణ్యము దగ్గరనున్న
ఏతాములో దిగిరి.।
21.వారు పగలు రాత్రియు ప్రయాణము చేయునట్లుగా **యావె** త్రోవలో
వారిని నడిపించుటకై పగటివేళ మేఘస్తంభములోను, వారికి వెలుగి
చ్చుటకు రాత్రివేళ అగ్నిస్తంభములోను, ఉండి వారికి ముందుగా
నడుచుచు వచ్చెను.।
22.ఆయన పగటివేళ మేఘస్తంభమునైనను రాత్రివేళ అగ్నిస్తంభమునైనను
ప్రజలయెదుటనుండి తొలగింపలేదు.।

●**14.**మరియు **యావె** మోషేతో ఈలాగు సెలవిచ్చెను ।
2.-ఇశ్రాయేలీయులు తిరిగి పీహహీరోతు ఎదుటను, అనగా మిగ్దోలుకు
సముద్రమునకు మధ్యనున్న బయల్సెఫోను నెదుటను, దిగవలెనని వారితో
చెప్పుము, దాని యెదుటి సముద్రమునొద్ద వారు దిగవలెను.।
3.ఫరో ఇశ్రాయేలీయులనుగూర్చి-వారు ఈదేశములో చిక్కుబడి
యున్నారు; అరణ్యము వారిని మూసివేసెనని అనుకొనును.।
4.అయితే నేను ఫరో హృదయమును కఠినపరచెదను; అతడు వారిని
తరుమగా, నేను ఫరోవలనను అతని సమస్త సేనవలనను మహిమ
తెచ్చుకొందును; నేను **యావె**నని ఐగుప్తీయులందరు తెలిసికొందురనెను.
వారు ఆలాగు దిగిరి.।
5.ప్రజలు పారిపోయినట్టు ఐగుప్తు రాజునకు తెలుపబడినప్పుడు ఫరో
హృదయమును అతని సేవకుల హృదయమును ప్రజలకు విరోధముగా
త్రిప్పబడి-మనమెందుకీలాగు చేసితిమి? మన సేవలో నుండకుండ
ఇశ్రాయేలీయులను ఎందుకు పోనిచ్చితిమి అని చెప్పుకొనిరి.।
6.అంతట అతడు తన రథమును సిద్ధపరచుకొని, తన జనమును తనతో
కూడ తీసికొని పోయెను.।
7.మరియు అతడు శ్రేష్ఠమైన ఆరువందల రథములను ఐగుప్తు
రథములనన్నిటిని వాటిలో ప్రతిదానిమీద అధిపతులను తోడుకొని
పోయెను.।
8.**యావె** ఐగుప్తురాజైన ఫరో హృదయమును కఠినపరపగా అతడు
ఇశ్రాయేలీయులను తరిమెను. అట్లు ఇశ్రాయేలీయులు బలిమిచేత బయలు
వెళ్లుచుండిరి.।
9.ఐగుప్తీయులు, అనగా ఫరో రథముల గుఱ్ఱములన్నియు అతని గుఱ్ఱపు
రౌతులు అతని దండును వారిని తరిమి, బయల్సెఫోను ఎదుటనున్న
పీహహీరోతునకు సమీపమైన సముద్రము దగ్గర వారు దిగియుండగా
వారిని కలిసికొనిరి.।
10.ఫరో సమీపించుచుండగా ఇశ్రాయేలీయులు కన్నులెత్తి ఐగుప్తీయులు
తమ వెనుక వచ్చుట చూచి మిక్కిలి భయపడి **యావె**కు మొఱపెట్టిరి.।
11.అంతట వారుమోషేతో-ఐగుప్తులో సమాధులు లేవని యీ యరణ్య
ములో చచ్చుటకు మమ్మును రప్పించితివా? మమ్మును ఐగుప్తులోనుండి
రప్పించి మమ్మును ఇట్లు చేయనేల? ।
12.మా జోలికి రావద్దు, ఐగుప్తీయులకు దాసులమగుదుమని ఐగుప్తులో
మేము నీతో చెప్పినమాట యిదే గదా; మేము ఈ అరణ్యమందు
చచ్చుటకంటె ఐగుప్తీయులకు దాసులమగుటయే మేలని చెప్పిరి.।
13.అందుకు మోషే-భయపడకుడి, **యావె** మీకు నేడు కలుగజేయు
రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి; మీరు నేడు చూచిన
ఐగుప్తీయులను ఇకమీదట మరి ఎన్నడును చూడరు.।
14.**యావె** మీ పక్షమున యుద్ధము చేయును, మీరు ఊరకయే
యుండవలెనని ప్రజలతో చెప్పెను.।
15.అంతలో **యావె** మోషేతో-నీవేల నాకు మొఱపెట్టుచున్నావు?

-సాగిపోవుడి అని ఇశ్రాయేలీయులతో చెప్పుము.।
16.నీవు నీ కఱ్ఱను ఎత్తి ఆ సముద్రమువైపు నీ చెయ్యి చాపి దాని
పాయలుగా చేయుము, అప్పుడు ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను
ఆరిన నేలమీద నడిచిపోవుదురు.।
17.ఇదిగో నేను నేనే ఐగుప్తీయుల హృదయమును కఠినపరచుదును.
వారు వీరిని తరుముదురు; నేను ఫరోవలనను అతని సమస్త సేనల
వలనను అతని రథముల వలనను అతని గుఱ్ఱపు రౌతులవలనను నాకు
మహిమ తెచ్చుకొందును.।
18.నేను ఫరోవలనను అతని రథములవలనను అతని గుఱ్ఱపు రౌతుల
వలనను మహిమ తెచ్చుకొనునప్పుడు నేను **యూవె**నని ఐగుప్తీయులు
తెలిసికొందురనెను.।
19.అప్పుడు ఇశ్రాయేలీయుల యెదుట సమూహమునకు ముందుగా
నడిచిన **యూవె** దూత వారి వెనుకకు పోయి వారిని వెంబడించెను; ఆ
మేఘస్తంభము వారి యెదుటనుండి పోయి వారి వెనుక నిలిచెను.।
20.అది ఐగుప్తీయులసేనకు ఇశ్రాయేలీయులసేనకు నడుమ ప్రవేశించెను;
అది మేఘము గనుక వారికి చీకటి కలిగెను గాని, రాత్రి అది వీరికి
వెలుగిచ్చెను గనుక ఆరాత్రి అంతయు ఐగుప్తీయుల సేన ఇశ్రాయేలీ
యులను సమీపింపలేదు.।
21.మోషే సముద్రమువైపు తన చెయ్యి చాపగా **యూవె** ఆ రాత్రి అంతయు
బలమైన తూర్పుగాలిచేత సముద్రమును తొలగించి దానిని ఆరిన నేలగా
చేసెను.।
22.నీళ్లు విభజింపబడగా ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన
నేల మీద నడిచిపోయిరి. ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్కలను వారికి
గోడవలె నుండెను.।
23.ఐగుప్తీయులును ఫరో గుఱ్ఱములును రథములును రౌతులునువారిని
తరిమి సముద్రమధ్యమున చేరిరి.।
24.అయితే వేకువ జామున **యూవె** ఆ అగ్ని మేఘమయమైన స్తంభము
నుండి ఐగుప్తీయులదండు వైపు చూచి ఐగుప్తీయుల దండును కలవరపరచి
25.వారి రథచక్రములు ఊడిపడునట్లు చేయగా వారు బహు కష్టపడి
తోలుచుండిరి. అప్పుడు ఐగుప్తీయులు-ఇశ్రాయేలీయుల యెదుటనుండి
పారిపోయి రండి; **యూవె** వారి పక్షమున మనతో యుద్ధము చేయుచు
న్నాడని చెప్పుకొనిరి.।
26.అంతలో **యూవె** మోషేతో-ఐగుప్తీయుల మీదికిని వారి రథముల
మీదికిని వారి రౌతులమీదికిని నీళ్లు తిరిగి వచ్చునట్లు సముద్రములమీద
నీ చెయ్యి చాపుమనెను.।
27.మోషే సముద్రముమీద తన చెయ్యి చాపగా ప్రొద్దుపొడిచినప్పుడు
సముద్రము అధిక బలముతో తిరిగి పొర్లెను గనుక ఐగుప్తీయులు అది
చూచి వెనుకకు పారిపోయిరి. అప్పుడు **యూవె** సముద్రమధ్యను ఐగుప్తీ
యులను నాశము చేసెను.।
28.నీళ్లు తిరిగివచ్చి ఆ రథములను రౌతులను వారి వెనుక సముద్రము
లోనికి వచ్చిన ఫరోయొక్క సర్వసేనను కప్పివేసెను; వారిలో ఒక్కడైనను
మిగిలి యుండలేదు.।
29.అయితే ఇశ్రాయేలీయులు ఆరిననేలను సముద్రము మధ్యనున్నప్పుడు
ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్కలను గోడవలె నుండెను.।
30.ఆ దినమున **యూవె** ఐగుప్తీయుల చేతిలోనుండి ఇశ్రాయేలీయులను
రక్షించెను. ఇశ్రాయేలీయులు చచ్చిన ఐగుప్తీయులను సముద్రతీరమున
చూచిరి.।
31.**యూవె** ఐగుప్తీయులకు చేసిన గొప్ప కార్యమును ఇశ్రాయేలీయులు
చూచిరి గనుక ఆ ప్రజలు **యూవె**కు భయపడి **యూవె**యందును ఆయన
సేవకుడైన మోషేయందును నమ్మకముంచిరి.।

●**15.**అప్పుడు మోషేయు ఇశ్రాయేలీయులును **యూవె** ను గూర్చి యీ
కీర్తన పాడిరి-

**యూవె** ను గూర్చి గానము చేసెదము
ఆయన మిగుల అతిశయించి జయించెను
గుఱ్ఱమును దాని రౌతును
ఆయన సముద్రములో పడద్రోసెను.

2. **యూవె** యే నా బలము నా గానము
ఆయన నాకు రక్షణయు ఆయెను
ఆయన నా ఎలోహీం ఆయనను వర్ణించెదను
ఆయన నా పితరుల ఎలోహీం
ఆయన మహిమ నుతించెదను
3. **యూవె** యుద్ధశూరుడు
**యూవె** అని ఆయనకు పేరు
4. ఆయన ఫరో రథములను అతని సేనను
సముద్రములో పడద్రోసెను
అతని అధిపతులలో శ్రేష్ఠులు
ఎఱ్ఱసముద్రములో మునిగిపోయిరి
5. అగాధజలములు వారిని కప్పెను
వారు రాతివలె అడుగంటిపోయిరి.
6. **యూవె**, నీ దక్షిణహస్తము బలమొంది అతిశయించుము
**యూవె**, నీ దక్షిణహస్తము శత్రువుని చితకగొట్టుము
7. నీ మీదికి లేచువారిని
నీ మహిమాతిశయమువలన అణచివేయుదువు
నీ కోపాగ్నిని రగులజేయుదువు
అది వారిని చెత్తవలె దహించును.
8. నీ నాసికారంధ్రముల ఊపిరివలన
నీళ్లు రాశిగా కూర్చబడెను
ప్రవాహములు కుప్పగా నిలిచెను
అగాధజలములు సముద్రమధ్య గడ్డకట్టెను
9. -తరిమెదను కలిసికొనియెదను
దోపుడుసొమ్ము పంచుకొనియెదను
వాటివలన నా ఆశ తీర్చుకొనియెదను
నా కత్తి దూసెదను
నా చెయ్యి వారిని నాశనము చేయునని శత్రువనుకొనెను
10. నీవు నీ గాలిని విసరజేసితివి
సముద్రము వారిని కప్పెను
వారు మహా అగాధమైన నీళ్లలో సీసమువలె మునిగిరి.।
11. **యూవె**, వేల్పులలో నీ వంటివాడెవడు
పరిశుద్ధతనుబట్టి నీవు మహానీయుడవు
స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు
అద్భుతములు చేయువాడవు నీవంటివాడెవడు
12. నీ దక్షిణహస్తము చాపితివి
భూమి వారిని మ్రింగివేసెను
13. నీవు విమోచించిన యీ ప్రజలను
నీ కృపచేత తోడుకొనిపోతివి
నీ బలముచేత వారిని నీ పరిశుద్ధాలయమునకు నడిపించితివి
14. జనులు విని దిగులుపడును
ఫిలిష్తీయ నివాసులకు వేదన కలుగును.
15. ఎదోము నాయకులు కలవరపడుదురు
మోయాబు బలిష్ఠులకు వణకు పుట్టును.
కనాను నివాసులందరు దిగులొంది కరిగిపోవుదురు.
భయము అధికభయము వారికి కలుగును.
16. **యూవె** నీ ప్రజలు అద్దరికి చేరువరకు
నీవు సంపాదించిన యీ ప్రజలు అద్దరికి చేరువరకు
నీ బాహుబలముచేత పగవారు రాతివలె కదలకుందురు.
17. నీవు నీ ప్రజలను తోడుకొని వచ్చెదవు
**యూవె**, నీ స్వాస్థ్యమైన కొండమీద
నా సర్వాధికారీ, నీవు నివసించుటకు నిర్మించుకొనిన చోటను
18. నీ చేతులు స్థాపించిన పరిశుద్ధాలయమందు

వారిని నిలువపెట్టెదవు.
యావె నిరంతరము ఏలువాడు.
19. ఫరో గుఱ్ఱములు అతని రథములు అతని రౌతులును సముద్ర
ములో దిగగా యావె వారిమీద సముద్రజలములను మళ్లించెను. అయితే
ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన నేలమీద నడిచిరి.।
20. మరియు అహరోను సహోదరియు ప్రవక్త్రియునగు మిర్యాము
తంబురను చేత పట్టుకొనెను. స్త్రీలందరు తంబురలతోను నాట్యములతోను
ఆమె వెంబడి వెళ్లగా ।
21.మిర్యాము వారితో కలిసి యిట్లు పల్లవి యెత్తి పాడెను-
యావెను గానము చేయుడి
ఆయన మిగుల అతిశయించి జయించెను
గుఱ్ఱమును దాని రౌతును
సముద్రములో ఆయన పడద్రోసెను.
22. మోషే ఎఱ్ఱసముద్రమునుండి జనులను సాగచేయగా వారు షూరు
అరణ్యములోనికి వెళ్లి దానిలో మూడు దినములు నడిచిరి; అచ్చట వారికి
నీళ్లు దొరకలేదు. అంతలో వారు మారాకు చేరిరి.।
23.మారా నీళ్లు చేదైనవి గనుకవారు ఆ నీళ్లు త్రాగలేక పోయిరి.
అందువలన దానికి మారా[1] (అనగా చేదు) అను పేరు కలిగెను.।
24.ప్రజలు-మేమేమి త్రాగుదుమని మోషేమీద సణగుకొనగా ।
25.అతడు యావెకు మొఱపెట్టెను. అంతట యావె అతనికి ఒక చెట్టును
చూపెను.అది ఆ నీళ్లలో వేసిన తరువాత నీళ్లు మధురములాయెను.
అక్కడ ఆయన వారికి కట్టడను విధిని నిర్ణయించి, అక్కడ వారిని పరీక్షించి,।
26.-మీ ఎలోహీమైన యావె వాక్కును శ్రద్ధగా విని ఆయన దృష్టికి
న్యాయమైనది చేసి, ఆయన ఆజ్ఞలకు విధేయులై ఆయన కట్టడలన్నిటిని
అనుసరించి నడచినయెడల, నేను ఐగుప్తీయులకు కలుగజేసిన
రోగములలో ఏదియు మీకు రానియ్యను, నిన్ను స్వస్థపరచు యావెను
నేనే అనెను.।
27.తరువాత వారు ఏలీమునకు వచ్చిరి; అక్కడ పండ్రెండు నీటి బుగ్గలును
డెబ్బది యీతచెట్లును ఉండెను. వారు అక్కడనే నీళ్లయొద్ద దిగిరి.।

●16.తరువాత ఇశ్రాయేలీయుల సమాజమంతయును ఏలీమునుండి
ప్రయాణమైపోయి, వారు ఐగుప్తు దేశములో నుండి బయలుదేరిన
రెండవనెల పదునైదవ దినమున ఏలీమునకును సీనాయికిని మధ్యనున్న
సీను అరణ్యమునకు వచ్చిరి.।
2.ఆ అరణ్యములో ఇశ్రాయేలీయులసమాజమంతయు మోషే అహరోనుల
మీద సణిగెను.।
3.ఇశ్రాయేలీయులు-మేము మాంసము వండుకొని కుండలయొద్ద
కూర్చుండి తృప్తిగా ఆహారము తినునప్పుడు యావె చేతివలన ఏల
చావకపోతిమి? ఈ సర్వసమాజమును ఆకలిచేత చంపుటకు ఈ
అరణ్యములోనికి మమ్మును అక్కడనుండి తోడుకొని వచ్చితిరని వారితో
ననగా ।
4.యావె మోషేను చూచి-ఇదిగో నేను ఆకాశమునుండి మీకొరకు
ఆహారమును కురిపించెదను; వారు నా ధర్మశాస్త్రము ననుసరించి
నడుతురో లేదో అని నేను వారిని పరీక్షించునట్లు ఈ ప్రజలు వెళ్లి ఏనాటి
బత్తెము ఆనాడే కూర్చుకొనవలెను.।
5.మరియు ఆరవదినమునవారు తెచ్చుకొనినదానిని సిద్ధపరచుకొనవలెను.
వారు దినదినమున కూర్చుకొనుదానికంటె అది రెండంతలై యుండవలె
ననెను.।
6.అప్పుడు మోషే అహరోనులు ఇశ్రాయేలీయులందరితో-యావె ఐగుప్తు
దేశములోనుండి మిమ్మును బయటికి రప్పించెనని సాయంకాలమందు
మీకు తెలియబడును.।
7.యావె మీద మీరు సణిగిన సణుగులను ఆయన వినుచున్నాడు;
ఉదయమున మీరు యావె మహిమను చూచెదరు, మేము ఏపాటి
వారము? మామీద సణుగనేల అనిరి.।
8.మరియు మోషే-మీరు తినుటకై సాయంకాలమున మాంసమును
ఉదయమున చాలినంత ఆహారమును యావె మీకియ్యగాను, మీరు
ఆయనమీద సణుగు మీ సణుగులను యావెయే వినుచుండగాను, మేము
ఏపాటివారము? మీ సణుగుట యావెమీదనేగాని మామీద కాదనెను.।
9.అంతట మోషే అహరోనుతో-యావె సన్నిధికి సమీపించుడి; ఆయన
మీ సణుగులను వినెనని నీవు ఇశ్రాయేలీయుల సర్వసమాజముతో
చెప్పుమనెను.।
10.అట్లు అహరోను ఇశ్రాయేలీయుల సర్వసమాజముతో మాటలాడు
చుండగా వారు అరణ్యమువైపు చూచిరి, అప్పుడు యావె మహిమ ఆ
మేఘములో వారికి కనబడెను.।
11.అప్పుడు యావె మోషేతో ఇట్లనెను-నేను ఇశ్రాయేలీయుల సణుగులను
వింటిని.।
12.నీవు-సాయంకాలమున మీరు మాంసము తిందురు, ఉదయమున
ఆహారముచేత తృప్తిపొందుదురు, అప్పుడు మీ ఎలోహీంనైన యావెను
నేనే అని మీరు తెలిసికొందురని వారితో చెప్పుమనెను.।
13.కాగా సాయంకాలమున పూరేడులు వచ్చి వారి పాళెమును కప్పెను.
ఉదయమున మంచు వారి పాళెముచుట్టు పడియుండెను.।
14.పడిన ఆ మంచు ఇరిగిపోయిన తరువాత నూగుమంచువలె సన్నిధి
కణములు అరణ్యపు భూమిమీద కనబడెను.।
15.ఇశ్రాయేలీయులు దాని చూచినప్పుడు అది ఏమైనది తెలియక
-ఇదేమి[2] (హెబ్రీ భాషలో మన్నా) అని ఒకరితో ఒకరు చెప్పుకొనిరి.।
16.మోషే-ఇది తినుటకు యావె మీకిచ్చిన ఆహారము. యావె ఆజ్ఞా
పించినదేమనగా-ప్రతివాడును తనవారి భోజనమునకు, ప్రతివాడు తన
కుటుంబములోని తలకు ఒక్కొక్క ఓమెరుచొప్పున దాని కూర్చుకొనవలెను,
ఒక్కొక్కడు తన గుడారములో నున్నవారికొరకు కూర్చుకొనవలెను.।
17.ఇశ్రాయేలీయులు అట్లు చేయగా కొందరు హెచ్చుగాను కొందరు
తక్కువగాను కూర్చుకొనిరి.।
18.వారు ఓమెరుతో కొలిచినప్పుడు హెచ్చుగా కూర్చుకొనినవారికి
ఎక్కువగా మిగులలేదు తక్కువగా కూర్చుకొనువానికి తక్కువకాలేదు. వారు
తమ తమ యింటి వారి భోజనమునకు సరిగా కూర్చుకొనియుండిరి.।
19.మరియు మోషే-దీనిలో ఏమియు ఉదయమువరకు ఎవడును
మిగుల్చుకొనకూడదని వారితో చెప్పెను.।
20.అయితే వారు మోషే మాట వినక కొందరు ఉదయము వరకు
దానిలో కొంచెము మిగుల్చుకొనగా అది పురుగుపట్టి కంపుకొట్టెను. మోషే
వారిమీద కోపపడగా ।
21.వారు అనుదినము ఉదయమున ఒక్కొక్కడు తన యింటివారి
భోజనమునకు తగినట్టుగా కూర్చుకొనిరి. ఎండ వేడిమికి అది కరిగెను.।
22.ఆరవ దినమున వారు ఒక్కొక్కనికి రెండేసి ఓమెరులచొప్పున
రెండంతలు ఆహారము కూర్చుకొనినప్పుడు సమాజముయొక్క
అధికారులందరు వచ్చి అది మోషేకు తెలిపిరి.।
23.అందుకు అతడు-యావె చెప్పినమాట యిది; రేపు విశ్రాంతిదినము,
అది యావెకు పరిశుద్ధమైన విశ్రాంతిదినము, మీరు కాల్చుకొనవలసినది
కాల్చుకొనుడి, మీరు వండుకొనవలసినది వండుకొనుడి, ఉదయము వరకు
మిగిలినదంతయు మీకొరకు ఉంచుకొనుడని వారితో చెప్పెను.।
24.మోషే ఆజ్ఞాపించినట్లు వారు ఉదయమువరకు దానిని ఉంచుకొనిరి,
అది కంపుకొట్టలేదు, దానికి పురుగుపట్టలేదు.।
25.మోషే-నేడు దాని తినుడి, నేటి దినము యావెకు విశ్రాంతిదినము,
నేడు అది బయట దొరకదు.।
26.ఆరు దినములు దాని కూర్చుకొనవలెను, విశ్రాంతి దినమున అనగా
ఏడవ దినమున అది దొరకదనెను.।
27.అట్లు జరిగెను; ప్రజలలో కొందరు ఏడవ దినమున దాని కూర్చుకొన
వెళ్లగా వారికేమియు దొరకకపోయెను.।
28.అందుకు యావె మోషేతో ఇట్లనెను-మీరు ఎన్నాళ్లవరకు నా ఆజ్ఞలను
నా ధర్మశాస్త్రమును అనుసరించి నడువనొల్లరు?
29.చూడుడి నిశ్చయముగా యావె ఈ విశ్రాంతిదినమును ఆచరించుటకు
సెలవిచ్చెను గనుక ఆరవ దినమున రెండు దినముల ఆహారము మీ

కనుగ్రహించియున్నాడు. ప్రతివాడును తన తన చోట నిలిచియుండవలెను.
ఏడవదినమున ఎవడును తన చోటనుండి బయలు వెళ్లకూడదనెను.।
30.కాబట్టి యేడవ దినమున ప్రజలు విశ్రమించిరి.।
31.ఇశ్రాయేలీయులు దానికి మన్నా అను పేరు పెట్టిరి. అది తెల్లని
కొతిమెరగింజవలె నుండెను.దాని రుచి తేనెతో కలిపిన అపూపములవలె
నుండెను.।
32.మరియు మోషే ఇట్లనెను-**యావె** ఆజ్ఞాపించినదేమనగా-నేను
ఐగుప్తుదేశమునుండి మిమ్మును బయటికి రప్పించినప్పుడు అరణ్యములో
తినుటకు నేను మీకిచ్చిన ఆహారమును మీ వంశస్థులు చూచునట్లు,
వారు తమయొద్ద ఉంచుకొనుటకు దానితో ఒక ఓమెరు పట్టు పాత్రను
నింపుడనెను.।
33.కాబట్టి మోషే అహరోనుతో నీవు ఒక గిన్నెను తీసికొని, దానిలో ఒక
ఓమెరు మన్నాను పోసి, మీ వంశస్థులు తమ యొద్ద ఉంచుకొనుటకు
**యావె** సన్నిధిలో దాని ఉంచుమనెను.।
34.**యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు ఉంచబడుటకు సాక్ష్యపు మందసము
ఎదుట అహరోను దాని పెట్టెను.।
35.ఇశ్రాయేలీయులు నివసింపవలసిన దేశమునకు తాము వచ్చు నలుబది
యేండ్లు మన్నానే తినుచుండిరి; వారు కనానుదేశపు పొలిమేరలు
చేరువరకు మన్నాను తినిరి.।
36.ఓమెరు అనగా ఏపాలో[1] (ఏపా ఇంచుమించు రెండు శేరులనర
కావచ్చును) దశమభాగము.।

●**17.**తరువాత ఇశ్రాయేలీయుల సర్వసమాజము **యావె** మాటచొప్పున
తమ ప్రయాణములలో సీను అరణ్యమునుండి ప్రయాణమైపోయి
రెఫీదీములో దిగిరి.।
ప్రజలు తమకు త్రాగ నీళ్లులేనందున ।
2.మోషేతో వాదించుచు-త్రాగుటకు మాకు నీళ్లిమ్మని అడుగగా-మోషే
మీరు నాతో వాదింపనేల, **యావె**ను శోధింపనేల అని వారితో చెప్పెను.।
3.అక్కడ ప్రజలు నీళ్లులేక దప్పిగొని మోషేమీద సణుగుచు-ఇదెందుకు?
మమ్మును మా పిల్లలను మా పశువులను దప్పిచేత చంపుటకు
ఐగుప్తులోనుండి ఇక్కడికి తీసికొని వచ్చితిరనిరి.।
4.అప్పుడు మోషే **యావె**కు మొఱ్ఱపెట్టుచు-ఈ ప్రజలను నేనేమి
చేయుదును? కొంతసేపటికి నన్ను రాళ్లతో కొట్టి చంపుదురనెను.।
5.అందుకు **యావె**-నీవు ఇశ్రాయేలీయుల పెద్దలలో కొందరిని తీసికొని
ప్రజలకు ముందుగా పొమ్ము; నీవు నదిని కొట్టిన నీ కఱ్ఱను చేత పట్టుకొని
పొమ్ము ।
6.ఇదిగో అక్కడ హోరేబులోని బండమీద నేను నీకు ఎదురుగా
నిలిచెదను; నీవు ఆ బండను కొట్టగా ప్రజలు త్రాగుటకు దానిలోనుండి
నీళ్లు బయలుదేరునని మోషేతో సెలవియ్యగా మోషే ఇశ్రాయేలీయుల
పెద్దల కన్నుల యెదుట అట్లు చేసెను.।
7.అప్పుడు ఇశ్రాయేలీయులు చేసిన వాదమును బట్టియు **యావె** మనమధ్య
ఉన్నాడో లేడో అని వారు **యావె**ను శోధించుటను బట్టియు అతడు ఆ
చోటికి మస్సా[2] (శోధించుట) అనియు మెరీబా[3] (వాదము) అనియు
పేర్లు పెట్టెను.।
8.తరువాత అమాలేకీయులు వచ్చి రెఫీదీములో ఇశ్రాయేలీయులతో
యుద్ధముచేయగా ।
9.మోషే యెహోషువతో-మనకొరకు మనుష్యులను ఏర్పరచి వారిని
తీసికొని బయలువెళ్లి అమాలేకీయులతో యుద్ధము చేయుము; రేపు
నేను ఎలోహీంకఱ్ఱను చేతపట్టుకొని ఆ కొండ శిఖరముమీద నిలిచెదననెను.
10.యెహోషువ మోషే తనతో చెప్పినట్లు చేసి అమాలేకీయులతో యుద్ధ
మాడెను; మోషే అహరోను,హూరు అను వారు ఆ కొండ శిఖరమెక్కిరి.
11.మోషే తన చెయ్యి పైకెత్తినప్పుడు ఇశ్రాయేలీయులు గెలిచిరి; మోషే
తన చెయ్యి దించినప్పుడు అమాలేకీయులు గెలిచిరి.।
12.మోషే చేతులు బరువెక్కగా వారు ఒక రాయి తీసికొని వచ్చి అతడు
దానిమీద కూర్చుండుటకై దాని వేసిరి.అహరోను హూరులు ఒకడు ఈ
ప్రక్కను ఒకడు ఆ ప్రక్కను అతని చేతులను ఆదుకొనగా అతని చేతులు
సూర్యుడు అస్తమించువరకు నిలకడగా ఉండెను.।
13.అట్లు యెహోషువ కత్తివాత చేత అమాలేకీయుల రాజును అతని
జనులను గెలిచెను.।
14.అప్పుడు **యావె** మోషేతో నిట్లనెను-నేను అమాలేకీయుల పేరు
ఆకాశముక్రింద నుండకుండ బొత్తిగా తుడిచివేయుదును గనుక జ్ఞాపకా
ర్థముగా గ్రంథములో దీని వ్రాసి యెహోషువకు వినిపించుము.।
15.తరువాత మోషే ఒక బలిపీఠమును కట్టి దానికి **యావె** నిస్సీ[4]
(అనగా-ధ్వజము) అని పేరు పెట్టి ।
16.-అమాలేకీయులు తమచేతిని **యావె** సింహాసనమునకు విరోధముగా
ఎత్తిరిగనుక **యావె**కు అమాలేకీయులతో తరతరములవరకు యుద్ధమనెను
(పాఠాంతరము-తన చెయ్యి **యావె** సింహాసనమువైపునుంచి తరతరముల
వరకు అమాలేకీయులతో యుద్ధమనెను.)

●**18.**ఎలోహీం మోషేకును తన ప్రజలైన ఇశ్రాయేలీయులకును చేసిన
దంతయు, **యావె** ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి వెలుపలికి రప్పించిన
సంగతియు, మిద్యాను యాజకుడును మోషే మామయైన యిత్రో
వినినప్పుడు ।
2.మోషే మామయైన ఆ యిత్రో తనయొద్దకు పంపబడిన మోషే భార్యయైన
సిప్పోరాను ఆమె యిద్దరి కుమారులను తోడుకొని వచ్చెను.।
3.అతడు-అన్యదేశములో నేను పరదేశిననుకొని వారిలో ఒకనికి గేర్షోము
అని పేరు పెట్టెను.।
4.-నా తండ్రి ఎలోహీం నాకు సహాయమై ఫరో కత్తివాతనుండి నన్ను
తప్పించెననుకొని రెండవవానికి ఎలీయెజెరని[5](**యావె**సహాయము)పేరు
పెట్టెను.।
5.మోషే మామయైన యిత్రో అతని కుమారుల నిద్దరిని అతని భార్యను
తోడుకొని అరణ్యములో ఎలోహీం పర్వతము దగ్గర దిగిన మోషేయొద్దకు
వచ్చెను.।
6.యిత్రో అను నీమామనైన నేనును నీభార్యయు ఆమెతోకూడ ఆమె
యిద్దరుకుమారులును నీయొద్దకు వచ్చియున్నామనిమోషేకు వర్తమానము
పంపగా ।
7.మోషే తన మామను ఎదుర్కొనపోయి వందనము చేసి అతని ముద్దు
పెట్టుకొనెను. వారు ఒకరి క్షేమము ఒకరు తెలిసికొని గుడారములోనికి
వచ్చిరి.।
8.తరువాత మోషే **యావె** ఇశ్రాయేలీయులకొరకు ఫరోకును ఐగుప్తీ
యులకును చేసినదంతయు, త్రోవలో తనకు వచ్చిన కష్టము యావత్తును
**యావె** తమ్మును విడిపించిన సంగతియు తన మామతో వివరించి
చెప్పెను.।
9.**యావె** ఐగుప్తీయుల చేతిలో నుండి విడిపించి ఇశ్రాయేలీయులకు
చేసిన మేలంతటిని గూర్చి యిత్రో సంతోషించెను.।
10.మరియు యిత్రో-ఐగుప్తీయుల చేతిలోనుండియు ఫరో చేతిలో
నుండియు మిమ్మును విడిపించి, ఐగుప్తీయుల చేతిక్రిందనుండి ఈ
ప్రజలను విడిపించిన **యావె** స్తుతింపబడునుగాక ।
11.ఐగుప్తీయులు గర్వించి ఇశ్రాయేలీయులమీద చేసిన దౌర్జన్యముబట్టి
ఆయన చేసినదాని చూచి, **యావె** సమస్త దేవతలకంటె గొప్పవాడని
యిప్పుడు నాకు తెలిసినదనెను.।
12.మరియు మోషే మామయైన యిత్రో ఒక దహనబలిని బలులను
ఎలోహీంకు అర్పింపగా అహరోనును ఇశ్రాయేలీయుల పెద్దలందరును
మోషే మామతో ఎలోహీం సన్నిధిని భోజనము చేయవచ్చిరి.।
13.మరునాడు మోషే ప్రజలకు న్యాయము తీర్చుటకు కూర్చుండగా,
ఉదయము మొదలుకొని సాయంకాలము వరకు ప్రజలు మోషేయొద్ద
నిలిచియుండిరి.।
14.మోషే ప్రజలకు చేసినదంతయు అతని మామ చూచి-నీవు ఈ
ప్రజలకు చేయుచున్న యీ పని యేమిటి? ఉదయము మొదలుకొని
సాయంకాలమువరకు నీవు మాత్రము కూర్చుండగా ప్రజలందరు నీయొద్ద

నిలిచియుండనేల అని అడుగగా ।
15.మోషే-ఎలోహీం తీర్పు తెలిసికొనుటకు ప్రజలు నా యొద్దకు
వచ్చెదరు.।
16.వారికి వ్యాజ్యెము ఏదైనను కలిగినయెడల నా యొద్దకు వచ్చెదరు.
నేను వారి విషయము న్యాయము తీర్చి, ఎలోహీం కట్టడలను ఆయన
ధర్మశాస్త్రవిధులను వారికి తెలుపుచున్నానని తన మామతో చెప్పెను.।
17.అందుకు మోషే మామ అతనితో నీవు చేయుచున్న పని మంచిది
కాదు.।
18.నీవును నీతో నున్న యీ ప్రజలును నిశ్చయముగా నలిగిపోవుదురు;
ఈ పని నీకు మిక్కిలి భారము, అది నీవు ఒక్కడవే చేయచాలవు.।
19.కాబట్టి నా మాట వినుము. నేను నీకొక ఆలోచన చెప్పెదను. ఎలోహీం
నీకు తోడైయుండును. ప్రజల పక్షమున నీవు ఎలోహీం సముఖమందు
ఉండి వారి వ్యాజ్యెములను ఎలోహీం యొద్దకు తేవలెను.।
20.నీవు వారికి ఆయన కట్టడలను ధర్మశాస్త్ర విధులను బోధించి, వారు
నడవవలసిన త్రోవను వారు చేయవలసిన కార్యములను వారికి
తెలుపవలెను.।
21.మరియు నీవు ప్రజలందరిలో సామర్థ్యము **యావె** భక్తి సత్యాసక్తి
కలిగి, లంచగొండులు కాని మనుష్యులను ఏర్పరచుకొని, వేయిమందికి
ఒకనిగాను, పదిమందికి ఒకనిగాను, వారిమీద న్యాయాధిపతులను
నియమింపవలెను.।
22.వారు ఎల్లప్పుడును ప్రజలకు న్యాయము తీర్చవలెను. అయితే గొప్ప
వ్యాజ్యెములన్నిటిని నీ యొద్దకు తేవలెను. ప్రతి అల్పవిషయమును వారే
తీర్చవచ్చును. అట్లు వారు నీతో కూడ ఈ భారమును మోసినయెడల
నీకు సుళువుగా ఉండును.।
23.ఎలోహీం ఈలాగు చేయుటకు నీకు సెలవిచ్చినయెడల నీవు ఈ
పని చేయుచు దాని భారమును సహింపగలవు. మరియు ఈ
ప్రజలందరు తమ తమ చోట్లకు సమాధానముగా వెళ్లుదురని చెప్పెను.।
24.మోషే తన మామ మాట విని అతడు చెప్పినదంతయు చేసెను.।
25.ఇశ్రాయేలీయులందరిలో సామర్థ్యముగల మనుష్యులను
ఏర్పరచుకొని, వెయ్యిమందికి ఒకనిగాను, నూరుమందికి ఒకనిగాను
ఏబదిమందికి ఒకనిగాను, పదిమందికి ఒకనిగాను, న్యాయాధిపతులను
ఏర్పాటు చేసి వారిని ప్రజలమీద ప్రధానులుగా నియమించెను.।
26.వారెల్లప్పుడును ప్రజలకు న్యాయము తీర్చువారు. వారు కఠిన
వ్యాజ్యెములను తామే తీర్చుచువచ్చిరి.।
27.తరువాత మోషే తన మామను పంపివేయగా అతడు తన
స్వదేశమునకు వెళ్లెను.॥

●**19.**ఇశ్రాయేలీయులు ఐగుప్తుదేశమునుండి బయలుదేరిన మూడవ
నెలలో, వారు సీనాయి అరణ్యమునకు వచ్చిరి.।
2.వారు రెఫీదీమునుండి బయలుదేరి సీనాయి అరణ్యమునకు వచ్చి ఆ
అరణ్యమందు దిగిరి. అక్కడ ఆ పర్వతము ఎదుట ఇశ్రాయేలీయులు
విడిసిరి.।
3.మోషే ఎలోహీం యొద్దకు ఎక్కి పోవగా **యావె** ఆ పర్వతము నుండి
అతని పిలిచి-నీవు యాకోబు కుటుంబికులతో ముచ్చటించి ఇశ్రాయేలీ
యులకు తెలుపవలసినదేమనగా ।
4.-నేను ఐగుప్తీయులకు ఏమి చేసితినో, మిమ్మును గద్ద రెక్కలమీద
మోసి నా యొద్దకు మిమ్ము నెట్లు చేర్చుకొంటినో మీరు చూచితిరి.।
5.కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరిం,ఇ
నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్య
మగుదురు.।
6.సమస్తభూమియు నాదేగదా. మీరు నాకు యాజకరూపమైన రాజ్యము
గాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని చెప్పుము; నీవు ఇశ్రాయేలీ
యులతో పలుకవలసిన మాటలు ఇవే అని చెప్పగా ।
7.మోషే వచ్చి ప్రజల పెద్దలను పిలిపించి **యావె** తన కాజ్ఞాపించిన ఆ
మాటలన్నియు వారియెదుట తెలియపరచెను.।
8.అందుకు ప్రజలందరు-**యావె** చెప్పినదంతయు చేసెదమని యేకముగా
ఉత్తరమిచ్చిరి. అప్పుడు మోషే తిరిగి వెళ్లి ప్రజల మాటలను **యావె**కు
తెలియచేసెను.।
9.**యావె** మోషేతో-ఇదిగో నేను నీతో మాటలాడునప్పుడు ప్రజలు విని
నిరంతరము నీయందు నమ్మకముంచునట్లు నేను కారుమబ్బులలో
నీయొద్దకు వచ్చెదనని చెప్పెను. మోషే ప్రజల మాటలను **యావె**తో
చెప్పగా ।
10.**యావె** మోషేతో-నీవు ప్రజలయొద్దకు వెళ్లి నేడును రేపును వారిని
పరిశుద్ధపరచుము; వారు తమ బట్టలు ఉదుకుకొని ।
11.మూడవనాటికి సిద్ధముగా నుండవలెను; మూడవనాడు **యావె**
ప్రజలందరి కన్నుల ఎదుట సీనాయి పర్వతముమీదికి దిగివచ్చును.।
12.నీవు చుట్టు ప్రజలకు మేరను ఏర్పరచి-మీరు ఈ పర్వతము ఎక్కవద్దు,
దాని అంచును ముట్టవద్దు, భద్రము సుమీ ఈ పర్వతము ముట్టు
ప్రతివానికి మరణశిక్ష తప్పక విధింపబడవలెను.।
13.ఎవడును చేతితో దాని ముట్టకూడదు, ముట్టినవాడు రాళ్లతో
కొట్టబడవలెను లేక పొడవబడవలెను, మనుష్యుడుగాని మృగముగాని
బ్రదుకకూడదు, బూరధ్వని చేయునప్పుడు వారు పర్వతముయొద్దకు
రావలెననెను.।
14.అప్పుడు మోషే పర్వతముమీదనుండి ప్రజలయొద్దకు దిగివచ్చి
ప్రజలను పరిశుద్ధపరచగా వారు తమ బట్టలను ఉదుకుకొనిరి.
15.అప్పుడతడు-మూడవనాటికి సిద్ధముగా నుండుడి; ఏ పురుషుడు స్త్రీని
చేరకూడదని చెప్పెను.।
16.మూడవనాడు ఉదయమైనప్పుడు ఆ పర్వతముమీద ఉరుములు
మెరుపులు సాంద్రమేఘము బూరయొక్క మహాధ్వనియు కలుగగా
పాళెములోని ప్రజలందరు వణికిరి.।
17.ఎలోహీంను ఎదుర్కొనుటకు మోషే పాళెములోనుండి ప్రజలను
అవతలకు రప్పింపగా వారు పర్వతము దిగువను నిలిచిరి.।
18.**యావె** అగ్నితో సీనాయి పర్వతముమీదికి దిగి వచ్చినందున
అదంతయు ధూమమయమై యుండెను. దాని ధూమము కొలిమి
ధూమమువలె లేచెను, పర్వతమంతయు మిక్కిలి కంపించెను.।
19.ఆ బూరధ్వని అంతకంతకు బిగ్గరగా మ్రోగెను. మోషే మాటలాడు
చుండగా ఎలోహీం కంఠస్వరము చేత అతనికి ఉత్తరమిచ్చుచుండెను.।
20.**యావె** సీనాయి పర్వతముమీదికి, అనగా ఆ పర్వత శిఖరముమీదికి
దిగి వచ్చెను. **యావె** పర్వత శిఖరముమీదికి రమ్మని మోషేను పిలువగా
మోషే ఎక్కిపోయెను.।
21.అప్పుడు **యావె**-ప్రజలు చూచుటకు **యావె** యొద్దకు హద్దుమీరి
వచ్చి వారిలో అనేకులు నశింపకుండునట్లు నీవు దిగిపోయి వారికి
ఖండితముగా ఆజ్ఞాపించుము.।
22.మరియు **యావె** వారిమీద పడకుండునట్లు **యావె** యొద్దకు చేరు
యాజకులు తమ్ముతామే పరిశుద్ధపరచుకొనవలెనని మోషేతో చెప్పగా।
23.మోషే **యావె**తో-ప్రజలు సీనాయి పర్వతము ఎక్కలేరు. నీవు
-పర్వతమునకు మేరలను ఏర్పరచి దాని పరిశుద్ధపరచవలెనని మాకు
ఖండితముగా ఆజ్ఞాపించితివనెను.।
24.అందుకు **యావె**-నీవు దిగి వెళ్లుము, నీవును నీతో అహరోనును
ఎక్కి రావలెను. అయితే **యావె** వారి మీద పడకుండునట్లు యాజకులును
ప్రజలును ఆయనయొద్దకు వచ్చుటకు మేరను మీరకూడదు;ఆయన వారి
మీద పడునేమో అని అతనితో చెప్పగా ।
25.మోషే ప్రజలయొద్దకు వెళ్లి ఆ మాట వారితో చెప్పెను.।

●**20.**ఎలోహీం ఈ ఆజ్ఞలన్నియు వివరించి చెప్పెను.।
2.-నీ ఎలోహీమైన **యావె**ను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తులోనుండి
నిన్ను వెలుపలికి రప్పించితిని;।
3.నేను తప్ప వేరొక ఎలోహీం నీకు ఉండకూడదు.।
4.పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింద
నీళ్లయందేగాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను[1]

(చెక్కిన విగ్రహము) నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు.।
5.ఏలయనగా నీ ఎలోహీంనైన **యావె**నగు నేను రోషము గల ఎలోహీంను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషము కుమారులమీదికి రప్పించుచు।
6.నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరములవరకు కరుణించువాడనై యున్నాను.
7.నీ ఎలోహీమైన **యావె** నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు. **యావె** తన నామమును వ్యర్థముగా నుచ్చరింపువానిని నిర్దోషిగా ఎంచడు.
8.విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము.।
9.ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను.।
10.ఏడవ దినము నీ ఎలోహీమైన **యావె**కు విశ్రాంతిదినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను నీ పశువైనను నీ యిండ్లలోనున్న పరదేశియైనను ఏపనియు చేయకూడదు.।
11.ఆరు దినములలో **యావె** ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను; అందుచేత **యావె** విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను.।
12.నీ ఎలోహీమైన **యావె** నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.
13.నరహత్య చేయకూడదు
14.వ్యభిచరింపకూడదు
15.దొంగిలకూడదు
16.నీ పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు
17.నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు అని చెప్పెను.
18.ప్రజలందరు ఆ ఉరుములు ఆ మెరుపులు ఆ బూరధ్వనియు ఆ పర్వత ధూమమును చూచి, భయపడి తొలగి దూరముగా నిలిచి మోషేతో ఇట్లనిరి ।
19.-నీవు మాతో మాటలాడుము మేము విందుము; ఎలోహీం మాతో మాటలాడిన యెడల మేము చనిపోవుదుము.।
20.అందుకు మోషే-భయపడకుడి; మిమ్ము పరీక్షించుటకును, మీరు పాపము చేయకుండునట్లు ఆయన భయము మీకు కలుగునట్లు ఎలోహీం వేంచేసెనని ప్రజలతో చెప్పెను.
21.ప్రజలు దూరముగా నిలిచిరి. మోషే ఎలోహీం ఉన్న ఆ గాఢాంధకారమునకు సమీపింపగా ।
22.**యావె** మోషేతో ఇట్లనెను-ఇశ్రాయేలీయులతో ఈలాగు చెప్పుము -నేను ఆకాశమునుండి మీతో మాటలాడితినని మీరు గ్రహించితిరి.।
23.మీరు నన్ను కొలుచుచు, వెండి దేవతలనైనను బంగారు దేవతలనైనను చేసికొనకూడదు.।
24.మంటి బలిపీఠమును నాకొరకు చేసి, దానిమీద నీ దహనబలులను సమాధానబలులను నీ గొఱ్ఱెలను నీ యెద్దులను అర్పింపవలెను. నేను నా నామమును జ్ఞాపకార్థముగా నుంచు ప్రతి స్థలములోను నీయొద్దకు వచ్చి నిన్ను ఆశీర్వదించెదను.।
25.నీవు నాకు రాళ్లతో బలిపీఠము చేయునప్పుడు మలిచిన రాళ్లతో దాని కట్టకూడదు; దానికి నీ పనిముట్టు తగలనిచ్చిన యెడల అది అపవిత్రమగును.।
26.మరియు నా బలిపీఠముమీద నీ దిగంబరత్వము కనబడక యుండునట్లు మెట్లమీద దానిని ఎక్కకూడదు.।

●**21.**నీవు వారికి నియమింపవలసిన న్యాయవిధులేవనగా ।
2.-నీవు హెబ్రీయుడైన దాసుని కొనినయెడల వాడు ఆరు సంవత్సరములు దాసుడైయుండి యేడవ సంవత్సరమున ఏమియు ఇయ్యకనే నిన్ను విడిచి స్వతంత్రుడగును.।
3.వాడు ఒంటిగా వచ్చినయెడల ఒంటిగానే వెళ్లవచ్చును. వానికి భార్య యుండిన యెడల వాని భార్య వానితోకూడ వెళ్లవచ్చును.।
4.వాని యజమానుడు వానికి భార్యనిచ్చిన తరువాత ఆమె వానివలన కుమారులనైనను కుమార్తెలనైనను కనిన యెడల ఆ భార్యయు ఆమె పిల్లలును ఆమె యజమానుని సొత్తగుదురు గాని వాడు ఒంటిగానే పోవలెను.।
5.అయితే ఆ దాసుడు-నేను నా యజమానుని నా భార్యను నా పిల్లలను ప్రేమించుచున్నాను; నేను వారిని విడిచి స్వతంత్రుడనై పోనొల్లనని నిజముగా చెప్పినయెడల ।
6.వాని యజమానుడు ఎలోహీం[1] (లేక న్యాయాధిపతి) యొద్దకు వానిని తీసికొని రావలెను, మరియు వాని యజమానుడు తలుపునొద్దకైనను ద్వారబంధమునొద్దకైనను వాని తోడుకొనిపోయి వాని చెవిని కదురుతో గుచ్చవలెను. తరువాత వాడు నిరంతరము వానికి దాసుడైయుండును.
7.ఒకడు తన కుమార్తెను దాసిగా అమ్మినయెడల దాసులైన పురుషులు వెళ్లిపోవునట్లు అది వెళ్లిపోకూడదు.।
8.దానిని ప్రధానము చేసికొనిన[2] (చేసికొనని) యజమానుని దృష్టికి అది యిష్టురాలు కానియెడలఅది విడిపింపబడునట్లు అవకాశము నియ్యవలెను; దాని వంచించినందున అన్యజనులకు దానిని అమ్ముటకు వానికి అధికారము లేదు.।
9.తన కుమారునికి దాని ప్రధానము చేసినయెడల కుమార్తెల విషయమైన న్యాయవిధినిబట్టి దానియెడల జరిగింపవలెను.।
10.ఆ కుమారుడు వేరొక దాని చేర్చుకొనినను, మొదటిదానికి ఆహారమును వస్త్రమును సంసారధర్మమును తక్కువ చేయకూడదు.।
11.ఈ మూడును దానికి కలుగజేయని యెడల అది ఏమియు ఇయ్యక స్వతంత్రురాలై పోవచ్చును.
12.నరుని చావగొట్టినవానికి నిశ్చయముగా మరణశిక్ష విధింపవలెను.।
13.అయితే వాడు చంపవలెనని పొంచియుండకయే దైవికముగా వానిచేత ఆ హత్య జరిగినయెడల వాడు పారిపోగల యొక స్థలమును నీకు నిర్ణయించెదను.
14.అయితే ఒకడు తన పొరుగువానిమీద దౌర్జన్యముగా వచ్చి కపటముగా చంపలేచిన యెడల వాడు నా బలిపీఠము నాశ్రయించినను వాని లాగివేసి చంపవలెను.।
15.తన తండ్రినైనను తల్లినైనను కొట్టువాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును.
16.ఒకడు నరుని దొంగిలించి అమ్మినను, తనయొద్ద నుంచుకొనినను వాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును.
17.తన తండ్రినైనను తల్లినైనను శపించువాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును.
18.మనుష్యులు పోట్లాడుచుండగా ఒకడు తన పొరుగు వానిని రాతితోనైనను పిడికిటితోనైనను గుద్దుటవలన వాడు చావక మంచముమీద పడియుండి ।
19.తరువాత లేచి తన చేతికఱ్ఱతో బయటికి వెళ్లి తిరుగుచుండిన యెడల, వాని కొట్టినవానికి శిక్ష విధింపబడదుగాని అతడు పనిచేయలేనియెడల కాలమునకు తగిన సొమ్ము ఇచ్చి వాడు అతనిని పూర్తిగా బాగుచేయింపవలెను.
20.ఒకడు తన దాసుడైనను తన దాసియైనను చచ్చునట్లు కఱ్ఱతో కొట్టినయెడల అతడు నిశ్చయముగా ప్రతిదండన నొందును.।
21.అయితే వాడు ఒకటి రెండు దినములు బ్రదికినయెడల ఆ ప్రతిదండన అతడు పొందడు, వాడు అతని సొమ్మేగదా.।
22.నరులు పోట్లాడుచుండగా గర్భవతియైన స్త్రీకి దెబ్బతగిలి ఆమెకు గర్భపాతమేగాక మరి ఏ హానియు రానియెడల ఆ స్త్రీ పెనిమిటి వానిమీద మోపిన నష్టమును అచ్చుకొనవలెను. న్యాయాధిపతులు తీర్మానించినట్లు దాని చెల్లింపవలెను.।

23.హాని కలిగినయెడల నీవు ప్రాణమునకు ప్రాణము, కంటికి కన్ను పంటికి పల్లు చేతికి చెయ్యి కాలికి కాలు, ।

25.వాతకు వాత, గాయమునకు గాయము, దెబ్బకు దెబ్బయు నియమింప వలెను.।

26.ఒకడు తన దాసుని కన్నైనను తన దాసి కన్నైనను పోగొట్టినయెడల ఆ కంటి హానినిబట్టి వారిని స్వతంత్రునిగా పోనియ్యవలెను.।

27.వాడు తన దాసుని పల్లయినను తన దాసి పల్లయినను ఊడగొట్టిన యెడల ఆ పంటి నిమిత్తము వారిని స్వతంత్రులగా పోనియ్యవలెను.

28.ఎద్దు పురుషునైనను స్త్రీనైనను చావపొడిచినయెడల నిశ్చయముగా రాళ్లతో ఆ యెద్దును చావకొట్టవలెను. దాని మాంసమును తినకూడదు, అయితే ఆ యెద్దు యజమానుడు నిర్దోషియగును.।

29.ఆ యెద్దు అంతకుముందు పొడుచునది అని దాని యజమానునికి తెలుపబడినను, వాడు దాని భద్రము చేయకుండుటవలన అది పురుషునైనను స్త్రీనైనను చంపినయెడల ఆ యెద్దును రాళ్లతో చావగొట్టవలెను; దాని యజమానుడు మరణశిక్ష నొందవలెను.।

30.వానికి పరిక్రయధనము నియమింపబడినయెడల వానికి నియమింప బడిన అన్నిటి ప్రకారము తన ప్రాణ విమోచన నిమిత్తము ధనము చెల్లింపవలెను.।

31.అది కుమారుని పొడిచినను కుమార్తెను పొడిచినను ఈ విధి చొప్పున అతడు చేయవలెను.।

32.ఆ యెద్దు దాసునినైనను దాసినైనను పొడిచినయెడల వారి యజమానునికి ముప్పది తులముల వెండి చెల్లింపవలెను. మరియు ఆ యెద్దును రాళ్లతో చావకొట్టవలెను.

33.ఒకడు గోతిమీది కప్పు తీయుటవలన, లేక ఒకడు గొయ్యి త్రవ్వి దాని కప్పకపోవుటవలన, దానిలో ఎద్దయినను గాడిదయైనను పడిన యెడల ।

34.ఆ గోతి ఖామందులు ఆ నష్టమును అచ్చుకొనవలెను; వాటి యజమానునికి సొమ్ము ఇయ్యవలెను; చచ్చినది వానిదగును.।

35.ఒకని యెద్దు వేరొకని యెద్దు చచ్చునట్లు దాని పొడిచినయెడల బ్రదికియున్న ఎద్దును అమ్మి దాని విలువను పంచుకొనవలెను, చచ్చిన యెద్దును పంచుకొనవలెను.।

36.అయితే అంతకు ముందు ఆ యెద్దు పొడుచునది అని తెలియజేయ బడియు దాని యజమానుడు దాని భద్రము చేయని వాడైతే వాడు నిశ్చయముగా ఎద్దుకు ఎద్దునియ్యవలెను; చచ్చినది వానిదగును.

●**22.**ఒకడు ఎద్దునైనను గొఱ్ఱెనైనను దొంగిలించి దాని అమ్మినను చంపినను ఆ యెద్దుకు ప్రతిగా అయిదు ఎద్దులను ఆ గొఱ్ఱెకు ప్రతిగా నాలుగు గొఱ్ఱెలను ఇయ్యవలెను.।

2.దొంగ కన్నము వేయుచుండగా వాడు దొరికి చచ్చునట్లు కొట్టబడిన యెడల అందువలన రక్తాపరాధముండదు.।

3.సూర్యుడు ఉదయించిన తరువాత వాని కొట్టినయెడల వానికి రక్తాపరాధ ముండును; వాడు సరిగా సొమ్ము మరల చెల్లింపవలెను. వానికేమియు లేకపోయిన యెడల వాడు దొంగతనము చేసినందున అమ్మబడవలెను.।

4.వాడు దొంగిలినది ఎద్దయినను గాడిదయైనను గొఱ్ఱెయైనను సరే అది ప్రాణముతో వానియొద్ద దొరికినయెడల రెండంతలు చెల్లింపవలెను.।

5.ఒకడు చేనునైనను ద్రాక్షతోటనైనను మేపుటకు తన పశువును విడిపించగా ఆ పశువు వేరొకని చేను మేసినయెడల అతడు తన చేలలోని మంచిదియు ద్రాక్షతోటలోని మంచిదియు దానికి ప్రతిగా నియ్యవలెను.

6.అగ్ని రగిలి ముండ్లకంపలు అంటుకొనుటవలన పంటకుప్పయైనను పంటపైరైనను చేనైనను కాలిపోయినయెడల అగ్ని నంటించినవాడు ఆ నష్టమును అచ్చుకొనవలెను.।

7.ఒకడు సొమ్మయినను సామానైనను జాగ్రత్తపెట్టుటకు తన పొరుగువానికి అప్పగించినప్పుడు అది ఆ మనుష్యుని యింటనుండి దొంగిలింపబడి ఆ దొంగ దొరికినయెడల వాడు దానికి రెండంతలు అచ్చుకొనవలెను;।

8.ఆ దొంగ దొరకనియెడల ఆ యింటి యజమానుడు తన పొరుగువాని పదార్థములను తీసికొనెనో లేదో పరిష్కారమగుటకై ఎలోహీంయొద్దకు రావలెను.।

9.ప్రతివిధమైన ద్రోహమును గూర్చి, అనగా ఎద్దునుగూర్చి గాడిదనుగూర్చి గొఱ్ఱెనుగూర్చి బట్టనుగూర్చి పోయినదాని నొకడు చూచి యిది నాదని చెప్పినదానిగూర్చి ఆ యిద్దరి వ్యాజ్యెము ఎలోహీంయొద్దకు[1] (లేక న్యాయాధిపతులయొద్దకు) తేబడవలెను. ఎలోహీం[2] (లేక న్యాయాధిపతి) ఎవనిమీద నేరము స్థాపించునో వాడు తన పొరుగువానికి రెండంతలు అచ్చుకొనవలెను.।

10.ఒకడు గాడిదనైనను ఎద్దునైనను గొఱ్ఱెనైనను మరి ఏ జంతువునైనను కాపాడుటకు తన పొరుగువానికి అప్పగించినమీదట, అది చచ్చినను హాని పొందినను, ఎవడును చూడకుండగా తోలుకొనిపోబడినను, ।

11.వాడు తన పొరుగువాని సొమ్మును తీసికొనలేదనుటకు **యావె** ప్రమాణము వారిద్దరిమధ్య నుండవలెను. సొత్తుదారుడు ఆ ప్రమాణమును అంగీకరింపవలెను; ఆ నష్టమును అచ్చుకొననక్కరలేదు.।

12.అది నిజముగా వానియొద్దనుండి దొంగిలింపబడినయెడల సొత్తు దారునికి ఆ నష్టమును అచ్చుకొనవలెను.।

13.అది చీల్చబడినయెడల వాడు సాక్ష్యముకొరకు దాని తేవలెను; చీల్చబడినదాని నష్టమును అచ్చుకొన నక్కరలేదు.।

14.ఒకడు తన పొరుగువానియొద్ద దేనినైనను బదులు దీసికొనిపోగా దాని యజమానుడు దానియొద్ద లేనప్పుడు, అది హానిపొందినను చచ్చినను దాని నష్టమును అచ్చుకొనవలెను.।

15.దాని యజమానుడు దానితో నుండిన యెడల దాని నష్టమును అచ్చుకొననక్కరలేదు. అది అద్దెదైన యెడల అది దాని అద్దెకు వచ్చెను.।

16.ఒకడు ప్రధానము చేయబడని ఒక కన్యకను మరలుకొల్పి ఆమెతో శయనించినయెడల ఆమె నిమిత్తము ఓలి ఇచ్చి ఆమెను పెండ్లి చేసికొన వలెను.।

17.ఆమె తండ్రి ఆమెను వానికి ఇయ్యనొల్లనియెడల వాడు కన్యకల ఓలి చొప్పున సొమ్ముచెల్లింపవలెను.

18.శకునము చెప్పుదానిని బ్రదుకనియ్యకూడదు

19.మృగసంయోగము చేయు ప్రతివాడు నిశ్చయముగా మరణశిక్ష నొందవలెను.।

20.**యావె**కు మాత్రమే గాక వేరొక ఎలోహీంకు బలి అర్పించువాడు శాపగ్రస్థుడు.।

21.పరదేశిని విసికింపవద్దు; బాధింపవద్దు; మీరు ఐగుప్తుదేశములో పరదేశులై యుంటిరి గదా.।

22.విధవరాలినైనను దిక్కులేని పిల్లనైనను బాధపెట్టకూడదు.।

23.వారు నీచేత ఏ విధముగానైనను బాధనొంది నాకు మొఱపెట్టినయెడల నేను నిశ్చయముగా వారి మొఱను విందును.।

24.నా కోపాగ్ని రవులుకొని మిమ్మును కత్తివాత చంపించెదను, మీ భార్యలు విధవరాండ్రగుదురు, మీ పిల్లలు దిక్కులేనివారగుదురు.

25.నా ప్రజలలో నీయొద్దనుండు ఒక బీదవానికి సొమ్ము అప్పిచ్చినయెడల వడ్డికిచ్చువానివలె వాని యెడల జరిగింపకూడదు. వానికి వడ్డికట్టకూడదు.।

26.నీవు ఎప్పుడైనను నీ పొరుగువాని వస్త్రమును కుదవగా తీసికొనిన యెడల సూర్యుడు అస్తమించువేళకు అది వానికి మరల అప్పగించుము.।

27.వాడు కప్పుకొనునది అదే. అది వాని దేహమునకు వస్త్రము; వారు మరి ఏమి కప్పుకొని పండుకొనును? నేను దయగలవాడను, వాడు నాకు మొఱపెట్టినయెడల నేను విందును.

28.నీవు ఎలోహీంను[3] (లేక న్యాయాధిపతిని) నిందింపగూడదు, నీ ప్రజలలో అధికారిని శపింపకూడదు.

29.నీ మొదటి సస్యద్రవ్యములను అర్పింప తడవు చేయకూడదు. నీ కుమారులలో జ్యేష్ఠుని నాకు అర్పింపవలెను.।

30.అట్లే నీ యెద్దులను నీ గొఱ్ఱెలను అర్పింపవలెను. ఏడు దినములు అది దాని తల్లియొద్ద ఉండవలెను. ఎనిమిదవ దినమున దానిని నాకియ్యవలెను.

31.మీరు నాకు ప్రతిష్ఠింపబడినవారు గనుక పొలములో చీల్చబడిన మాంసమును తినక కుక్కలకు దాని పారవేయవలెను.।

●**23.**లేనివార్తను పుట్టింపకూడదు; అన్యాయపు సాక్ష్యమును పలుకుటకై దుష్టునితో నీవు కలియకూడదు.।

2.దుష్కార్యము జరిగించుటకై సమూహమును వెంబడించవద్దు, న్యాయమును త్రిప్పివేయుటకు సమూహముతో చేరి వ్యాజ్యెములో సాక్ష్యము పలుకకూడదు;।

3.వ్యాజ్యెమాడువాడు బీదవాడైనను వానియెడల పక్షపాతముగా నుండ కూడదు

4.నీ శత్రువుని యెద్దయినను గాడిదయైనను తప్పిపోవుచుండగా అది నీకు కనబడినయెడల అగత్యముగా దాని తోలుకొనివచ్చి వాని కప్పగింపవలెను.।

5.నీవు నీ పగవాని గాడిద బరువుక్రింద పడియుండుట చూచి, దానినుండి తప్పింపకయుందునని నీవు అనుకొనినను అగత్యముగా వానితో కలిసి దాని విడిపింపవలెను.।

6.దరిద్రుని వ్యాజ్యెములో న్యాయము విడిచి తీర్పు తీర్చకూడదు.।

7.అబద్ధమునకు దూరముగానుండుము; నిరపరాధినైనను నీతిమంతుని నైనను చంపకూడదు; నేను దుష్టుని నిర్దోషినిగా ఎంచను.।

8.లంచము తీసికొనకూడదు; లంచము దృష్టిగలవానికి గ్రుడ్డితనము కలుగజేసి, నీతిమంతుల మాటలకు అపార్థము చేయించును.।

9.పరదేశిని బాధింపకూడదు; పరదేశి మనస్సు ఎట్లుండునో మీరెరు గుదురు; మీరు ఐగుప్తుదేశములో పరదేశులై యుంటిరిగదా.

10.ఆరు సంవత్సరములు నీ భూమిని విత్తి దాని పంట కూర్చుకొనవలెను

11.ఏడవ సంవత్సరమున దానిని బీడు విడువవలెను. అప్పుడు నీ ప్రజలలోని బీదలు తినిన తరువాత మిగిలినది అడవి మృగములు తినవచ్చును, నీ ద్రాక్షతోట విషయములోను నీ ఒలీవతోట విషయములోను ఆలాగుననే చేయవలెను.।

12.ఆరు దినములు నీ పనులు చేసి, నీ యెద్దును నీ గాడిదయు నీ దాసి కుమారుడును పరదేశియు విశ్రమించునట్లు ఏడవ దినమున ఊరక యుండవలెను.।

13.నేను మీతో చెప్పినవాటినన్నిటిని జాగ్రత్తగా గైకొనవలెను; వేరొక ఎలోహీం పేరు ఉచ్చరింపకూడదు; అది నీ నోట నుండి రానియ్య తగదు.

14.సంవత్సరమునకు మూడుమారులు నాకు పండుగ ఆచరింపవలెను.।

15.పులియని రొట్టెలపండుగ నాచరింపవలెను. నేను నీ కాజ్ఞాపించినట్లు అబీబు నెలలో నీవు ఐగుప్తులోనుండి బయలుదేరి వచ్చితివి గనుక ఆ నెలలో నియామక కాలమందు ఏడు దినములు పులియని రొట్టెలను తినవలెను. నా సన్నిధిని ఎవడును వట్టిచేతులతో కనబడకూడదు.।

16.నీవు పొలములో విత్తిన నీ వ్యవసాయముల తొలిపంట యొక్క కోతపండుగను, పొలములోనుండి నీ వ్యవసాయ ఫలములను నీవు కూర్చుకొనిన తరువాత సంవత్సరాంతమందు ఫలసంగ్రహపు పండుగను ఆచరింపవలెను.।

17.సంవత్సరమునకు మూడుమారులు పురుషులందరు సర్వాధికారియైన **యావె** సన్నిధిని కనబడవలెను.

18.నా బలుల రక్తమును పులిసిన ద్రవ్యముతో అర్పింపకూడదు. నా పండుగలో నర్పించిన క్రొవ్వు ఉదయమువరకు నిలువ యుండకూడదు.।

19.నీ భూమి ప్రథమఫలములలో మొదటివాటిని ఎలోహీమైన **యావె** మందిరమునకు తేవలెను. మేకపిల్లను దాని తల్లిపాలతో ఉడకబెట్టకూడదు.

20.ఇదిగో త్రోవలో నిన్ను కాపాడి నేను సిద్ధపరచిన చోటుకు నిన్ను రప్పించుటకు ఒక దూతను నీకు ముందుగా పంపుచున్నాను.।

21.ఆయన సన్నిధిని జాగ్రత్తగా నుండి ఆయన మాట వినవలెను. ఆయన కోపము రేపవద్దు; మీ అతిక్రమములను ఆయన పరిహరింపడు, నా నామము ఆయనకున్నది.।

22.అయితే నీవు ఆయన మాటను జాగ్రత్తగా విని నేను చెప్పినది యావత్తు చేసినయెడల నేను నీ శత్రువులకు శత్రువును నీ విరోధులకు విరోధియునై యుందును.।

23.ఎట్లనగా నా దూత నీకు ముందుగా వెళ్లుచు, అమోరీయులు హిత్తీయులు పెరిజ్జీయులు కనానీయులు హివ్వీయులు యెబూసీయులను వారున్న చోటుకు నిన్ను రప్పించును, నేను వారిని సంహరించెదను.।

24.వారి దేవతలకు సాగిలపడకూడదు, వాటిని పూజింపకూడదు; వారి క్రియలవంటి క్రియలు చేయక వారిని తప్పక నిర్మూలము చేసి, వారి విగ్రహములను బొత్తిగా పగులగొట్టవలెను.।

25.నీ ఎలోహీమైన **యావె**నే సేవింపవలెను, అప్పుడు ఆయన నీ ఆహారమును నీ పానమును దీవించును. నేను నీ మధ్యనుండి రోగము తొలగించెదను.।

26.కడుపు దిగబడునదియు గొడ్డుదియు నీ దేశములోను ఉండదు. నీ దినముల లెక్క సంపూర్తి చేసెదను.।

27.నన్నుబట్టి మనుష్యులు నీకు భయపడునట్లు చేసెదను.నీవు పోవు సర్వ దేశములవారిని ఓడగొట్టి నీ సమస్త శత్రువులు నీ యెదుటనుండి పారిపోవునట్లు చేసెదను.।

28.మరియు, పెద్ద కందిరీగలను నీకు ముందుగా పంపించెదను, అవి నీ యెదుటనుండి హివ్వీయులను కనానీయులను హిత్తీయులను వెళ్లగొట్టును.।

29.దేశము పాడైఅడవిమృగములు నీకు విరోధముగా విస్తరింపకుండునట్లు వారిని ఒక్క సంవత్సరములోనే నీ యెదుటనుండి వెళ్లగొట్టెదను.।

30.నీవు అభివృద్ధిపొంది ఆ దేశమును స్వాధీనపరచుకొనువరకు క్రమక్రమముగా వారిని నీ యెదుట నుండి వెళ్లగొట్టెదను.।

31.మరియు ఎఱ్ఱసముద్రమునుండి ఫిలిష్తీయుల సముద్రమువరకును అరణ్యమునుండి నదివరకును నీ పొలిమేరలను ఏర్పరచెదను, ఆ దేశ నివాసులను నీ చేతి కప్పగించెదను. నీవు నీ యెదుటనుండి వారిని వెళ్లగొట్టెదవు.।

32.నీవు వారితోనైనను వారి దేవతలతోనైనను నిబంధన చేసికొనవద్దు.నీవు వారి దేవతలను సేవించినయెడల అది నీకు ఉరియగును గనుక ।

33.వారు నీచేత నాకు విరోధముగా పాపము చేయింపకుండునట్లు వారు నీ దేశములో నివసింపకూడదు.।

●**24.**మరియు ఆయన మోషేతో ఇట్లనెను-నీవును, అహరోనును, నాదాబును,అబీహును, ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బదిమందియు **యావె** యొద్దకు ఎక్కివచ్చి దూరమున సాగిలపడుడి ।

2.మోషే మాత్రము **యావె**ను సమీపింపవలెను, వారు సమీపింపకూడదు, ప్రజలు అతనితో ఎక్కి రాకూడదు.।

3.మోషే వచ్చి **యావె** మాటలన్నిటిని విధులన్నిటిని ప్రజలతో వివరించి చెప్పెను. ప్రజలందరు-**యావె** చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని యేక శబ్దముతో ఉత్తరమిచ్చిరి.।

4.మరియు మోషే **యావె** మాటలన్నిటిని వ్రాసి ఉదయమందు లేచి ఆ కొండ దిగువను బలిపీఠమును ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములు చొప్పున పండ్రెండు స్తంభములను కట్టి ।

5.ఇశ్రాయేలీయులలో యౌవనస్థులను పంపగా వారు దహనబలుల నర్పించి **యావె**కు సమాధానబలులుగా కోడెలను వధించిరి.।

6.అప్పుడు మోషే వాటి రక్తములో సగము తీసికొని పళ్లెములలో పోసి ఆ రక్తములో సగము బలిపీఠముమీద ప్రోక్షించెను.।

7.అతడు నిబంధన గ్రంథమును తీసికొని ప్రజలకు వినిపింపగా వారు -**యావె** చెప్పినవన్నియు చేయుచు విధేయులమై యుందుమనిరి.।

8.అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజలమీద ప్రోక్షించి-ఇదిగో యీ సంగతులన్నిటి విషయమై **యావె** మీతో చేసిన నిబంధన రక్తము ఇదే అని చెప్పెను.।

9.తరువాత మోషే అహరోను నాదాబు అబీహు ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బదిమందియు ఎక్కిపోయి ।

10.ఇశ్రాయేలీయుల ఎలోహీంను చూచిరి. ఆయన పాదముల క్రింద నిగనిగలాడు నీలమయమైన వస్తువువంటిదియు ఆకాశమండలపు

తేజమువంటిదియు ఉండెను.।
11.ఆయన ఇశ్రాయేలీయులలోని ప్రధానులకు ఏ హానియు చేయలేదు; వారు ఎలోహీంని చూచి అన్నపానములు పుచ్చుకొనిరి.
12.అప్పుడు **యావె** మోషేతో ఇట్లనెను-నీవు కొండయెక్కి నా యొద్దకు వచ్చి అచ్చటనుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను, ధర్మశాస్త్రమును, రాతిపలకలను నీకిచ్చెదననగా ।
13.మోషేయు అతని పరిచారకుడైన యెహోషువయు లేచిరి. మోషే ఎలోహీం కొండమీదికి ఎక్కెను.।
14.అతడు పెద్దలను చూచి-మేము మీ యొద్దకు వచ్చువరకు ఇక్కడనే యుండుడి; ఇదిగో అహరోనును హూరును మీతో ఉన్నారు; ఎవనికైనను వ్యాజ్యెమున్నయెడల వారియొద్దకు వెళ్లవచ్చునని వారితో చెప్పెను.।
15.మోషే కొండమీదికి ఎక్కినప్పుడు ఆ మేఘము కొండను కమ్మెను.।
16.**యావె** మహిమ సీనాయి కొండమీద నిలిచెను; మేఘము ఆరు దినములు దాని కమ్ముకొనెను; ఏడవ దినమున ఆయన ఆ మేఘములో నుండి మోషేను పిలిచినప్పుడు ।
17.**యావె** మహిమ ఆ కొండ శిఖరముమీద దహించు అగ్నివలె ఇశ్రాయేలీయుల కన్నులకు కనబడెను.।
18.అప్పుడు మోషే ఆ మేఘములో ప్రవేశించి కొండమీదికి ఎక్కెను. మోషే ఆ కొండమీద రేయింబవళ్లు నలుబది దినములుండెను.।

●**25.యావె** మోషేకు ఈలాగు సెలవిచ్చెను.
2.-నాకు ప్రతిష్ఠార్పణ తీసికొని రండని ఇశ్రాయేలీయులతో చెప్పుము. మన:పూర్వకముగా అర్పించు ప్రతిమనుష్యుని యొద్ద దాని తీసికొన వలెను.।
3.మీరు వారియొద్ద తీసికొనవలసిన అర్పణలేవనగా బంగారు, వెండి, ఇత్తడి, ।
4.నీలధూమ్ర రక్తవర్ణములు, సన్నపునార, మేకవెంట్రుకలు,।
5.ఎరుపురంగు వేసిన పొట్టేళ్లతోళ్లు, సముద్రవత్సల తోళ్లు, తుమ్మకఱ్ఱలు,।
6.ప్రదీపమునకు తైలము, అభిషేకతైలమునకును పరిమళ ద్రవ్యముల ధూపమునకు సుగంధ సంభారములు, ।
7.లేతపచ్చలు, ఏఫోదుకును పతకమునకును చెక్కు రత్నములు అనునవే.।
8.నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధస్థలమును నిర్మింపవలెను.।
9.నేను నీకు కనుపరచువిధముగా మందిరముయొక్క ఆ రూపమును దాని ఉపకరణములన్నిటి రూపమును నిర్మింపవలెను.
10.వారు తుమ్మకఱ్ఱతో నొక మందసమును చేయవలెను. దాని పొడుగు రెండుమూరలునర, దాని వెడల్పు మూరెడునర, దాని యెత్తు మూరెడు నర ।
11.దానిమీద మేలిమి బంగారు రేకు పొదిగింపవలెను; లోపలను వెలుపలను దానికి పొదిగింపవలెను; దానిమీద బంగారు జవను చుట్టు కట్టవలెను.।
12.దానికి నాలుగు బంగారు ఉంగరములను పోతపోసి, ఒక ప్రక్కను రెండు ఉంగరములు ఎదుటి ప్రక్కను రెండు ఉంగరములు ఉండునట్లు దాని నాలుగు కాళ్లకు వాటిని వేయవలెను.।
13.తుమ్మకఱ్ఱతో మోతకఱ్ఱలను చేసి వాటికి బంగారు రేకులను పొదిగించి
14.వాటితో ఆ మందసమును మోయుటకు ఆ ప్రక్కల మీది ఉంగరములలో ఆ మోతకఱ్ఱలను దూర్చవలెను.।
15.ఆ మోతకఱ్ఱలు ఆ మందసపు ఉంగరములలోనే ఉండవలెను. వాటిని దానియొద్దనుండి తీయకూడదు.।
16.ఆ మందసములో నేను నీకిచ్చు శాసనముల నుంచవలెను.।
17.మరియు నీవు మేలిమి బంగారుతో కరుణాపీఠమును చేయవలెను. దాని పొడుగు రెండు మూరలునర దాని వెడల్పు మూరెడునర.।
18.మరియు రెండు బంగారు కెరూబులను చేయవలెను. కరుణాపీఠము యొక్క రెండు కొనలను నకిషిపనిగా చేయవలెను.।
19.ఈ కొనను ఒక కెరూబును ఆ కొనను ఒక కెరూబును చేయవలెను. కరుణాపీఠమున దాని రెండు కొనలమీద కెరూబులను దానితో ఏకాండముగా చేయవలెను.।
20.ఆ కెరూబులు పైకి విప్పిన రెక్కలుగలవై కరుణాపీఠమును తమ రెక్కలతో కప్పుచుండగావాటి ముఖములు ఒండొంటికి ఎదురుగా నుండవలెను. ఆ కెరూబుల ముఖములు కరుణా పీఠముతట్టు నుండ వలెను. నీవు ఆ కరుణాపీఠమును ఎత్తి ఆ మందసముమీద నుంచవలెను.।
21.నేను నీకిచ్చు శాసనములను ఆ మందసములో నుంచవలెను.।
22.అక్కడ నేను నిన్ను కలిసికొని కరుణాపీఠముమీద నుండియు, శాసనములు గల మందసముమీద నుండు రెండు కెరూబుల మధ్య నుండియు నేను ఇశ్రాయేలీయుల నిమిత్తము నీ కాజ్ఞాపించు సమస్తమును నీకు తెలియచెప్పెదను.
23.మరియు నీవు తుమ్మకఱ్ఱతో నొక బల్ల చేయవలెను. దాని పొడుగు రెండు మూరలు దాని వెడల్పు ఒక మూర దాని యెత్తు మూరెడునర.।
24.మేలిమి బంగారు రేకును దానికి పొదిగించి దానికి చుట్టు బంగారు జవను చేయింపవలెను.।
25.దానికి చుట్టు బెత్తెడు బద్దెచేసి దాని బద్దెపైని చుట్టును బంగారు జవ చేయవలెను.।
26.దానికి నాలుగు బంగారు ఉంగరములను చేసి దాని నాలుగు కాళ్లకుండు నాలుగు మూలలలో ఆ ఉంగరములను తగిలింపవలెను.।
27.బల్ల మోయుటకు మోతకఱ్ఱలు ఉంగరములును బద్దెకు సమీపముగా నుండవలెను.।
28.ఆ మోతకఱ్ఱలు తుమ్మకఱ్ఱతో చేసి వాటిమీద బంగారు రేకు పొదిగింపవలెను; వాటితో బల్లమోయబడును.।
29.మరియు నీవు దాని పళ్లెములను ధూపార్తులను గిన్నెలను పానీయార్పణముకు పాత్రలను దానికి చేయవలెను; మేలిమి బంగారుతో వాటిని చేయవలెను.।
30.నిత్యమును నా సన్నిధిని సన్నిధిరొట్టెలను ఈ బల్లమీద ఉంచవలెను.
31.మరియు నీవు మేలిమి బంగారుతో దీపవృక్షమును చేయవలెను; నకిషిపనిగా ఈ దీపవృక్షము చేయవలెను. దాని ప్రకాండమును దాని శాఖలను నకిషిపనిగా చేయవలెను; దాని కలశములు దాని మొగ్గలు దాని పువ్వులు దానితో ఏకాండమైయుండవలెను.।
32.దీప వృక్షముయొక్క ఒక ప్రక్కనుండి మూడు కొమ్మలు, దీపవృక్షము యొక్క రెండవ ప్రక్కనుండి మూడు కొమ్మలు, అనగా దాని ప్రక్కలనుండి ఆరు కొమ్మలు నిగుడవలెను.।
33.ఒక కొమ్మలో మొగ్గపువ్వుగల బాదము రూపమైన మూడు కలశములు, రెండవ కొమ్మలో మొగ్గపువ్వులు గల బాదము రూపమైన మూడు కలశములు; అట్లు దీపవృక్షమునుండి బయలుదేరి కొమ్మలలో నుండవలెను.।
34.మరియు దీపవృక్ష ప్రకాండములో బాదము రూపమైన నాలుగు కలశములును వాటి మొగ్గలును వాటి పువ్వులును ఉండవలెను,।
35.దీపవృక్షప్రకాండమునుండి నిగుడు ఆరుకొమ్మలకు దాని రెండేసి కొమ్మల క్రింద ఏకాండమై ఒక్కొక్క మొగ్గచొప్పున ఉండవలెను.
36.వాటి మొగ్గలు వాటి కొమ్మలు దానితో ఏకాండమగును; అదంతయు మేలిమి బంగారుతో చేయబడిన ఏకాండమైన నకిషి పనిగా ఉండవలెను.।
37.నీవు దానికి ఏడు దీపములను చేయవలెను. దాని యెదుట వెలుగిచ్చునట్లు దాని దీపములను వెలిగింపవలెను.।
38.దాని కత్తెర దాని కత్తెరచిప్పయుమేలిమి బంగారుతో చేయవలెను.।
39.ఆ ఉపకరణములన్ని నలుబది వీసెల మేలిమి బంగారుతో చేయవలెను.।
40.కొండమీద నీకు కనుపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్తపడుము.

●**26.**మరియు నీవు పది తెరలతో ఒక మందిరమును చేయవలెను. నీల ధూమ్ర రక్తవర్ణములుగల పేనిన సన్నపు నారతో వాటిని చేయవలెను.।
2.ప్రతి తెర పొడుగు ఇరువది యెనిమిది మూరలు; ప్రతి తెర వెడల్పు

నాలుగు మూరలు.ఆ తెరలన్నిటికి ఒకటే కొలత. ।
3.అయిదు తెరలను ఒక దానితో ఒకటి కూర్చవలెను. మిగిలిన అయిదు తెరలను ఒకదానితో ఒకటి కూర్చవలెను.।
4.తెరల కూర్పు చివరను మొదటి తెర అంచున ఏలినూలుతో కొలుకులను చేయవలెను. రెండవ కూర్పునందలి వెలుపల తెర చివరను అట్లు చేయవలెను.।
5.ఒక తెరలో ఏబది కొలుకులను చేసి, ఆ కొలుకులు ఒకదాని నొకటి తగులుకొనునట్లు ఆ రెండవ కూర్పునందలి తెర అంచున ఏబది కొలుకులను చేయవలెను.।
6.మరియు ఏబది బంగారు గుండీలను చేసి ఆ గుండీలచేత ఆ తెరలను ఒకదానితో ఒకటి కూర్చవలెను; అది ఒకటే మందిరమగును.।
7.మరియు మందిరముపైని గుడారము మేక వెండ్రుకలతో తెరలు చేయవలెను;పదకొండు తెరల కొలత ఒక్కటే.।
8.ప్రతి తెర పొడుగు ముప్పది మూరలు, వెడల్పు నాలుగు మూరలు, పదకొండు తెరల కొలత ఒక్కటే.।
9.అయిదు తెరలను ఒకటిగాను ఆరు తెరలను ఒకటిగాను ఒకదానికొకటి కూర్చవలెను. ఆరవతెరను గుడారపు ఎదుటిభాగమున మడవవలెను.।
10.తెరల కూర్పునకు వెలుపలనున్న తెర అంచున ఏబది కొలుకులను రెండవ కూర్పునందలి తెర అంచున ఏబది కొలుకులను చేయవలెను.।
11.మరియు ఏబది యిత్తడి గుండీలను చేసి యొకటే గుడారమగునట్లు ఆ గుండీలను ఆ కొలుకులకు తగిలించి దాని కూర్చవలెను.।
12.ఆ గుడారపు తెరలలో మిగిలి వ్రేలాడుభాగము, అనగా మిగిలిన సగము తెర, మందిరము వెనుక ప్రక్కమీద వ్రేలాడవలెను.।
13.మరియు గుడారపు తెరల పొడుగులో మిగిలినది ఈ ప్రక్కను ఒక మూరయు, ఆ ప్రక్కను ఒక మూరయు, మందిరమును కప్పుటకు ఈ ప్రక్కను ఆ ప్రక్కను దాని ప్రక్కలమీద వ్రేలాడవలెను.।
14.మరియు ఎఱ్ఱరంగువేసిన పొట్టేళ్ల తోళ్లతో పైకప్పును దానికిమీదుగా సముద్రవత్సల తోళ్లతో పైకప్పును చేయవలెను.
15.మరియు మందిరమునకు తుమ్మకఱ్ఱతో నిలువుపలకలు చేయవలెను.।
16.పలక పొడుగు పది మూరలు పలక వెడల్పు మూరెడునర యుండవలెను.।
17.ప్రతి పలకలో ఒకదాని కొకటి సరియైన రెండు కుసులుండవలెను. అట్లు మందిరపు పలకలన్నిటికి చేసిపెట్టవలెను.।
18.ఇరువది పలకలు కుడివైపున, అనగా దక్షిణదిక్కున మందిరమునకు పలకలను చేయవలెను.।
19.మరియు నొక్కొక్క పలకక్రింద దాని దాని రెండు కుసులకు రెండు రెండు దిమ్మలను ఆ యిరువది పలకల క్రింద నలువది వెండి దిమ్మలను చేయవలెను.।
20.మందిరపు రెండవ ప్రక్కను, అనగా ఉత్తరదిక్కున, ఒక్కొక్క పలకక్రింద రెండు దిమ్మలు ఇరువది పలకలును వాటి నలువది వెండి దిమ్మలు ఉండవలెను.।
22.పడమటితట్టు మందిరము యొక్క వెనుక ప్రక్కకు ఆరు పలకలను చేయవలెను.।
23.మరియు ఆ వెనుక ప్రక్కను మందిరము యొక్క మూలలకు రెండు పలకలను చేయవలెను.।
24.అవి అడుగున కూర్చబడి శిఖరమును మొదటి ఉంగరము దనుక ఒకదానితో ఒకటి అతికింపబడవలెను. అట్లు ఆ రెంటికి ఉండవలెను. అవి రెండు మూలలకుండును.।
25.పలకలు ఎనిమిది; వాటి వెండి దిమ్మలు పదునారు; ఒక్కొక్క పలకక్రింద రెండు దిమ్మలుండవలెను.।
26.తుమ్మకఱ్ఱతో అడ్డ కఱ్ఱలను చేయవలెను. మందిరముయొక్క ఒక ప్రక్క పలకలకు అయిదు అడ్డకఱ్ఱలును ।
27.మందిరముయొక్క రెండవ ప్రక్క పలకలకు అయిదు అడ్డ కఱ్ఱలును పడమటి వైపున మందిరము యొక్క ప్రక్క పలకలకు అయిదు అడ్డ కఱ్ఱలును ఉండవలెను;।
28.ఆ పలకల మధ్యనుండు నడిమి అడ్డ కఱ్ఱ ఈ కొసనుండి ఆ కొసవరకు చేరి యుండవలెను.।
29.ఆ పలకలకు బంగారు రేకును పొదిగించి వాటి అడ్డ కఱ్ఱలకును బంగారు రేకును పొదిగింపవలెను.।
30.అప్పుడు కొండమీద నీకు కనుపరచబడినదాని పోలికచొప్పున మందిరమును నిలువబెట్టవలెను.।
31.మరియు నీవు నీలధూమ్ర రక్తవర్ణములుగల ఒక అడ్డతెరను పేనిన సన్న నారతో చేయవలెను. అది చిత్రకారుని పనియైన కెరూబులు గలదిగా చేయవలెను.।
32.తుమ్మకఱ్ఱతో చేయబడి బంగారు రేకు పొదిగిన నాలుగు స్తంభములమీద దాని వేయవలెను; దాని వంకులు బంగారువి వాటి దిమ్మెలు వెండివి.।
33.ఆ అడ్డతెరను ఆ కొలుకుల క్రింద తగిలించి సాక్ష్యపు మందసము అడ్డతెరలోపలికి తేవలెను. ఆ అడ్డతెర పరిశుద్ధస్థలమును అతిపరిశుద్ధ స్థలమును వేరుచేయును.।
34.అతిపరిశుద్ధస్థలములో సాక్ష్యపు మందసము మీద కరుణాపీఠము నుంచవలెను.।
35.అడ్డతెర వెలుపల బల్లను ఆ బల్లయెదుట దక్షిణపు వైపుననున్న మందిరముయొక్క యుత్తరదిక్కున దీపవృక్షమును ఉంచవలెను.।
36.మరియు నీల ధూమ్ర రక్తవర్ణములుగల పేనిన సన్న నారతో చిత్రకారుని పనియైన తెరను గుడారపు ద్వారమునకు చేయవలెను.।
37.ఆ తెరకు అయిదు స్తంభములను తుమ్మకఱ్ఱతో చేసి వాటికి బంగారు రేకు పొదిగింపవలెను. వాటి వంపులు బంగారువి వాటికి అయిదు ఇత్తడి దిమ్మలు పోతపోయవలెను.

●**27.**మరియు అయిదు మూరల పొడుగు అయిదు మూరల వెడల్పు గల బలిపీఠమును తుమ్మకఱ్ఱతో నీవు చేయవలెను. ఆ బలిపీఠము చచ్చౌకముగా నుండవలెను; దాని యెత్తు మూడు మూరలు ।
2.దాని నాలుగు మూలలను దానికి కొమ్ములను చేయవలెను; దాని కొమ్ములు దానితో ఏకాండముగా ఉండవలెను; దానికి ఇత్తడి రేకు పొదిగింపవలెను.।
3.దాని బూడిదె ఎత్తుటకు కుండలను గరిటెలను గిన్నెలను ముండ్లను అగ్నిపాత్రలను చేయవలెను. ఈ ఉపకరణములన్నియు ఇత్తడితో చేయవలెను.।
4.మరియు వలవంటి ఇత్తడి జల్లెడ దానికి చేయవలెను.ఆ వలమీద దాని నాలుగు మూలలను నాలుగు ఇత్తడి ఉంగరములను చేసి ఆ వల బలిపీఠము నడిమివరకు చేరునట్లు దిగువను బలిపీఠము గట్టుక్రింద దాని నుంచవలెను.।
6.మరియు బలిపీఠము కొరకు మోతకఱ్ఱలను చేయవలెను. ఆ మోతకఱ్ఱలను తుమ్మకఱ్ఱతో చేసి వాటికి ఇత్తడి రేకు పొదిగింపవలెను.।
7.ఆ మోతకఱ్ఱలను ఆ ఉంగరములలో చొనపవలెను. బలిపీఠమును మోయుటకు ఆ మోతకఱ్ఱలు దాని రెండు ప్రక్కల నుండవలెను.।
8.పలకతో గుల్లగా దాని చేయవలెను; కొండమీద నీకు చూపబడిన పోలికగాని వారు దాని చేయవలెను.
9.మరియు నీవు మందిరమునకు ఆవరణము ఏర్పరచవలెను. కుడివైపున, అనగా దక్షిణదిక్కున ఆవరణముగా నూరు మూరల పొడుగుగలదై పేనిన సన్ననార యవనికలు ఒక ప్రక్కకు ఉండవలెను.।
10.దాని యిరువది స్తంభములును వాటి యిరువది దిమ్మలును ఇత్తడివి; ఆ స్తంభముల వంకులును వాటి పెండెబద్దలును వెండివి.।
11.అట్లే పొడుగులో ఉత్తరదిక్కున నూరు మూరల పొడుగుగల యవనికలుండవలెను. దాని యిరువది స్తంభములును వాటి యిరువది దిమ్మలును ఇత్తడివి. ఆ స్తంభముల వంకులును వాటి పెండెబద్దలును వెండివి.।
12.పడమటి దిక్కున ఆవరణపు వెడల్పు కొరకు ఏబది మూరల యవనికలుండవలెను; వాటి స్తంభములు పది వాటి దిమ్మలు పది.।

13.తూర్పువైపున, అనగా ఉదయదిక్కున ఆవరణపు వెడల్పు ఏబది మూరలు.।
14.ఒక ప్రక్కను పదునైదు మూరల యవనికలుండవలెను; వాటి స్తంభములు మూడు వాటి దిమ్మలు మూడు.।
15.రెండవ ప్రక్కను పదునైదుమూరల యవనికలుండవలెను; వాటి స్తంభములు మూడు వాటి దిమ్మలును మూడు.।
16.ఆవరణపు ద్వారమునకు నీల ధూమ్రరక్తవర్ణములు గల యిరువది మూరల తెర యుండవలెను.అవి పేనిన సన్ననారతో చిత్రకారుని పనిగా ఉండవలెను; వాటి స్తంభములు నాలుగు వాటి దిమ్మలు నాలుగు.।
17.ఆవరణముచుట్టున్న స్తంభములన్నియు వెండి పెండెబద్దలు కలవి; వాటి వంకులు వెండివి వాటి దిమ్మలు ఇత్తడివి.।
18.ఆవరణపు పొడుగు నూరు మూరలు; దాని వెడల్పు ఏబదిమూరలు దాని యెత్తు అయిదు మూరలు; అవి పేనిన సన్ననారవి వాటి దిమ్మలు ఇత్తడివి.। మందిరసంబంధమైన సేవోపకరణములన్నియు మేకులన్నియు ఆవరణపు మేకులన్నియు ఇత్తడివై యుండవలెను.
20.మరియు దీపము నిత్యము వెలిగించునట్లు ప్రదీపమునకు దంచితీసిన అచ్చము ఒలీవలన నూనె తేవలెనని ఇశ్రాయేలీయుల కాజ్ఞాపించుము.।
21.సాక్ష్యపు మందసము ఎదుటనున్న తెరకు వెలుపల ప్రత్యక్షపు గుడారములో అహరోనును అతని కుమారులును సాయంకాలము మొదలుకొని ఉదయమువరకు **యావె** సన్నిధిని దాని సవరింపవలెను. అది ఇశ్రాయేలీయులకు వారి తరతరములవరకు నిత్యమైన కట్టడ.

●**28.**మరియు నాకు యాజకత్వము చేయుటకై నీ సహోదరుడైన అహరోనును అతని కుమారులను, అనగా అహరోనును అహరోను కుమారులైన నాదాబును, అబీహును, ఎలియాజరును ఈతామారును ఇశ్రాయేలీయులలో నుండి నీ యొద్దకు పిలిపింపుము.।
2.అతనికి అలంకారమును ఘనతయు కలుగునట్లు నీ సహోదరుడైన అహరోనుకు ప్రతిష్ఠిత వస్త్రములను కుట్టవలెను.।
3.అహరోను నాకు యాజకుడగునట్లు నీవు అతని ప్రతిష్ఠించుదువు. అతని వస్త్రములను కుట్టుటకై నేను జ్ఞానాత్మతో నింపిన వివేక హృదయులందరికి ఆజ్ఞ ఇమ్ము.।
4.పతకము ఏఫోదు నిలువుటంగీ విచిత్రమైన చొక్కాయి పాగా దట్టియు వారు కుట్టవలసిన వస్త్రములు. అతడు నాకు యాజకుడై యుండునట్లు వారు నీ సహోదరుడైన అహరోనుకును అతని కుమారులకును ప్రతిష్ఠిత వస్త్రములను కుట్టింపవలెను.।
5.వారు బంగారును నీల ధూమ్ర రక్తవర్ణములుగల నూలును సన్ననారను తీసికొని ।
6.బంగారుతోను నీలధూమ్ర రక్తవర్ణములుగల ఏఫోదును పేనిన సన్న నారతోను చిత్రకారుని పనిగా చేయవలెను.।
7.రెండు అంచులయందు కూర్చబడు రెండు భుజఖండములు దాని కుండవలెను; అట్లు అది సమకూర్చబడియుండును.।
8.మరియు ఏఫోదుమీదనుండు విచిత్రమైన దట్టి దాని పనిరీతిగా ఏకాండమైనదై బంగారుతోను నీలధూమ్ర రక్తవర్ణములుగల నూలుతోను పేనిన సన్ననారతోను కుట్టవలెను.।
9.మరియు నీవు రెండు లేతపచ్చలను తీసికొని వాటిమీద ఇశ్రాయేలీయుల పేరులను, అనగా వారి జననక్రమము చొప్పున ।
10.ఒక రత్నముమీద వారి పేళ్లలో ఆరును, రెండవరత్నముమీద తక్కిన ఆరుగురి పేళ్లను చెక్కింపవలెను.।
11.ముద్రమీద చెక్కబడిన వాటివలె చెక్కెడివాని పనిగా ఆ రెండు రత్నములమీద ఇశ్రాయేలీయుల పేళ్లను చెక్కి బంగారు జవలలో వాటిని పొదగవలెను.।
12.అప్పుడు ఇశ్రాయేలీయులకు జ్ఞాపకార్థమైన రత్నములనుగా ఆ రెండు రత్నములను ఏఫోదు భుజములమీద ఉంచవలెను అట్లు జ్ఞాపకముకొరకు అహరోను తన రెండు భుజములమీద **యావె** సన్నిధిని వారి పేరులను భరించును.।
13.మరియు బంగారు జవలను మేలిమి బంగారుతో రెండు గొలుసులను చేయవలెను;।
14.సూత్రములవలె అల్లికపనిగా వాటిని చేసి అల్లిన గొలుసులను ఆ జవలకు తగిలింపవలెను.
15.మరియు చిత్రకారుని పనిగా న్యాయవిధాన పతకము చేయవలెను. ఏఫోదుపనివలె దానిచేయవలెను;బంగారుతోను నీలధూమ్ర రక్తవర్ణములు గల నూలుతోను పేనిన సన్ననారతోను దాని చేయవలెను.।
16.అది మడవబడి చచ్చౌకముగా నుండవలెను;అది జేనెడు పొడుగు జేనెడు వెడల్పుగలదై యుండవలెను.।
17.దానిలో నాలుగు పంక్తుల రత్నములుండునట్లు రత్నముల జవలను చేయవలెను.మాణిక్య గోమేధిక మరకతములు గల పంక్తి మొదటిది.।
18.పద్మరాగ నీల సూర్యకాంతములుగల పంక్తి రెండవది;।
19.గారుత్మతము యష్మురాయి ఇంద్రనీలములుగల పంక్తి మూడవది;।
20.రక్తవర్ణపురాయి సులిమానిరాయి సూర్యకాంతములు గల పంక్తి నాలుగవది. వాటిని బంగారు జవలలో పొదగవలెను.।
21.ఆ రత్నములు ఇశ్రాయేలీయుల పేరులుగలవై వారి పేరులచొప్పున పండ్రెండుండవలెను. ముద్రమీద చెక్కినవాటివలె వారిలో ప్రతివాని పేరు చొప్పున పండ్రెండు గోత్రముల పేరులు ఉండవలెను.।
22.మరియు ఆ పతకము అల్లిక పనిగా పేనిన గొలుసులను మేలిమి బంగారుతో చేయవలెను.।
23.పతకమునకు రెండు బంగారు ఉంగరములు చేసి ।
24.ఆ రెండు ఉంగరములను పతకపు రెండు కొనలయందు తగిలించి, పతకపు కొనలనున్న రెండు ఉంగరములలో అల్లబడిన ఆ రెండు బంగారు గొలుసులను తగిలింపవలెను.।
25.అల్లిన ఆ రెండు గొలుసుల కొనలను రెండు రెండు జవలకు తగిలించి ఏఫోదు నెదుట దాని భుజములమీద కట్టవలెను.।
26.మరియు నీవు బంగారుతో రెండు ఉంగరములను చేసి ఏఫోదు నెదుటనున్న పతకములోపలి అంచున దాని రెండు కొనలకు వాటిని తగిలింపవలెను.।
27.మరియు నీవు రెండు బంగారు ఉంగరములుచేసి ఏఫోదు విచిత్రమైన దట్టిపైగా దాని కూర్పునొద్ద, దాని యెదుటి ప్రక్కకు దిగువను, ఏఫోదు రెండు భుజభాగములకు వాటిని తగిలింపవలెను.।
28.అప్పుడు పతకము ఏఫోదు విచిత్రమైన దట్టికిపైగా నుండునట్లును అది ఏఫోదునుండి వదలక యుండునట్లును వారు దాని ఉంగరములకు ఏఫోదు ఉంగరములకు నీలి సూత్రముతో పతకము కట్టవలెను.।
29.అట్లు అహరోను పరిశుద్ధస్థలములోనికి వెళ్లునప్పుడు అతడు తన రొమ్మమీద న్యాయవిధాన పతకములోని ఇశ్రాయేలీయుల పేళ్లను నిత్యము **యావె** సన్నిధిని జ్ఞాపకార్థముగా భరింపవలెను.।
30.మరియు నీవు న్యాయవిధాన పతకములో ఊరీము తుమ్మీము అనువాటిని ఉంచవలెను; అహరోను **యావె** సన్నిధికి వెళ్లునప్పుడు అవి అతని రొమ్మున ఉండునట్లు అహరోను **యావె** సన్నిధిని తన రొమ్మున ఇశ్రాయేలీయుల న్యాయవిధానమును నిత్యము భరించును.
31.మరియు ఏఫోదు నిలువుటంగీని కేవలము నీలిదారముతో కుట్టవలెను.।
32.దాని నడుమ తల దూరుటకు రంధ్రము ఉండవలెను. అది చినగ కుండునట్లు కంఠకవచ రంధ్రమువలె దాని రంధ్రముచుట్టు నేతపనియైన గోటు ఉండవలెను.।
33.దాని అంచున దాని అంచులచుట్టు నీలధూమ్ర రక్తవర్ణములుగల దానిమ్మపండ్లను వాటి నడుమను బంగారు గంటలను నిలువుటంగీ చుట్టు తగిలింపవలెను.।
34.ఒక్కొక్క బంగారు గంటయు దానిమ్మపండును ఆ నిలువుటంగీ క్రింది అంచున చుట్టు ఉండవలెను.।
35.సేవచేయునప్పుడు అహరోను దాని ధరించుకొనవలెను. అతడు **యావె** సన్నిధిని పరిశుద్ధస్థలములోనికి ప్రవేశించునప్పుడు అతడు చావక యుండునట్లు దాని ధ్వని వినబడవలెను.।

36.మరియు నీవు మేలిమి బంగారు రేకు చేసి ముద్రచెక్కునట్లు దానిమీద **యావె** పరిశుద్ధుడు[1] (లేక,**యావె**కు ప్రతిష్ఠితము) అను మాట చెక్కవలెను.।

37.అది పాగామీద ఉండునట్లు నీలి సూత్రముతో దాని కట్టవలెను.అది పాగా ముందటి వైపున ఉండవలెను.।

38.తమ పరిశుద్ధమైన అర్పణలన్నిటిలో ఇశ్రాయేలీయులు ప్రతిష్ఠించు పరిశుద్ధమైనవాటికి తగులు దోషములను అహరోను భరించునట్లు అది అహరోను నొసట ఉండవలెను; వారు **యావె** సన్నిధిని అంగీకరింప బడునట్లు అది నిత్యమును అతని నొసట ఉండవలెను.।

39.మరియు సన్న నారతో చొక్కాయిని బుట్టాపనిగా చేయవలెను. సన్న నారతో పాగాను నేయవలెను; దట్టిని బుట్టాపనిగా చేయవలెను.।

40.అహరోను కుమారులకు నీవు చొక్కాయిలను కుట్టవలెను; వారికి దట్టీలను చేయవలెను; వారికి అలంకారమును ఘనతయు కలుగునట్లు కుళ్లాయిలను వారికి చేయవలెను.।

41.నీవు నీ సహోదరుడైన అహరోనుకును అతని కుమారులకును వాటిని తొడిగింపవలెను; వారు నాకు యాజకులగునట్లు వారికి అభిషేకముచేసి వారిని ప్రతిష్ఠించి వారిని పరిశుద్ధపరచవలెను.।

42.మరియు వారి మానమును కప్పుకొనుటకు నీవు వారికి నారలాగులను కుట్టవలెను.।

43.వారు ప్రత్యక్షపు గుడారములోనికి ప్రవేశించునప్పుడైనను, పరిశుద్ధ స్థలములో సేవచేయుటకు బలిపీఠమును సమీపించునప్పుడైనను, వారు దోషులై చావక యుందునట్లు అది అహరోనుమీదను అతని కుమారుల మీదను ఉండవలెను.ఇది అతనికిని అతని తరువాత అతని సంతతికిని నిత్యమైన కట్టడ.।

●**29.**వారు నాకు యాజకులగునట్లు వారిని ప్రతిష్ఠించుటకు నీవు వారికి చేయవలసిన కార్యమేదనగా ।

2.ఒక కోడెదూడను కళంకములేని రెండు పొట్టేళ్లను పొంగని రొట్టెను పొంగనివై నూనెతో కలిసిన భక్ష్యములను పొంగనివై నూనె పూసిన పలచని అప్పడములను తీసికొనుము.।

3.గోధుమపిండితో వాటిని చేసి ఒక గంపలో వాటిని పెట్టి, ఆ గంపను ఆ కోడెను ఆ రెండు పొట్టేళ్లను తీసికొనిరావలెను.।

4.మరియు నీవు అహరోనును అతని కుమారులను ప్రత్యక్షపు గుడారము యొక్క ద్వారము దగ్గరకు తీసికొనివచ్చి నీళ్లతో వారికి స్నానము చేయించి

5.ఆ వస్త్రములను తీసికొని చొక్కాయిని ఏఫోదు నిలువుటంగిని ఏఫోదును పతకమును అహరోనుకు ధరింపచేసి, ఏఫోదు విచిత్రమైన నడికట్టును అతనికి కట్టి ।

6.అతని తలమీద పాగాను పెట్టి ఆ పాగామీద పరిశుద్ధ కిరీటముంచి ।

7.అభిషేకతైలమును తీసికొని అతని తలమీద పోసి అతని నభిషేకింప వలెను.।

8.మరియు నీవు అతని కుమారులను సమీపింపచేసి వారికి చొక్కాయిలను తొడిగింపవలెను.।

9.అహరోనుకును అతని కుమారులకును దట్టినికట్టి వారికి కుళ్లాయిలను వేయింపవలెను; నిత్యమైన కట్టడనుబట్టి యాజకత్వము వారికగును. అహరోనును అతని కుమారులను ఆలాగున ప్రతిష్ఠింపవలెను.।

10.మరియు నీవు ప్రత్యక్షపు గుడారమునెదుటికి ఆ కోడెను తెప్పింపవలెను అహరోనును అతని కుమారులును కోడె తలమీద తమ చేతుల నుంచగా

11.ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారమునొద్ద **యావె** సన్నిధిని ఆ కోడెను వధింపవలెను.।

12.ఆ కోడె రక్తములో కొంచెము తీసికొని నీ వ్రేలితో బలిపీఠపు కొమ్ములమీద చమిరి ఆ రక్తశేషమంతయు బలిపీఠపుటడుగునపోయవలెను

13.మరియు ఆంత్రములను కప్పుకొను క్రొవ్వంతటిని కాలేజముమీది వపను రెండు మూత్ర గ్రంథులను వాటిమీది క్రొవ్వును నీవు తీసి బలిపీఠముమీద దహింపవలెను.।

14.ఆ కోడె మాంసమును దాని చర్మమును దాని పేడను పాళెమునకు వెలుపల అగ్నితో కాల్చవలెను, అది పాపపరిహారార్థమైన బలి.।

15.నీవు ఆ పొట్టేళ్లలో ఒకదాని తీసికొనవలెను. అహరోనును అతని కుమారులును ఆ పొట్టేలు తలమీద తమ చేతులుంచగా ।

16.నీవు ఆ పొట్టేలును వధించి దాని రక్తము తీసి బలిపీఠముచుట్టు దాని ప్రోక్షింపవలెను.।

17.అంతట నీవు ఆ పొట్టేలును దాని అవయవములను దేనికి అది విడదీసి దాని ఆంత్రములను దాని కాళ్లను కడిగి దాని అవయవములతోను తలతోను చేర్చి ।

18.బలిపీఠముమీద ఆ పొట్టేలంతయు దహింపవలెను; అది **యావె**కు దహనబలి, **యావె**కు ఇంపైన సువాసనగల హోమము.।

19.మరియు నీవు రెండవ పొట్టేలును తీసికొనవలెను. అహరోనును అతని కుమారులును ఆ పొట్టేలు తలమీద తమ చేతులుంచగా ।

20.ఆ పొట్టేలును వధించి దాని రక్తములో కొంచెము తీసి, అహరోను కుడిచెవి కొనమీదను అతని కుమారుల కుడిచెవుల కొనమీదను, వారి కుడిచేతి బొట్టనవ్రేళ్లమీదను, వారి కుడికాలి బొట్టనవ్రేళ్లమీదను చమిరి బలిపీఠము మీద చుట్టు ఆ రక్తమును ప్రోక్షింపవలెను.।

21.మరియు నీవు బలిపీఠము మీదనున్న రక్తములోను అభిషేక తైలములోను కొంచెము తీసి అహరోనుమీదను, అతని వస్త్రములమీదను, అతనితోనున్న అతని కుమారులమీదను, అతని కుమారుల వస్త్రముల మీదను ప్రోక్షింపవలెను. అప్పుడు అతడును అతని వస్త్రములును అతనితోనున్న అతని కుమారులును అతని కుమారుల వస్త్రములును ప్రతిష్ఠితములగును.।

22.మరియు అది ప్రతిష్ఠితమైన పొట్టేలు గనుక దాని క్రొవ్వును కాలేజముమీది వపను రెండు మూత్రగ్రంథులను వాటిమీది క్రొవ్వును కుడి జబ్బను ।

23.ఒక గుండ్రని రొట్టెను నూనెతో వండిన యొక భక్ష్యమును **యావె** యెదుటనున్న పొంగనివాటిలో పలచని ఒక అప్పడమును నీవు తీసికొని

24.అహరోను చేతులలోను అతని కుమారుల చేతులలోను వాటినన్నిటిని ఉంచి, అల్లాడింపబడు నైవేద్యముగా **యావె** సన్నిధిని వాటిని అల్లాడింప వలెను.।

25.తరువాత నీవు వారి చేతులలో నుండి వాటిని తీసికొని **యావె** సన్నిధిని ఇంపైన సువాసన కలుగునట్లు దహనబలిగా వాటిని బలిపీఠముమీద దహింపవలెను. అది **యావె**కు హోమము.।

26.మరియు అహరోనుకు ప్రతిష్ఠితమైన పొట్టేలునుండి బోరను తీసి అల్లాడింపబడు అర్పణముగా **యావె** సన్నిధిని దానిని అల్లాడింపవలెను; అది నీ వంతగును.।

27.ప్రతిష్ఠితమైన ఆ పొట్టేలులో అనగా అహరోనుదియు అతని కుమారులదియునైన దానిలో అల్లాడింపబడిన బోరను ప్రతిష్ఠితమైన జబ్బను ప్రతిష్ఠింపవలెను.।

28.అది ప్రతిష్ఠార్పణ గనుక నిత్యమైన కట్టడచొప్పున అది ఇశ్రాయేలీయుల నుండి అహరోనుకును అతని కుమారులకునగును. అది ఇశ్రాయేలీయులు అర్పించు సమాధానబలులలోనుండి తాము చేసిన ప్రతిష్ఠార్పణగా నుండును.।

29.మరియు అహరోను ప్రతిష్ఠిత వస్త్రములును అతని తరువాత అతని కుమారులవగును; వారు అభిషేకము పొందుటకును ప్రతిష్ఠింపబడుటకును వాటిని ధరించుకొనవలెను.।

30.అతని కుమారులలో నెవడు అతనికి ప్రతిగా యాజకుడగునో అతడు పరిశుద్ధస్థలములో సేవచేయుటకు ప్రత్యక్షపు గుడారములోనికి వెళ్లునప్పుడు ఏడు దినములు వాటిని వేసికొనవలెను.।

31.మరియు నీవు ప్రతిష్ఠితమైన పొట్టేలును తీసికొని పరిశుద్ధస్థలములో దాని మాంసమును వండవలెను.।

32.అహరోనును అతని కుమారులును ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారముదగ్గర ఆ పొట్టేలు మాంసమును గంపలోని రొట్టెలను తినవలెను.।

33.వారిని ప్రతిష్ఠచేయుటకును వారిని పరిశుద్ధపరచుటకును వేటివలన ప్రాయశ్చిత్తము చేయబడెనో వాటిని వారు తినవలెను; అవి పరిశుద్ధమైనవి గనుక అన్యుడు వాటిని తినకూడదు.।

34.ప్రతిష్ఠితమైన మాంసములోనేమి ఆ రొట్టెలలోనేమి కొంచెమైనను ఉదయమువరకు మిగిలియుండినయెడల మిగిలినది అగ్నిచేత దహింపవలెను; అది ప్రతిష్ఠితమైనది గనుక దాని తినవలదు.।
35.నేను నీ కాజ్ఞాపించిన వాటన్నిటినిబట్టి నీవు అట్లు అహరోనుకును అతని కుమారులకును చేయవలెను. ఏడు దినములు వారిని ప్రతిష్ఠ పరచవలెను.।
36.ప్రాయశ్చిత్తము నిమిత్తము నీవు ప్రతిదినమున ఒక కోడెను పాపపరిహారార్థబలిగా అర్పింపవలెను. బలిపీఠము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటవలన దానికి పాపపరిహారార్థబలి నర్పించి దాని ప్రతిష్ఠించుటకు దానికి అభిషేకము చేయవలెను.।
37.ఏడుదినములు నీవు బలిపీఠము నిమిత్తము ప్రాయశ్చిత్తముచేసి దాని పరిశుద్ధపరచవలెను ఆ బలిపీఠము అతిపరిశుద్ధముగా ఉండును. ఆ బలిపీఠమునకు తగులునది అంతయు ప్రతిష్ఠితమగును.
38.నీవు బలిపీఠముమీద నిత్యమును అర్పింపవలసిన దేమనగా, ఏడాదివి రెండు గొఱ్ఱెపిల్లలను ప్రతిదినము ఉదయమందు ఒక గొఱ్ఱెపిల్లను ।
39.సాయంకాలమందు ఒక గొఱ్ఱెపిల్లను అర్పింపవలెను.।
40.దంచితీసిన ముప్పావు నూనెతో కలిపిన పదియవవంతు పిండిని పానీయార్పణముగా ముప్పావు ద్రాక్షారసమును మొదటి గొఱ్ఱెపిల్లతో అర్పింపవలెను. సాయంకాలమందు రెండవ గొఱ్ఱెపిల్లను అర్పింపవలెను.।
41.అది **యావే**కు ఇంపైన సువాసనగల హోమమగునట్లు ఉదయకాలమందలి అర్పణమునుదాని పానీయార్పణమును అర్పించినట్టు దీని నర్పింపవలెను.।
42.ఇది **యావే** సన్నిధిని సాక్ష్యపు గుడారముయొక్క ద్వారమునొద్ద మీ తరతరములకు నిత్యముగా అర్పించుదహనబలి. నీతో మాటలాడుటకు నేను అక్కడికి వచ్చి మిమ్మును కలిసికొందును.।
43.అక్కడికి వచ్చి ఇశ్రాయేలీయులను కలిసికొందును; అది నా మహిమవలన పరిశుద్ధపరచబడును.।
44.నేను సాక్ష్యపు గుడారమును బలిపీఠమును పరిశుద్ధపరచెదను. నాకు యాజకులగునట్లు అహరోనును అతని కుమారులను పరిశుద్ధపరచెదను.।
45.నేనుఇశ్రాయేలీయుల మధ్య నివసించి వారికి ఎలోహీంనైయుందును.।
46.కావున నేను వారి మధ్య నివసించునట్లు ఐగుప్తుదేశములో నుండి వారిని వెలుపలికి రప్పించిన తమ ఎలోహీమైన **యావే**ను నేనే అని వారు తెలిసికొందురు. నేను వారి ఎలోహీమైన **యావే**ను.।

●**30.**మరియు ధూపమువేయుటకు నీవు ఒక వేదికను చేయవలెను తుమ్మకఱ్ఱతో దాని చేయవలెను.।
2.దాని పొడుగు ఒక మూర దాని వెడల్పు ఒక మూర. అది చచ్చౌకముగా నుండవలెను. దాని యెత్తు రెండు మూరలు దాని కొమ్ములు దానితో ఏకాండమై యుండవలెను.।
3.దాని పైభాగమునకును దాని నాలుగుప్రక్కలకును దాని కొమ్ములకును మేలిమి బంగారు రేకులు పొదిగించి దానికి చుట్టు బంగారు జవను చేయవలెను.।
4.దాని జవకు దిగువను దానికి రెండు బంగారు ఉంగరములు చేయవలెను; దాని రెండు ప్రక్కలయందలి దాని రెండు మూలలమీద వాటిని ఉంచవలెను.।
5.అవి దాని మోయు మోతకఱ్ఱలకు స్థలములు, ఆ మోతకఱ్ఱలను తుమ్మకఱ్ఱతో చేసి వాటికి బంగారు రేకు పొదిగింపవలెను.।
6.సాక్ష్యపు మందసమునొద్దనుండు అడ్డతెర యెదుట, అనగా శాసనముల మీది కరుణాపీఠము నెదుట నీవు దానిని ఉంచవలెను; అక్కడ నేను నిన్ను కలిసికొందును.।
7.అహరోను ప్రతిదినము ప్రొద్దున దానిమీద పరిమళద్రవ్యముల ధూపము వేయవలెను. అతడు ప్రదీపములను చక్కపరచునప్పుడు దానిమీద ఆ ధూపము వేయవలెను.।
8.మరియు సాయంకాలమందు అహరోను ప్రదీపములను వెలిగించునప్పుడుదాని మీద ధూపము వేయవలెను. అది మీ తరతరములకు **యావే** సన్నిధిని నిత్యమైన ధూపము.।
9.మీరు దానిమీద అన్యధూపమునైనను దహనబలి సంబంధమైన ద్రవ్యమునైనను నైవేద్యమునైనను అర్పింపకూడదు; పానీయమునైనను దానిమీద పోయకూడదు.।
10.మరియు అహరోను సంవత్సరమున కొకసారి ప్రాయశ్చిత్తార్థమైన పాపపరిహారార్థ బలి రక్తమువలన దాని కొమ్ముల నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయవలెను. అది **యావే**కు అతిపరిశుద్ధమైనది.
11.మరియు **యావే** మోషేతో ఇట్లనెను-నీవు ఇశ్రాయేలీయులను లెక్కింపవలెను.వారు లెక్కింపబడు వేళకు ప్రతివాడు **యావే**కు తన ప్రాణపరిక్రయ ధనము నిచ్చుకొనవలెను. ఆలాగు చేసినయెడల నీవు వారిని లెక్కించునప్పుడు వారిలో ఏ తెగులును పుట్టదు.।
13.వారు ఇయ్యవలసినది ఏమనగా, లెక్కింపబడినవారిలో చేరు ప్రతివాడును పరిశుద్ధస్థలము యొక్క తులమును బట్టి అరతులము ఇయ్యవలెను. ఆ తులము యిరువది చిన్నములు. ఆ అరతులము **యావే**కు ప్రతిష్ఠార్పణ.।
14.ఇరువది సంవత్సరములుగాని అంతకంటె యెక్కువ వయస్సు గాని గలవారై లెక్కింపబడినవారిలో చేరు ప్రతివాడును **యావే**కు అర్పణ నియ్యవలెను.।
15.అది మీ ప్రాణములకు పరిక్రయధనముగా నుండునట్లు **యావే**కు అర్పణ ఇచ్చునప్పుడు ధనవంతుడు అర తులముకంటె ఎక్కువ ఇయ్యకూడదు.బీదవాడు తక్కువ ఇయ్యకూడదు.।
16.నీవు ఇశ్రాయేలీయుల యొద్దనుండి ప్రాయశ్చిత్తార్థమైన వెండి తీసికొని ప్రత్యక్షపు గుడారముయొక్క సేవ నిమిత్తము దాని నియమింపవలెను. మీకు ప్రాయశ్చిత్తము కలుగునట్లు అది **యావే** సన్నిధిని ఇశ్రాయేలీయులకు జ్ఞాపకార్థముగా నుండును.
17.మరియు **యావే** మోషేతో ఇట్లనెను-కడుగుకొనుటకు నీవు ఇత్తడితో దానికొక గంగాళమును ఇత్తడి పీటను చేసి ।
18.ప్రత్యక్షపు గుడారమునకు బలిపీఠమునకు నడుమ దానిని ఉంచి నీళ్లతో నింపవలెను.।
19.ఆ నీళ్లతో అహరోనును అతని కుమారులును తమ చేతులను కాళ్లను కడుగుకొనవలెను.।
20.వారు ప్రత్యక్షపు గుడారములోనికి వెళ్లునప్పుడును సేవచేసి **యావే**కు హోమధూపము నర్పించుటకు బలిపీఠమునొద్దకు వచ్చునప్పుడును తాము చావకయుండునట్లు నీళ్లతో కడుగుకొనవలెను.।
21.తాము చావకయుండునట్లు తమ చేతులను కాళ్లను కడుగుకొనవలెను. అది వారికి, అనగా అతనికిని అతని సంతతికిని వారి తరతరములకు నిత్యమైన కట్టడగా నుండును.।
22.మరియు **యావే** మోషేతో ఇట్లనెను-నీవు ముఖ్యమైన సుగంధ సంభారములలో ।
23.పరిశుద్ధస్థలసంబంధమైన తులముచొప్పున, అచ్చమైన గోపరసము ఐదువందల తులములును సుగంధముగల లవంగిపట్ట సగము, అనగా రెండువందల ఏబది తులముల యెత్తును ।
24.నిమ్మగడ్డి నూనె రెండువందల ఏబది తులముల యెత్తును, లవంగిపట్ట ఐదువందల తులములును ఒలీవనూనె సంభారమును మూడు పళ్లను తీసికొని ।
25.వాటికి ప్రతిష్ఠాభిషేక తైలము, అనగా సుగంధద్రవ్యమేళకుని పనియైన పరిమళసంభారముగా చేయవలెను. అది ప్రతిష్ఠాభిషేక తైలమగును.।
26.ఆ తైలముతో నీవు సాక్ష్యపు గుడారమును సాక్ష్యపు మందసమును।
27.బల్లను దాని ఉపకరణములన్నిటిని దీపవృక్షమును దాని ఉపకరణములను ధూపవేదికను ।
28.దహనబలిపీఠమును దాని ఉపకరణములన్నిటిని గంగాళమును దాని పీటను అభిషేకించి ।
29.అవి అతిపరిశుద్ధమైనవిగా ఉండునట్లు వాటిని ప్రతిష్ఠింపవలెను. వాటిని తగులు ప్రతివస్తువు ప్రతిష్ఠితమగును.।
30.మరియు అహరోనును అతని కుమారులును నాకు యాజకులై

యుండునట్లు నీవు వారిని అభిషేకించి ప్రతిష్ఠింపవలెను.।
31.మరియు నీవు ఇశ్రాయేలీయులతో-ఇది మీ తరతరములకు నాకు ప్రతిష్ఠాభిషేకతైలమై యుండవలెను;।
32.దానిని నర శరీరము మీద పోయకూడదు; దాని మేళనము చొప్పున దాని వంటిదేనినైనను చేయకూడదు. అది ప్రతిష్ఠితమైనది, అది మీకు ప్రతిష్ఠిత మైనదిగా నుండవలెను.।
33.దానివంటిది కలుపువాడును అన్యునిమీద దానిని పోయువాడును తన ప్రజలలోనుండి కొట్టివేయబడవలెనని చెప్పుము.
34.మరియు యావె మోషేతో ఇట్లనెను-నీవు పరిమళద్రవ్యములను, అనగా జటామాంసి గోపిచందనము గంధపుచెక్క అను పరిమళ ద్రవ్యములను స్వచ్ఛమైన సాంబ్రాణి సమభాగములుగా తీసికొని ।
35.వాటితో ధూపద్రవ్యమును చేయవలెను; అది సుగంధద్రవ్యమేళకుని పనిచొప్పున కలపబడి, ఉప్పుగలదియు స్వచ్ఛమైనదియు పరిశుద్ధమైనదియు నైన సుగంధ ధూపసంభారము.।
36.దానిలో కొంచెము పొడిచేసి నేను నిన్ను కలిసికొను ప్రత్యక్షపు గుడారములోని సాక్ష్యపు మందసమునెదుట దాని నుంచవలెను. అది మీకు అతి పరిశుద్ధముగా ఉండవలెను.।
37.నీవు చేయవలసిన ఆ ధూపద్రవ్యమును దాని మేళనము చొప్పున మీ నిమిత్తము మీరు చేసికొనకూడదు. అది యావెకు ప్రతిష్ఠితమైనదిగా ఎంచవలెను.।
38.దాని వాసన చూచుటకు దానివంటిది చేయువాడు తన ప్రజలలోనుండి కొట్టివేయబడును.

●**31.**మరియు యావె మోషేతో ఇట్లనెను ।
2.-చూడుము; నేను యూదా గోత్రములో హూరు మనుమడును ఊరు కుమారుడునైన బెసలేలు అను పేరుగల వానిని పిలిచితిని.।
3.విచిత్రమైన పనులను కల్పించుటకును బంగారుతోను వెండితోను ఇత్తడితోను పని చేయుటకును పొదుగుటకై రత్నములను సానబెట్టుటకు కఱ్ఱనుకోసి చెక్కుటకును సమస్త విధములైన పనులను నేర్పును వానికి కలుగునట్లుగా వానిని ఎలోహీం ఆత్మపూర్ణునిగా చేసియున్నాను.।
6.మరియు నేను దాను గోత్రములోని అహీసామాకు కుమారుడైన అహోలీయాబును అతనికి తోడుచేసితిని. నేను నీకాజ్ఞాపించినవన్నియు చేయునట్లు జ్ఞానహృదయులందరి హృదయములలో జ్ఞానమును ఉంచియున్నాను.।
7.ప్రత్యక్షపు గుడారమును సాక్ష్యపు మందసమును దానిమీదనున్న కరుణాపీఠమును ఆ గుడారపు ఉపకరణములన్నిటిని ।
8.బల్లను దాని ఉపకరణములను నిర్మలమైన దీపవృక్షమును దాని ఉపకరణములన్నిటిని ధూపవేదికను ।
9.దహనబలిపీఠమును దాని ఉపకరణములన్నిటిని గంగాళమును దాని పీటను।
10.యాజకసేవచేయునట్లు సేవా వస్త్రములను యాజకుడైన అహరోను యొక్క ప్రతిష్ఠిత వస్త్రములను అతని కుమారుల వస్త్రములను ।
11.అభిషేకతైలమును పరిశుద్ధ స్థలముకొరకు పరిమళధూపద్రవ్యములను నేను నీ కాజ్ఞాపించిన ప్రకారముగా వారు సమస్తమును చేయవలెను.
12.మరియు యావె మోషేతో ఇట్లనెను-నీవు ఇశ్రాయేలీయులతో -నిజముగా మీరు నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరింప వలెను; మిమ్మును పరిశుద్ధపరచు యావెను నేనే అని తెలిసికొనునట్లు అది మీ తరతరములకు నాకును మీకును గురుతగును.।
14.కావున మీరు విశ్రాంతిదినము నాచరింపవలెను. నిశ్చయముగా అది మీకు పరిశుద్ధము; దానిని అపవిత్రపరచువాడు తన ప్రజలలోనుండి కొట్టివేయబడును.।
15.ఆరు దినములు పనిచేయవచ్చును; ఏడవదినము యావెకు ప్రతిష్ఠితమైన విశ్రాంతిదినము. ఆ విశ్రాంతిదినమున పనిచేయు ప్రతి వాడును తప్పక మరణశిక్ష నొందును.।
16.ఇశ్రాయేలీయులు తమ తమ తరములకు విశ్రాంతిదినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను; అది నిత్యనిబంధన.।
17.నాకును ఇశ్రాయేలీయులకును అది ఎల్లప్పుడును గురుతైయుండును; ఏలయనగా ఆరుదినములు యావె భూమ్యాకాశములను సృజించి యేడవదినమున పని మాని విశ్రమించెనని చెప్పుము.
18.మరియు ఆయన సీనాయి కొండమీద మోషేతో మాటలాడుట చాలించిన తరువాత ఆయన తన శాసనములుగల రెండు పలకలను, అనగా ఎలోహీం వ్రేలితో వ్రాయబడిన రాతిపలకలను అతనికిచ్చెను.

●**32.**మోషే కొండదిగకుండ తడవు చేయుట ప్రజలు చూచినప్పుడు ఆ ప్రజలు అహరోనునొద్దకు కూడి వచ్చి-లెమ్ము మా ముందర నడుచుటకు ఒక దేవతను మాకొరకు చేయుము. ఐగుప్తులోనుండి మమ్మును రప్పించిన ఆ మోషే అనువాడు ఏమాయెనో మాకు తెలియదని అతనితో చెప్పిరి.।
2.అందుకు అహరోను-మీ భార్యలకు మీ కుమారులకు మీ కుమార్తెలకు చెవులనున్న బంగారు పోగులను తీసి నాయొద్దకు తెండని వారితో చెప్పగా।
3.ప్రజలందరు తమ చెవులనున్న బంగారు పోగులను తీసి అహరోను నొద్దకు తెచ్చిరి.।
4.అతడు వారియొద్ద వాటిని తీసికొని పోగరతో రూపమును ఏర్పరచి దానిని పోతపోసిన దూడగా చేసెను. అప్పుడు వారు-ఓ ఇశ్రాయేలూ, ఐగుప్తుదేశములోనుండి నిన్ను రప్పించిన నీ ఎలోహీం ఇదే అనిరి.।
5.అహరోను అది చూచి దాని యెదుట ఒక బలిపీఠము కట్టించెను. మరియు అహరోను-రేపు యావెకు పండుగ జరుగునని చాటింపగా ।
6.మరునాడు వారు ఉదయమున లేచి దహనబలులను సమాధాన బలులను నర్పించిరి. అప్పుడు జనులు తినుటకును త్రాగుటకును కూర్చుండి ఆడుటకు లేచిరి.।
7.కాగా యావె మోషేతో ఇట్లనెను-నీవు దిగి వెళ్లుము; ఐగుప్తుదేశములో నుండి నీవు రప్పించిన నీ ప్రజలు చెడిపోయిరి.।
8.నేను వారికి నియమించిన త్రోవనుండి త్వరగా తొలగిపోయి తమకొరకు పోతపోసిన దూడను చేసికొని దానికి సాగిలపడి బలినర్పించి-ఓయి ఇశ్రాయేలూ, ఐగుప్తులోనుండి నిన్ను వెలుపలికి రప్పించిన నీ ఎలోహీం ఇదే అని చెప్పుకొనుచుండిరనెను.।
9.మరియు యావె ఇట్లనెను-నేను ఈ ప్రజలను చూచియున్నాను; ఇదిగో వారు లోబడనొల్లని ప్రజలు.।
10.కావున నీవు ఊరకుండుము; నా కోపము వారిమీద మండును, నేను వారిని కాల్చివేసి నిన్ను గొప్ప జనముగా చేసెదనని మోషేతో చెప్పగా
11.మోషే తన ఎలోహీమైన యావెను బ్రతిమాలుకొని-యావె, నీవు మహాశక్తివలన బాహుబలమువలన ఐగుప్తుదేశములోనుండి రప్పించిన నీ ప్రజలమీద నీ కోపము మండనేల?।
12.-ఆయన కొండలలో వారిని చంపునట్లును భూమిమీదనుండి వారిని నశింపచేయునట్లును కీడుకొరకే వారిని తీసికొనిపోయెనని ఐగుప్తీయులు ఏల చెప్పుకొనవలెను? నీ కోపాగ్నినుండి మళ్లుకొని నీవు నీ ప్రజలకు ఈ కీడుచేయక దానిగూర్చి సంతాపపడుము.।
13.నీ సేవకులైన అబ్రాహాము ఇస్సాకును ఇశ్రాయేలును జ్ఞాపకము చేసికొనుము. నీవు వారితో-ఆకాశనక్షత్రములవలె నీ సంతానము అభివృద్ధిజేసి నేను చెప్పిన యీ సమస్తభూమిని మీ సంతానమున కిచ్చెదననియు, వారు నిరంతరము దానికి హక్కుదారులగుదురనియు వారితో నీతోడని ప్రమాణము చేసి చెప్పితివనెను.।
14.అంతట యావె తన ప్రజలకు చేసెదనని చెప్పిన కీడునుగూర్చి సంతాపపడెను.
15.మోషే శాసనములుగల రెండు పలకలను చేత పట్టుకొని కొండ దిగివచ్చెను. ఆ పలకలు ఇరు ప్రక్కలను వ్రాయబడినవి; అవి ఈ ప్రక్కను ఆ ప్రక్కను వ్రాయబడియుండెను.।
16.ఆ పలకలమీద చెక్కబడిన వ్రాత ఎలోహీం చేవ్రాత.।
17.ఆ ప్రజలు పెద్దకేకలు వేయుచుండగా యెహోషువ ఆ ధ్వని విని-పాళెములో యుద్ధధ్వని అని మోషేతో అనగా ।
18.అతడు-అది జయధ్వనికాదు, అపజయధ్వని కాదు, సంగీతధ్వని నాకు

వినబడుచున్నదనెను.।
19.అతడు పాళెమునకు సమీపింపగా, ఆ దూడను, వారు నాట్యమాడు టను చూచెను. అందుకు మోషే కోపము మండెను; అతడు కొండదిగువను తన చేతులలోనుండి ఆ పలకలను పడవేసి వాటిని పగులగొట్టెను.।
20.మరియు అతడు వారు చేసిన ఆ దూడను తీసికొని అగ్నితో కాల్చి పొడిచేసి నీళ్లమీద చల్లి ఇశ్రాయేలీయులచేత దాని త్రాగించెను.
21.అప్పుడు మోషే-నీవు ఈ ప్రజలమీదికి ఈ గొప్ప పాపము రప్పించునట్లు వారు నిన్ను ఏమిచేసిరని అహరోనును నడుగగా ।
22.అహరోను-నా యేలినవాడా, నీ కోపము మండనియ్యకుము. ఈ ప్రజలు దుర్మార్గులను మాట నీ వెరుగుదువు.।
23.వారు-మాకు ముందునడుచుటకు ఒక దేవతను చేయుము; ఐగుప్తులోనుండి మమ్మును రప్పించినవాడగు ఈ మోషే యేమాయెనో మాకు తెలియదనిరి.।
24.అందుకు నేను-ఎవరియొద్ద బంగారము ఉన్నదో వారు దానిని ఊడదీసి తెండని చెప్పితిని. నేను దాని అగ్నిలో వేయగా ఈ దూడ యాయెననెను.।
25.ప్రజలు విచ్చలవిడిగా తిరుగుట మోషే చూచెను. వారి విరోధులలో వారికి ఎగతాళి కలుగునట్లు అహరోను విచ్చలవిడిగా తిరుగుటకు వారిని విడిచిపెట్టియుండెను.।
26.అందుకు మోషే పాళెముయొక్క ద్వారమున నిలిచి-యావె పక్షమున నున్న వారందరు నాయొద్దకు రండి అనగా లేవీయులందరును అతని యొద్దకు కూడివచ్చిరి.।
27.అతడు వారిని చూచి-మీలో ప్రతివాడును తన కత్తిని తన నడుమున కట్టుకొని పాళెము ద్వారమునుండి ద్వారమునకు వెళ్లుచు, ప్రతివాడు తన సహోదరుని ప్రతివాడు తన చెలికానిని ప్రతివాడు తన పొరుగు వానిని చంపవలెనని ఇశ్రాయేలీయుల ఎలోహీమైన యావె సెలవిచ్చు చున్నాడనెను.।
28.లేవీయులు మోషే మాటచొప్పున చేయగా, ఆ దినమున ప్రజలలో ఇంచుమించు మూడువేలమంది కూలిరి.।
29.ఏలయనగా మోషే వారిని చూచి-నేడు యావె మిమ్మును ఆశీర్వ దించునట్లు మీలో ప్రతివాడు తన కుమారునిమీద పడియేగాని తన సహోదరునిమీద పడియేగాని యావెకు మిమ్మును మీరే ప్రతిష్ఠ చేసికొనుడనెను.।
30.మరునాడు మోషే ప్రజలతో-మీరు గొప్ప పాపము చేసితిరి గనుక యావె యొద్దకు కొండ యెక్కి వెళ్లెదను;ఒకవేళ మీ పాపమునకు ప్రాయశ్చిత్తము చేయగలనేమో అనెను.।
31.అప్పుడు మోషే యావె యొద్దకు తిరిగి వెళ్లి-అయ్యో యీ ప్రజలు గొప్ప పాపము చేసిరి; వారు బంగారు దేవతను తమకొరకు చేసికొనిరి.।
32.అయ్యో నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా, లేనియెడల నీవు వ్రాసిన నీ గ్రంథములోనుండి నా పేరు తుడిచివేయుమని బ్రతిమాలుకొనుచున్నాననెను.।
33.అందుకు యావె-యెవడు నా యెదుట పాపము చేసెనో వాని నా గ్రంథములోనుండి తుడిచివేయుదును.।
34.కాబట్టి నీవు వెళ్లి నేను నీతో చెప్పినచోటికి ప్రజలను నడిపించుము, ఇదిగో నా దూత నీకు ముందుగా వెళ్లును. నేను వచ్చుదినమున వారి పాపమును వారి మీదికి రప్పించెదనని మోషేతో చెప్పెను.।
35.అహరోను కల్పించిన దూడను ప్రజలు చేయించినందున యావె వారిని బాధపెట్టెను.

●**33.**మరియు యావె మోషేతో ఇట్లనెను-నీవును నీవు ఐగుప్తుదేశము నుండి తోడుకొనివచ్చిన ప్రజలును బయలుదేరి, నేను అబ్రాహాముతోను ఇస్సాకుతోను యాకోబుతోను ప్రమాణముచేసి-నీ సంతానమునకు దీని నిచ్చెదనని చెప్పిన పాలు తేనెలు ప్రవహించుదేశమునకు లేచిపొండి.।
2.నేను నీకు ముందుగా దూతను పంపి కనానీయులను అమోరీయులను హిత్తీయులను పెరిజ్జీయులను హివ్వీయులను యెబూసీయులను వెళ్లగొట్టెదను.।
3.మీరు లోబడనొల్లని ప్రజలు గనుక నేను మీతో కూడ రాను; త్రోవలో మిమ్మును సంహరించెదనేమో అని మోషేతో చెప్పెను.।
4.ప్రజలు ఆ దుర్వార్తను విని దు:ఖించిరి; కాగా ఎవడును ఆభరణములను ధరించుకొనలేదు.।
5.కాగా యావె మోషేతో ఇట్లనెను-నీవు ఇశ్రాయేలీయులతో-మీరు లోబడనొల్లని ప్రజలు; ఒక క్షణమాత్రము నేను మీ నడుమకు వచ్చితినా, మిమ్మును నిర్మూలము చేసెదను గనుక మిమ్మును ఏమి చేయవలెనో అది నాకు తెలియునట్లు మీ ఆభరణములను మీమీదనుండి తీసివేయుడి అని చెప్పుమనెను.।
6.కాబట్టి ఇశ్రాయేలీయులు హోరేబుకొండయొద్ద తమ ఆభరణములను తీసివేసిరి.
7.అంతట మోషే గుడారమును తీసి పాళెము వెలుపలికి వెళ్లి పాళెమునకు దూరముగా దాని వేసి, దానికి ప్రత్యక్షపు గుడారమను పేరు పెట్టెను. యావెను వెదకిన ప్రతివాడును పాళెమునకు వెలుపలనున్న ఆ ప్రత్యక్షపు గుడారమునకు వెళ్లుచు వచ్చెను.।
8.మోషే ఆ గుడారమునకు వెళ్లినప్పుడు ప్రజలందరు లేచి, ప్రతివాడు తన గుడారపు ద్వారమందు నిలిచి,అతడు ఆ గుడారము లోనికి పోవువరకు అతని వెనుకతట్టు నిదానించి చూచుచుండెను.।
9.మోషే ఆ గుడారములోనికి పోయినప్పుడు మేఘస్తంభము దిగి ఆ గుడారపు ద్వారమందు నిలువగా యావె మోషేతో మాటలాడుచుండెను.।
10.ప్రజలందరు ఆ మేఘస్తంభము ఆ గుడారపు ద్వారమున నిలుచుట చూచి, లేచి ప్రతివాడును తన తన గుడారపు ద్వారమందు నమస్కారము చేయుచుండిరి.।
11.మనుష్యుడు తన స్నేహితునితో మాటలాడునట్లు యావె మోషేతో ముఖాముఖిగా మాటలాడుచుండెను. తరువాత అతడు పాళెములోనికి తిరిగి వచ్చుచుండెను. అతని పరిచారకుడును నూను కుమారుడైన యెహోషువ అను యౌవనస్థుడు గుడారములోనుండి వెలుపలికి రాలేదు.
12.మోషే యావెతో ఇట్లనెను-చూడుము-ఈ ప్రజలను తోడుకొని పొమ్మని నీవు నాతో చెప్పుచున్నావు గాని నాతో ఎవరిని పంపెదవో అది నాకు తెలుపలేదు. నీవు-నేను నీ పేరునుబట్టి నిన్ను ఎరిగియున్నాననియు నా కటాక్షము నీకు కలిగినదనియు చెప్పితివి కదా.।
13.కాబట్టి నీ కటాక్షము నాయెడల కలిగినయెడల నీ కటాక్షము నా యెడల కలుగునట్లుగా దయచేసి నీ మార్గమును నాకు తెలుపుము. అప్పుడు నేను నిన్ను తెలిసికొందును; చిత్తగించుము, ఈ జనము నీ ప్రజలేగదా అనెను.।
14.అందుకు ఆయన-నా సన్నిధి నీకు తోడుగా వచ్చును, నేను నీకు విశ్రాంతి కలుగజేసెదననగా।
15.మోషే-నీ సన్నిధి రానియెడల ఇక్కడనుండి మమ్మును తోడుకొని పోకుము.।
16.నాయెడలను నీ ప్రజలయెడలను నీకు కటాక్షము కలిగినదని దేనివలన తెలియబడును? నీవు మాతో వచ్చుటవలననే గదా? అట్లు మేము, అనగా నేనును నీ ప్రజలును భూమిమీదనున్న సమస్త ప్రజలలోనుండి ప్రత్యేకింపబడుదుమని ఆయనతో చెప్పెను.
17.కాగా యావె -నీవు చెప్పిన మాటచొప్పున చేసెదను; నీమీద నాకు కటాక్షము కలిగినది, నీ పేరునుబట్టి నిన్ను ఎరుగుదునని మోషేతో చెప్పగా
18.అతడు-దయచేసి నీ మహిమను నాకు చూపుమనగా ।
19.ఆయన-నా మంచితనమంతయు నీ యెదుట కనుపరచెదను; యావె అను నామము నీయెదుట ప్రకటించెదను. నేను కరుణించువాని కరుణించెదను, ఎవనియందు కనికరపడెదనో వానియందు కనికర పడెదననెను.।
20.మరియు ఆయన -నీవు నా ముఖమును చూడజాలవు; ఏ నరుడును నన్ను చూచి బ్రదుకడనెను.।
21.మరియు యావె-ఇదిగో నా సమీపమున ఒక స్థలమున్నది, నీవు ఆ బండమీద నిలువవలెను.।

22.నా మహిమ నిన్ను దాటి వెళ్లుచుండగా ఆ బండసందులో నిన్ను ఉంచి, నిన్ను దాటి వెళ్లువరకు నా చేతితో నిన్ను కప్పెదను; ।

23.నేను నా చెయ్యి తీసిన తరువాత నా వెనుక పార్శ్వమును చూచెదవు కాని నా ముఖము నీకు కనబడదని మోషేతో చెప్పెను.।

●**34.**మరియు **యావె** మోషేతో-మొదటి పలకల వంటి మరి రెండు రాతిపలకలను చెక్కుము. నీవు పగులగొట్టిన మొదటి పలకలమీదనున్న వాక్యములను నేను ఈ పలకలమీద వ్రాసెదను.।

2.ఉదయమునకు నీవు సిద్ధపడి ఉదయమున సీనాయి కొండయెక్కి అక్కడ శిఖరము మీద నా సన్నిధిని నిలిచియుండవలెను.।

3.ఏ నరుడును నీతో ఈ కొండకు రాకూడదు; ఏ నరుడును ఈ కొండమీద ఎక్కడైనను కనబడకూడదు; ఈ కొండయెదుట గొఱ్ఱెలైనను ఎద్దులైనను మేయకూడదని సెలవిచ్చెను.।

4.కాబట్టి అతడు మొదటి పలకలవంటి రెండు రాతిపలకలను చెక్కెను. మోషే తనకు **యావె** ఆజ్ఞాపించినట్లు ఉదయమందు పెందలకడ లేచి ఆ రెండు రాతిపలకలను చేతపట్టుకొని సీనాయి కొండ యెక్కగా ।

5.మేఘములో **యావె** దిగి అక్కడ అతనితో నిలిచి **యావె** అను నామమును ప్రకటించెను.।

6.అతనియెదుట **యావె** అతని దాటి వెళ్లుచు-**యావె** కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్యములుగల ఎలోహీమైన **యావె**.।

7.ఆయన వేయివేలమందికి కృపను చూపుచు, దోషమును అపరాధమును పాపమును క్షమించును గాని ఆయన ఏమాత్రమును దోషులను నిర్దోషులగా ఎంచడు మూడునాలుగు తరములవరకు తండ్రుల దోషము కుమారులమీదికిని రప్పించునని ప్రకటించెను.।

8.అందుకు మోషే త్వరపడి నేలవరకు తలవంచుకొని నమస్కారముచేసి

9.-సర్వాధికారీ, నామీద నీ కటాక్షము కలిగినయెడల నా మనవి ఆలకించుము. దయచేసి నా సర్వాధికారి మా మధ్యను ఉండి మాతోకూడ రావలెను. వీరు లోబడనొల్లని ప్రజలు.మా దోషమును పాపమును క్షమించి మమ్మును నీ స్వాస్థ్యముగా చేసికొనుమనెను.।

10.అందుకు ఆయన-ఇదిగో నేను ఒక నిబంధన చేయుచున్నాను; భూమిమీద ఎక్కడనైనను ఏ జనములోనైనను చేయబడని అద్భుతములు నీ ప్రజలందరియెదుట చేసెదను. నీవు ఏ ప్రజల నడుమనున్నావో ఆ ప్రజలందరును **యావె** కార్యమును చూచెదరు. నేను నీ యెడల చేయబోవునది భయంకరమైనది.।

11.నేడు నేను నీ కాజ్ఞాపించుదానినినుసరించి నడువుము. ఇదిగో నేను అమోరీయులను కనానీయులను హిత్తీయులను పెరిజ్జీయులను హివ్వీయులను యెబూసీయులను నీ యెదుటనుండి వెళ్లగొట్టెదను.।

12.నీవు ఎక్కడికి వెళ్లుచున్నావో ఆ దేశనివాసులతో నిబంధన చేసికొనకుండ జాగ్రత్తపడుము. ఒకవేళ అది నీకు ఉరికావచ్చును.।

13.కాబట్టి మీరు వారి బలిపీఠములను పడగొట్టి వారి బొమ్మలను పగులగొట్టి వారి దేవతాస్తంభములను పగులగొట్టవలెను.।

14.ఏలయనగా వేరొక ఎలోహీంకు నమస్కారము చేయవద్దు, ఆయన నామము రోషముగల **యావె**; ఆయన రోషముగల ఎలోహీం;।

15.ఆ దేశపు నివాసులతో నిబంధన చేసికొనకుండ జాగ్రత్తపడుము; వారు ఇతరుల దేవతలతో వ్యభిచరించి ఆ దేవతలకు బలి అర్పించుచు న్నప్పుడు ఒకడు నిన్ను పిలిచిన యెడల నీవువాని బలిద్రవ్యమును తినకుండ చూచుకొనుము.।

16.మరియు నీవు నీ కుమారులకొరకు వారి కుమార్తెలను పుచ్చుకొను నెడల వారి కుమార్తెలు తమ దేవతలతో వ్యభిచరించ నీ కుమారులను తమ దేవతలతో వ్యభిచరింపచేయుదురేమో.।

17.పోతపోసిన దేవతలను చేసికొనవలదు.।

18.మీరు పొంగనివాటి పండుగ ఆచరింపవలెను. నేను నీ కాజ్ఞాపించినట్లు అబీబునెలలో నియామక కాలమందు ఏడు దినములు పొంగనివాటినే తినవలెను. ఏలయనగా అబీబు నెలలో ఐగుప్తులోనుండి మీరు బయలుదేరి వచ్చితిరి.।

19.ప్రతి తొలిచూలు పిల్లయు నాది. నీ పశువులలో తొలిచూలుదైన ప్రతి మగది దూడయే గాని గొఱ్ఱెపిల్లయేగాని అది నాదగును.।

20.గొఱ్ఱెపిల్లను ఇచ్చి గాడిద తొలిపిల్లను విడిపింపవలెను. దాని విమోచింపనియెడల దాని మెడను విరుగదీయవలెను. నీ కుమారులలో ప్రతి తొలిచూలువాని విడిపింపవలెను. నా సన్నిధిని వారు వట్టిచేతులతో కనబడవలదు.।

21.ఆరు దినములు నీవు పనిచేసి యేడవ దినమున విశ్రమింపవలెను. దున్ను కాలమందైనను కోయుకాలమందైనను ఆ దినమున విశ్రమింప వలెను.।

22.మరియు నీవు గోధుమలకోతలో ప్రథమ ఫలముల పండుగను, అనగా వారముల పండుగను సంవత్సరాంతమందు పంటకూర్చు పండుగను ఆచరింపవలెను.।

23.సంవత్సరమునకు ముమ్మారు నీ పురుషులందరు సర్వాధికారియు ఇశ్రాయేలీయుల ఎలోహీమైన **యావె** సన్నిధిని కనబడవలెను.।

24.ఏలయనగా నీ యెదుటనుండి జనములను వెళ్లగొట్టి నీ పొలిమేరలను గొప్పవిగా చేసెదను. మరియు నీవు సంవత్సరమునకు ముమ్మారు నీ ఎలోహీమైన **యావె** సన్నిధిని కనబడబోవునప్పుడు ఎవడును నీ భూమిని ఆశింపడు.।

25.నీవు పులిసినదానితో నా బలిరక్తమును అర్పింపకూడదు; పస్కాపండుగ లోని బలిసంబంధమైన మాంసమును ఉదయకాలమువరకు ఉంచకూడదు.।

26.నీ భూమియొక్క ప్రథమఫలములలో మొదటివి నీ ఎలోహీమైన **యావె** మందిరములోనికి తేవలెను. మేకపిల్లను దాని తల్లిపాలతో ఉడకబెట్టకూడదనెను.।

27.మరియు **యావె** మోషేతో ఇట్లనెను-ఈ వాక్యములను వ్రాసికొనుము; ఏలయనగా ఈ వాక్యములనుబట్టి నేను నీతోను ఇశ్రాయేలీయులతోను నిబంధన చేసియున్నాను.।

28.అతడు నలుబది రేయింబగళ్లు **యావె**తో కూడ అక్కడ నుండెను. అతడు భోజనము చేయలేదు నీళ్లు త్రాగలేదు;అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను అనగా పది ఆజ్ఞలను ఆ పలకలమీద వ్రాసెను.

29.మోషే సీనాయికొండ దిగుచుండగా శాసనములు గల ఆ రెండు పలకలు మోషే చేతిలో ఉండెను. అతడు ఆ కొండ దిగుచుండగా ఆయన అతనితో మాటలాడుచున్నప్పుడు తన ముఖచర్మము ప్రకాశించిన సంగతి మోషేకు తెలిసియుండలేదు.।

30.అహరోనును ఇశ్రాయేలీయులందరును మోషేను చూచినప్పుడు అతని ముఖచర్మము ప్రకాశించెను గనుక వారు అతని సమీపింప వెరచిరి.।

31.మోషే వారిని పిలిచినప్పుడు అహరోనును సమాజప్రధానులందరును అతని యొద్దకు తిరిగి వచ్చిరి, మోషే వారితో మాటలాడెను.।

32.అటుతరువాత ఇశ్రాయేలీయులందరు సమీపింపగా సీనాయి కొండ మీద **యావె** తనతో చెప్పినది యావత్తును అతడు వారి కాజ్ఞాపించెను.।

33.మోషే వారితో ఆ మాటలు చెప్పుట చాలించి తన ముఖము మీద ముసుకు వేసికొనెను.।

34.అయినను మోషే **యావె**తో మాటలాడుటకు ఆయన సన్నిధిని ప్రవేశించినది మొదలుకొని అతడు వెలుపలికి వచ్చువరకు ఆ ముసుకు తీసివేసెను; అతడు వెలుపలికి వచ్చి తనకు ఆజ్ఞాపింపబడినదానిని ఇశ్రాయేలీయులతో చెప్పెను.।

35.మోషే ముఖచర్మము ప్రకాశింపగా ఇశ్రాయేలీయులు మోషే ముఖమును చూచిరి; మోషే ఆయనతో మాటలాడుటకు లోపలికి వెళ్లువరకు తన ముఖముమీద ముసుకు వేసికొనెను.।

●**35.**మోషే ఇశ్రాయేలీయుల సర్వసమాజమును పోగుచేసి-మీరు చేయునట్లు **యావె** ఆజ్ఞాపించిన విధులేవనగా ।

2.ఆరు దినములు పనిచేయవలెను; ఏడవది మీకు పరిశుద్ధదినము. అది **యావె** విశ్రాంతిదినము; దానిలో పనిచేయు ప్రతివాడును మరణశిక్ష

నొందును.।
3.విశ్రాంతిదినమున మీరు మీ యిండ్లలో ఎక్కడను అగ్ని రాజబెట్టకూడదని వారితో చెప్పెను.
4.మరియు మోషే ఇశ్రాయేలీయులైన సర్వసమాజముతో ఇట్లనెను–యావె ఆజ్ఞాపించినదేమనగా ।
5.–మీరు మీలోనుండి యావెకు అర్పణము పోగుచేయుడి. ఎట్లనగా బుద్ధి పుట్టిన ప్రతివాడు యావె సేవనిమిత్తము బంగారు, వెండి, ఇత్తడి ।
6.నీలధూమ్రరక్తవర్ణములు, సన్ననార మేకవెండ్రుకలు, ఎఱ్ఱరంగు వేసిన పొట్టేళ్ల తోళ్లు, సముద్రవత్సల తోళ్లు, తుమ్మకఱ్ఱ, ।
7.ప్రదీపమునకు తైలము, అభిషేక తైలమునకును పరిమళద్రవ్య ధూపమునకును సుగంధ సంభారములు, ।
8.ఏఫోదుకును పతకమునకును లేత పచ్చలును చెక్కు రత్నములును తీసికొని రావలెను.।
9.మరియు వివేకహృదయులందరు వచ్చి యావె ఆజ్ఞాపించినవన్నియు చేయవలెను.।
11.అవేవనగా మందిరము దాని గుడారము దాని పైకప్పు దాని కొలుకులు దాని పలకలు దాని అడ్డకఱ్ఱలు దాని స్తంభములు దాని దిమ్మలు.।
12.మందసము దాని మోతకఱ్ఱలు, కరుణాపీఠము కప్పుతెర, ।
13.బల్ల దాని మోతకఱ్ఱలు దాని ఉపకరణములన్నియు సన్నిధి రొట్టెలు
14.వెలుగుకొఱకు దీపవృక్షము దాని ఉపకరణములు దాని ప్రదీపములు, దీపములకు తైలము.।
15.ధూపవేదిక దాని మోతకఱ్ఱలు, అభిషేక తైలము పరిమళద్రవ్య సంభారము, మందిర ద్వారమున ద్వారమునకు తెర.।
16.దహనబలిపీఠము దానికి కలిగిన ఇత్తడి జల్లెడ దాని మోతకఱ్ఱలు దాని యుపకరణములన్నియు, గంగాళము దాని పీట ।
17.ఆవరణపు తెరలు దాని స్తంభములు వాటి దిమ్మలు ఆవరణ ద్వారమునకు తెర ।
18.మందిరమునకు మేకులు ఆవరణమునకు మేకులు వాటికి త్రాళ్లు
19.పరిశుద్ధస్థలములో సేవచేయుటకు సేవావస్త్రములు, అనగా యాజకుడైన అహరోనుకు ప్రతిష్ఠిత వస్త్రములు యాజకులగునట్లు అతని కుమారులకును వస్త్రములునవియే అనెను.
20.ఇశ్రాయేలీయుల సమాజమంతయు మోషే ఎదుట నుండి వెడలి పోయెను.।
21.తరువాత ఎవని హృదయము వాని రేపెనో, ఎవని మనస్సు వాని ప్రేరేపించెనో వారందరు వచ్చి, ప్రత్యక్షపు గుడారముయొక్క పనికొరకును దాని సమస్త సేవకొరకును ప్రతిష్ఠిత వస్త్రముల కొరకును యావెకు అర్పణము తెచ్చిరి.।
22.స్త్రీలుగాని పురుషులుగాని యెవరెవరి హృదయములు వారిని ప్రేరేపించెనో వారందరు యావెకు బంగారు అర్పించిన ప్రతివాడును ముక్కరలను, పోగులను, ఉంగరములను తావళములను, సమస్తవిధమైన బంగారు వస్తువులను తెచ్చిరి.।
23.మరియు నీల ధూమ్ర రక్తవర్ణములు, సన్ననార, మేకవెండ్రుకలు, ఎఱ్ఱరంగు వేసిన పొట్టేళ్ల తోళ్లు, సముద్రవత్సల తోళ్లు, వీటిలో ఏవి యెవరి యొద్ద నుండెనో వారు వాటిని తెచ్చిరి.।
24.వెండిగాని యిత్తడిగాని ప్రతిష్ఠించిన ప్రతివాడును యావెకు ఆ అర్పణము తెచ్చెను. ఆ సేవలో ఏ పనికైనను వచ్చు తుమ్మకఱ్ఱ యెవని యొద్దనుండెనో వాడు దాని తెచ్చెను.।
25.మరియు వివేకహృదయముగల స్త్రీలందరు తమ చేతులతో వడికి తాము వడికిన నీల ధూమ్రరక్తవర్ణములుగల నూలును సన్ననార నూలును తెచ్చిరి.।
26.ఏ స్త్రీలు జ్ఞానహృదయము గలవారై ప్రేరేపింపబడిరో వారందరు మేక వెండ్రుకలను వడికిరి.।
27.ప్రధానులు ఏఫోదుకును పతకమునకును చెక్కు రత్నములను లేతపచ్చలను ।
28.సుగంధద్రవ్యమును , దీపమునకు అభిషేకతైలమునకును పరిమళ ధూపమునకును తైలమును తెచ్చిరి.।
29.మోషే చేయవలెనని యావె ఆజ్ఞాపించిన పనులన్నిటికొరకు ఇశ్రాయేలీయులలో పురుషులేమి స్త్రీలేమి తెచ్చుటకు ఎవరి హృదయములు వారిని ప్రేరేపించునో వారందరు మన:పూర్వకముగా యావెకు అర్పణములను తెచ్చిరి.
30.మరియు మోషే ఇశ్రాయేలీయులతో ఇట్లనెను–చూడుడి; యావె ఊరు కుమారుడును హూరు మనుమడునైన బెసలేలును పేరుపెట్టి పిలిచి విచిత్రమైన పనులను కల్పించుటకును బంగారుతోను వెండితోను ఇత్తడితోను పనిచేయుటకును, రత్నములను సానబెట్టి పొదుగుటకును చెక్కుటకును, విచిత్రమైన పనులన్నిటిని చేయుటకును వారికి ప్రజ్ఞావివేక జ్ఞానములు కలుగునట్లు ఎలోహీం ఆత్మతో వాని నింపియున్నాడు.।
34.అతడును దాను గోత్రికుడును అహీసామాకు కుమారుడైన అహోలియాబును ఇతరులకు నేర్పునట్లు వారికి బుద్ధి పుట్టించెను.।
35.చెక్కువాడేమి చిత్రకారుడేమి నీలధూమ్ర రక్తవర్ణములతోను సన్ననారతోను బూటాపనిచేయువాడేమి నేతగాడేమి చేయు సమస్త విధములైన పనులు, అనగా ఏ పనియైనను చేయువారియొక్కయు విచిత్రమైన పని కల్పించువారియొక్కయు పనులను చేయునట్లు ఆయన వారి హృదయములను జ్ఞానముతో నింపియున్నాడు.

●**36.**పరిశుద్ధస్థలముయొక్క సేవనిమిత్తము ప్రతివిధమైన పనిచేయ తెలిసికొనుటకై యావె ఎవరికి ప్రజ్ఞావివేకములు కలుగజేసెనో అట్టి బెసలేలును అహోలీయాబును మొదలైన ప్రజ్ఞావంతులందరును యావె ఆజ్ఞాపించిన అంతటిచొప్పున చేయుదురనెను.।
2.బెసలేలును అహోలీయాబును యావె ఎవరి హృదయములో ప్రజ్ఞ పుట్టించెనో ఆ పని చేయుటకు ఎవని హృదయము వాని రేపెనో వారినందరిని మోషే పిలిపించెను.।
3.ఆ పని చేయుటకై వారు పరిశుద్ధస్థలముయొక్క సేవకొరకు ఇశ్రాయేలీయులు తెచ్చిన అర్పణములన్నిటిని మోషేయొద్దనుండి తీసికొనిరి. అయినను ఇశ్రాయేలీయులు ఇంక ప్రతి ఉదయమున మన:పూర్వకముగా అర్పణములను అతనియొద్దకు తెచ్చుచుండిరి.
4.అప్పుడు పరిశుద్ధస్థల సంబంధమైనవ పని అంతయు చేయు ప్రజ్ఞావంతులందరిలో ప్రతివాడు తాను చేయుపని విడిచివచ్చి ।
5.మోషేతో–చేయవలెనని యావె ఆజ్ఞాపించిన పని విషయమైన సేవ కొరకు ప్రజలు కావలసిన దానికంటె బహు విస్తారము తీసికొని వచ్చుచున్నారని చెప్పగా ।
6.మోషే–పరిశుద్ధస్థలమునకు ఏ పురుషుడైనను ఏ స్త్రీయైనను ఇకమీదట ఏ అర్పణనైనను తేవద్దని ఆజ్ఞాపించెను గనుక పాళెమందంతటను ఆ మాట చాటించిరి; ఆ పని అంతయు చేయునట్లు దానికొరకు వారు తెచ్చిన సామాగ్రి చాలినది. అది అత్యధికమైనది ।
7.గనుక ప్రజలు తీసికొనివచ్చుట మానిరి.।
8.ఆ పని చేసినవారిలో ప్రజ్ఞగల ప్రతివాడును మందిరమ పది తెరలతో చేసెను. అతడు వాటిని నీల ధూమ్రరక్తవర్ణములుగల పేనిన సన్న నారతో చిత్రకారుని పనియైన కెరూబులు గలవాటినిగా చేసెను.।
9.ప్రతి తెర పొడుగు ఇరువది యెనిమిది మూరలు; ప్రతి తెర వెడల్పు నాలుగు మూరలు; ఆ తెరలన్నిటి కొలత ఒక్కటే.।
10.అయిదు తెరలను ఒకదానితో ఒకటి కూర్చెను; మిగిలిన అయిదు తెరలను ఒకదానితో ఒకటి కూర్చెను.।
11.మొదటి కూర్పు చివరనున్న తెర అంచున నీలినూలుతో కొలుకులను చేసెను. రెండవ కూర్పున వెలుపటి తెర అంచున అట్లు చేసెను.।
12.ఒక తెరలో ఏబది కొలుకులను చేసెను, రెండవ కూర్పునున్న తెర అంచున ఏబది కొలుకులను చేసెను. ఈ కొలుకులు ఒకదానితో ఒకటి సరిగా నుండెను.।
13.మరియు అతడు ఏబది బంగారు గుండీలను చేసి ఆ గుండీలచేత ఆ తెరలను ఒకదానితో ఒకటి కూర్పగా అది ఒక్క మందిరముగా

ఉండెను.।
14.మరియు మందిరముమీద గుడారముగా మేకవెండ్రుకలతో తెరలను చేసెను; వాటిని పదకొండు తెరలనుగా చేసెను; ।
15.ప్రతి తెర పొడుగు ముప్పది మూరలు ప్రతి తెర వెడల్పు నాలుగు మూరలు; ఆ పదకొండు తెరల కొలత ఒక్కటే. అయిదు తెరలను ఒకటిగాను ఆరు తెరలను ఒకటిగాను కూర్చెను.।
16.మొదటి కూర్పునందలి వెలుపటి తెర అంచున ఏబదికొలుకులను చేసెను. మరియు రెండవ కూర్పునందలి వెలుపటి తెర అంచున ఏబది కొలుకులను చేసెను.।
18.ఆ గుడారము ఒక్కటిగా నుండునట్లు దాని కూర్చుటకు ఏబది యిత్తడి గుండీలను చేసెను.।
19.మరియు ఎఱ్ఱరంగు వేసిన పొట్టేళ్లతోళ్లతో గుడారము కొరకు కప్పును దానికి మీదుగా సముద్రవత్సల తోళ్లతో పైకప్పును చేసెను.।
20.మరియు అతడు మందిరమునకు తుమ్మకఱ్ఱతో నిలువు పలకలు చేసెను.।
21.పలక పొడుగు పది మూరలు పలక వెడల్పు మూరెడునర.।
22.ప్రతి పలకకు ఒకదాని కొకటి సమదూరముగల కుసులు రెండు ఉండెను. అట్లు మందిరముయొక్క పలకలన్నిటికి చేసెను.।
23.కుడివైపున, అనగా దక్షిణ దిక్కున ఇరువది పలకలుండునట్లు మందిరమునకు పలకలు చేసెను.।
24.ఒక్కొక్క పలక క్రింద దాని రెండు కుసులకు రెండు దిమ్మలను, ఆ యిరువది పలకల క్రింద నలుబది వెండి దిమ్మలను చేసెను.।
25.మందిరముయొక్క రెండవ ప్రక్కకు, అనగా ఉత్తరదిక్కున ఇరువది పలకలను వాటి నలుబది వెండి దిమ్మలను, అనగా ఒక్కొక్క పలకక్రింద రెండు దిమ్మలను చేసెను.।
27.పడమటి దిక్కున మందిరముయొక్క వెనుక ప్రక్కను ఆరు పలకలు చేసెను.।
28.వెనుకప్రక్కను మందిరముయొక్క మూలలకు రెండు పలకలను చేసెను.।
29.అవి అడుగున కూర్చబడి మొదటి ఉంగరముదాక ఒకదానితో ఒకటి శిఖరమున కూర్చబడినవి. అట్లు రెండు మూలలలో ఆ రెండు పలకలు చేసెను.।
30.ఎనిమిది పలకలుండెను; వాటి వెండి దిమ్మలు పదునారు దిమ్మలు; ప్రతి పలకక్రింద రెండు దిమ్మలుండెను.।
31.మరియు అతడు తుమ్మకఱ్ఱతో అడ్డకఱ్ఱలను చేసెను. మందిరముయొక్క ఒక ప్రక్క పలకకు అయిదు అడ్డకఱ్ఱలను ।
32.మందిరము యొక్క రెండవ ప్రక్క పలకలకు అయిదు అడ్డకఱ్ఱలను, పడమటివైపున మందిరముయొక్క వెనుక ప్రక్కపలకలకు అయిదు అడ్డకఱ్ఱలను చేసెను.।
33.పలకల మధ్యనుండు నడిమి అడ్డకఱ్ఱను ఈ కొననుండి ఆ కొనవరకు చేరియుండచేసెను.।
34.ఆ పలకలకు బంగారు రేకులు పొదిగించి వాటి అడ్డకఱ్ఱలుండు వాటి ఉంగరములను బంగారుతో చేసి అడ్డకఱ్ఱలకు బంగారు రేకులను పొదిగించెను.
35.మరియు అతడు నీల ధూమ్ర రక్తవర్ణములుగల అడ్డతెరను పేనిన సన్ననారతో చేసెను, చిత్రకారుని పనియైన కెరూబులుగలదానిగా దాని చేసెను.।
36.దాని కొరకు తుమ్మకఱ్ఱతో నాలుగు స్తంభములను చేసి వాటికి బంగారు రేకులను పొదిగించెను. వాటి వంకులు బంగారువి, వాటికొరకు నాలుగు వెండిదిమ్మలను పోతపోసెను.
37.మరియు అతడు గుడారపు ద్వారముకొరకు నీలధూమ్ర రక్తవర్ణములు గల పేనిన సన్ననారతో బూటాపనియైన అడ్డతెరను చేసెను.।
38.దాని అయిదు స్తంభములను వాటి దిమ్మలను చేసి వాటి బోదెలకును వాటి పెండెబద్దలకును బంగారు రేకులను పొదిగించెను; వాటి అయిదు దిమ్మలు ఇత్తడివి.

●**37.**మరియు బెసలేలు తుమ్మకఱ్ఱతో ఆ మందసమును చేసెను. దాని పొడుగు రెండు మూరలనర దాని వెడల్పు మూరెడునర దాని యెత్తు మూరెడునర.।
2.లోపలను వెలుపలను దానికి మేలిమి బంగారు రేకు పొదిగించి దానికి చుట్టు బంగారు జవను చేసెను.।
3.దానికి నాలుగు బంగారు ఉంగరములను పోతపోసి, ఒక ప్రక్కను రెండు ఉంగరములును ఎదుటి ప్రక్కను రెండు ఉంగరములుండునట్లు దాని నాలుగు కాళ్లకు వాటిని తగిలించెను.।
4.మరియు అతడు తుమ్మకఱ్ఱతో మోతకఱ్ఱలను చేసి వాటికి బంగారు రేకులను పొదిగించి ।
5.మందసమును మోయుటకు దాని ప్రక్కలమీది ఉంగరములలో ఆ మోతకఱ్ఱలను చొనిపెను.।
6.మరియు అతడు మేలిమి బంగారుతో కరుణాపీఠమును చేసెను. దాని పొడుగు రెండు మూరలనర దాని వెడల్పు మూరెడునర;।
7.మరియు రెండు బంగారు కెరూబులను చేసెను, కరుణాపీఠముయొక్క రెండుకొనలను వాటిని నకిషిపనిగా చేసెను.।
8.ఒక్కొక్క కొనను ఒక్కొక్క కెరూబును కరుణాపీఠముతో ఏకాండముగా దాని రెండుకొనలమీద కెరూబులను చేసెను.।
9.ఆ కెరూబులు పైకివిప్పిన రెక్కలుగలవై కరుణాపీఠమును తమ రెక్కలతో కప్పెను. కెరూబుల ముఖములు ఒకదానికి ఒకటి ఎదురుగా ఉండెను; వాటి ముఖములు కరుణాపీఠము వైపుగా నుండెను.
10.మరియు అతడు తుమ్మకఱ్ఱతో బల్లను చేసెను. దాని పొడుగు రెండు మూరలు దాని వెడల్పు మూరెడు దాని యెత్తు మూరెడునర.।
11.అతడు దానికి మేలిమి బంగారురేకును పొదిగించి దానికి చుట్టు బంగారు జవను చేసెను;।
12.దానికి చుట్టు బెత్తెడు బద్దెచేసి దాని బద్దెపైని చుట్టు బంగారు జవను చేసెను.।
13.దానికి నాలుగు బంగారు ఉంగరములను పోతపోసి దాని నాలుగు కాళ్లకుండిన నాలుగు మూలలయందు ఆ ఉంగరములను వేసెను.।
14.బల్లను మోయుటకు మోతకఱ్ఱలుండు ఆ ఉంగరములు దాని బద్దెకు సమీపముగా నుండెను।
15.బల్లను మోయుటకు తుమ్మకఱ్ఱతో మోతకఱ్ఱలను చేసి వాటికి బంగారు రేకులు పొదిగించెను.।
16.మరియు నతడు బల్లమీదనుండు దాని ఉపకరణములను, అనగా దాని గంగాళములను దాని ధూపకలశములను దాని గిన్నెలను తర్పణము చేయుటకు దాని పాత్రలను మేలిమి బంగారుతో చేసెను.
17.అతడు మేలిమి బంగారుతో దీపవృక్షమును చేసెను. ఆ దీపవృక్షమును దాని ప్రకాండమును దాని కొమ్మను నకిషిపనిగా చేసెను. దాని కలశములు మొగ్గలు పువ్వులు ఏకాండమైనవి.।
18.దీపవృక్షము యొక్క ఇరు ప్రక్కలనుండి మూడేసికొమ్మలు అట్లు దాని ప్రక్కలనుండి ఆరు కొమ్మలు బయలుదేరినవి.।
19.ఒక కొమ్మలో మొగ్గలు పువ్వులుగల బాదము రూపమైన మూడు కలశములు, రెండవ కొమ్మలో మొగ్గలు పువ్వులు గల బాదము రూపమైన మూడు కలశములు; అట్లు దీపవృక్షమునుండి బయలుదేరిన ఆ కొమ్మలకు ఉండెను.।
20.మరియు దీపవృక్షమందు దాని మొగ్గలు దాని పువ్వులుగల బాదము రూపమైన నాలుగు కలశములుండెను.।
21.దీపవృక్షమునుండి బయలుదేరు ఆరు కొమ్మలలో రెండేసి కొమ్మల క్రింద ఏకాండమైన మొగ్గయు నుండెను.।
22.వాటి మొగ్గలు వాటి కొమ్మలు ఏకాండమైనవి; అదంతయు ఏకాండమైనదై మేలిమి బంగారుతో నకిషిపనిగా చేయబడెను.।
23.మరియు అతడు దాని యేడు ప్రదీపములను దాని కత్తెరను దాని పట్టుకారును దాని కత్తెరచిప్పను మేలిమిబంగారుతో చేసెను.।
24.దానిని దాని ఉపకరణములన్నిటిని నలుబది వీసెల మేలిమి బంగారుతో చేసెను

25.మరియు అతడు తుమ్మకఱ్ఱతో ధూపవేదికను చేసెను. దాని పొడుగు మూరెడు, దాని వెడల్పు మూరెడు, అది చచ్చౌకముగా నుండెను. దాని యెత్తు రెండు మూరలు దాని కొమ్ములు ఏకాండమైనవి.।
26.దానికి, అనగా దాని కప్పుకును దాని నాలుగు ప్రక్కలకును దాని కొమ్ములకును మేలిమి బంగారు రేకులను పొదిగించి దానికి చుట్టు బంగారు జవను చేసెను.।
27.దాని మోయు మోతకఱ్ఱలకు స్థలములుగా దానికి రెండు ఉంగరములను బంగారుతో చేసి దాని రెండుప్రక్కలయందు దాని రెండు మూలలయందు దాని జవకు దిగువను వాటిని వేసెను.।
28.దాని మోత కఱ్ఱలను తుమ్మకఱ్ఱతో చేసి వాటికి బంగారు రేకులను తాపెను.।
29.అతడు పరిశుద్ధమైన అభిషేక తైలమును స్వచ్ఛమైన పరిమళ ధూపద్రవ్యమును పరిమళ ద్రవ్యముల మేళకునిచేత చేయించెను.।

●**38.**మరియు అతడు తుమ్మకఱ్ఱతో దహనబలిపీఠమును చేసెను.దాని పొడుగు అయిదు మూరలు దాని వెడల్పు అయిదు మూరలు, అది చచ్చౌకమైనది. దాని యెత్తు మూడు మూరలు దాని నాలుగు మూలలను కొమ్ములను చేసెను.।
2.దాని కొమ్ములు దానితో ఏకాండమైనవి; దానికి ఇత్తడిరేకు పొదిగించెను.।
3.అతడు ఆ బలిపీఠ సంబంధమైన ఉపకరణములన్నిటిని, అనగా దాని బిందెలను దాని గరిటెలను దాని గిన్నెలను దాని ముండ్లను దాని అగ్నిపాత్రలను చేసెను. దాని ఉపకరణములన్నిటిని ఇత్తడితో చేసెను.।
4.ఆ బలిపీఠము నిమిత్తము దాని జవక్రింద దాని నడిమివరకు లోతుగానున్న వలవంటి ఇత్తడి జల్లెడయొక్క నాలుగు మూలలలో దాని మోతకఱ్ఱలుండు నాలుగు ఉంగరములను పోతపోసెను.।
5.మరియు అతడు ఆ యిత్తడి జల్లెడయొక్క నాలుగు మూలలలో దాని మోతకఱ్ఱలుండు నాలుగు ఉంగరములను పోతపోసెను ।
6.ఆ మోతకఱ్ఱలను తుమ్మకఱ్ఱతో చేసి వాటికి రాగిరేకులు పొదిగించెను.।
7.ఆ బలిపీఠమును మోయుటకు దాని ప్రక్కలనున్న ఉంగరములలో ఆ మోతకఱ్ఱలు చొనిపెను; పలకలతో బలిపీఠమును గుల్లగా చేసెను.
8.అతడు ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారమున సేవింపవచ్చిన సేవకురాండ్ర అద్దములతో ఇత్తడి గంగాళమును దాని ఇత్తడి పీటను చేసెను.
9.మరియు అతడు ఆవరణము చేసెను.కుడివైపున, అనగా దక్షిణదిక్కున నూరు మూరల పొడుగుగలవియు పేనినసన్ననారవియునైన తెరలుండెను.
10.వాటి స్తంభములు ఇరువది వాటి ఇత్తడి దిమ్మలు ఇరువది. ఆ స్తంభముల వంకులును వాటి పెండెబద్దలును వెండివి.।
11.ఉత్తరదిక్కున ఉన్న తెరలు నూరు మూరలవి;వాటి స్తంభములు ఇరువది, వాటి ఇత్తడి దిమ్మలు ఇరువది, ఆ స్తంభముల వంకులును వాటి పెండెబద్దలును వెండివి.
12.పడమటి దిక్కున తెరలు ఏబది మూరలవి; వాటి స్తంభములు పది, వాటి దిమ్మలు పది, ఆ స్తంభముల వంకులును వాటి పెండె బద్దలును వెండివి.।
13.తూర్పువైపున, అనగా ఉదయపు దిక్కున ఏబది మూరలు;।
14.ద్వారముయొక్క ఒక ప్రక్కను తెరలు పదునైదు మూరలవి; వాటి స్తంభములు మూడు వాటి దిమ్మలు మూడు.।
15.అట్లు రెండవ ప్రక్కను, అనగా ఇరు ప్రక్కలను ఆవరణ ద్వారమునకు పదునైదు మూరల తెరలు ఉండెను; వాటి స్తంభములు మూడు వాటి దిమ్మలు మూడు.।
16.ఆవరణము చుట్టునున్న దాని తెరలన్నియు పేనిన సన్ననారవి.।
17.స్తంభములదిమ్మలు రాగివి, స్తంభముల వంకులును వాటి పెండె బద్దలును వెండివి. వాటి బోదెలకు వెండిరేకులు పొదిగింపబడెను. ఆవరణపు స్తంభములన్నియు వెండి బద్దలతో కూర్పబడెను.।
18.ఆవరణ ద్వారపు తెర నీల ధూమ్ర రక్తవర్ణములు గలదియు పేనిన సన్ననారతో చేయబడినదియునైన బూటాపనిది, దాని పొడుగు ఇరువది మూరలు; దాని యెత్తు, అనగా వెడల్పు ఆవరణ తెరలతో సరిగా, అయిదు మూరలు ।
19.వాటి స్తంభములు నాలుగు, వాటి ఇత్తడి దిమ్మలు నాలుగు. వాటి వంకులు వెండివి.।
20.వాటి బోదెలకు వెండి రేకు పొదిగింపబడెను. వాటి పెండెబద్దలు వెండివి, మందిరమునకును దాని చుట్టునున్న ఆవరణమునకును చేయబడిన మేకులన్నియు ఇత్తడివి.
21.మందిరపదార్థముల మొత్తము, అనగా సాక్ష్యపు మందిరపదార్థముల మొత్తము ఇదే. ఇట్లు వాటిని యాజకుడైన అహరోను కుమారుడగు ఈతామారు లేవీయులచేత మోషే మాటచొప్పున లెక్క పెట్టించెను.।
22.యూదా గోత్రికుడైన హూరు మనుమడును ఊరు కుమారుడునైన బెసలేలు **యావె** మోషేకు ఆజ్ఞాపించినదంతయు చేసెను.।
23.దాను గోత్రికుడును అహీసామాకు కుమారుడునైన అహోలీయాబు అతనికి తోడైయుండెను. ఇతడు చెక్కువాడును విచిత్రమైనపని కల్పించు వాడును నీలధూమ్రరక్తవర్ణములతోను సన్ననారతోను బూటాపని చేయువాడునై యుండెను.
24.పరిశుద్ధస్థలవిషయమైన పని అంతటిలోను పని కొరకు వ్యయపరచ బడిన బంగారమంతయు, అనగా ప్రతిష్ఠింపబడిన బంగారు పరిశుద్ధస్థలపు తులముచొప్పున నూట పదహారుమణుగుల ఐదువందల ముప్పది తులములు ।
25.సమాజములో చేరినవారి వెండి పరిశుద్ధస్థలపు తులముచొప్పున నాలుగువందల మణుగుల వెయ్యిన్ని ఐదువందల డెబ్బదియైదు తులములు.।
26.ఈ పన్ను ఇరువది ఏండ్లు మొదలుకొని పైప్రాయము కలిగి లెక్కలో చేరిన వారందరిలో, అనగా ఆరులక్షల మూడువేల ఐదువందల ఏబదిమందిలో తలకొకటికి అరతులము.।
27.ఆ నాలుగువందల వెండి మణుగులతో పరిశుద్ధస్థలమునకు దిమ్మలు అడ్డతెరకు దిమ్మలును; అనగా ఒక దిమ్మకు నాలుగు మణుగుల చొప్పున నాలుగు వందల మణుగులకు నూరు దిమ్మలు పోతపోయబడెను.।
28.వెయ్యిన్ని ఐదువందల డెబ్బదియైదు తులముల వెండితో అతడు స్తంభములకు వంకులను చేసి వాటి బోదెలకు పొదిగించి వాటిని పెండెబద్దలచేత కట్టెను.।
29.మరియు ప్రతిష్ఠింపబడిన యిత్తడి రెండువందల ఎనుబది మణుగుల రెండువేల నాలుగువందల తులములు.।
30.అతడు దానితో ప్రత్యక్షపు గుడారపు ద్వారమునకు దిమ్మలను, ఇత్తడి వేదికను దానికి ఇత్తడి జల్లెడను వేదిక ఉపకరణములన్నిటిని ।
31.చుట్టునున్న ఆవరణమునకు దిమ్మలను ఆవరణద్వారమునకు దిమ్మలను ఆలయమునకు మేకులన్నిటిని చుట్టునున్న ఆవరణమునకు మేకులన్నిటిని చేసెను.।

●**39.** **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు పరిశుద్ధ స్థలములో అహరోను చేయు సేవనిమిత్తము నీల ధూమ్ర రక్తవర్ణములుగల సేవావస్త్రములను అనగా ప్రతిష్ఠిత వస్త్రములను కుట్టిరి.।
2.మరియు అతడు బంగారుతోను నీల ధూమ్రరక్తవర్ణములు గల నూలుతోను పేనిన సన్ననారతోను ఏఫోదును చేసెను.।
3.నీల ధూమ్ర రక్తవర్ణములుగల నూలుతోను సన్ననారతోను చిత్రకారుని పనిగా నేయుటకు బంగారును రేకులను కొట్టి అది తీగెలుగా కత్తిరించిరి.।
4.దానికి కూర్చు భుజఖండములను చేసిరి, దాని రెండు అంచులయందు అవి కూర్పబడెను.।
5.దానిమీదనున్న దాని విచిత్రమైన దట్టి యేకాండమై దానితో సమమైన పని గలిగి బంగారుతోను నీలధూమ్రరక్తవర్ణములుగల పేనిన సన్ననార తోను చేయబడెను; అట్లు **యావె** మోషేకు ఆజ్ఞాపించెను.
6.మరియు బంగారు జవలలో పొదిగిన లేతపచ్చలను సిద్ధపరచిరి. ముద్రలు చెక్కబడునట్లు ఇశ్రాయేలీయుల పేళ్లు వాటిమీద చెక్కబడెను.।
7.అవి ఇశ్రాయేలీయులకు జ్ఞాపకార్థమైన రత్నములగునట్లు ఏఫోదు

భుజములమీద వాటిని ఉంచెను. అట్లు **యావె** మోషేకు ఆజ్ఞాపించెను.

8.మరియు అతడు ఏఫోదుపనివలె బంగారుతోను నీలధూమ్ర రక్తవర్ణములుగల పంక్తులతోను సన్ననారతోను చిత్రకారుని పనిగా పతకము చేసెను.।

9.అది చచ్చౌకముగా నుండెను, ఆ పతకమును మడతగా చేసిరి. అది మడవబడినదై జేనెడు పొడుగు జేనెడు వెడల్పు గలది.।

10.వారుదానిలో నాలుగు పంక్తుల రత్నములను పొదిగిరి. మాణిక్య గోమేధిక మరకతములు గల పంక్తి మొదటిది;।

11.పద్మరాగ నీల సూర్యకాంత మణులుగల పంక్తి రెండవది;।

12.గారుత్మతకము యష్మురాయి ఇంద్రనీలమునుగల పంక్తి మూడవది;।

13.రక్తవర్ణపురాయి సులిమానిరాయి సూర్యకాంతమును గల పంక్తి నాలుగవది; వాటి వాటి పంక్తులలో అవి బంగారు జవలలో పొదిగింపబడెను.।

14.ఆ రత్నములు ఇశ్రాయేలీయుల పేళ్లచొప్పున, పండ్రెండు గోత్రముల పేళ్లు ఒక్కొక్కదానిమీద ఒక్కొక్క పేరు చెక్కబడెను.।

15.మరియు వారు ఆ పతకమునకు మేలిమి బంగారుతో అల్లికపనియైన గొలుసులు చేసిరి.।

16.వారు రెండు బంగారు జవలు రెండు బంగారు ఉంగరములును చేసి ఆ రెండు ఉంగరములును పతకపు రెండు కొనలను ఉంచి ।

17.అల్లబడిన ఆ రెండు బంగారు గొలుసులను పతకపు కొనలనున్న రెండు ఉంగరములలోవేసి ।

18.అల్లబడిన రెండు గొలుసుల కొనలను ఆ రెండు జవలకు తగిలించి ఏఫోదు భుజఖండములమీద దాని యెదుట ఉంచిరి.।

19.మరియు వారు రెండు బంగారు ఉంగరములను చేసి ఏఫోదు నెదుటనున్న పతకపు లోపలి అంచున దాని రెండు కొనలకు వాటిని వేసిరి.।

20.మరియు రెండు బంగారు ఉంగరములను చేసి ఏఫోదు విచిత్రమైన నడికట్టునకు పైగా దాని రెండవ కూర్పు నొద్దనున్న దాని యెదుటి ప్రక్కను, ఏఫోదు రెండు భుజఖండములకు దిగువను వాటిని వేసిరి.।

21.ఆ పతకము ఏఫోదు విచిత్రమైన దట్టికి పైగా నుండునట్లు అది ఏఫోదునుండి విడిపోకుండునట్లును ఆ పతకమును దాని ఉంగరములకును ఏఫోదు ఉంగరములకును నీలిసూత్రముతో కట్టిరి. అట్లు **యావె** మోషేకు ఆజ్ఞాపించెను.।

22.మరియు అతడు ఏఫోదు చొక్కాయి కేవలము నీలినూలుతో అల్లిక పనిగా చేసెను. ఆ చొక్కాయిమధ్యనున్న రంధ్రము కవచరంధ్రమువలె ఉండెను.।

23.అది చినుగకుండునట్లు దాని రంధ్రమునకు చుట్టు ఒక గోటు ఉండెను.।

24.మరియు వారు చొక్కాయి అంచులమీద నీల ధూమ్రరక్తవర్ణములుగల పేనిన నూలుతో దానిమ్మ పండ్లను చేసిరి.।

25.మరియు వారు మేలిమి బంగారుతో గంటలను చేసి ఆ దానిమ్మపండ్ల మధ్యను, అనగా ఆ చొక్కాయి అంచులమీద చుట్టునున్న దానిమ్మ పండ్లమధ్యను ఆ గంటలను పెట్టిరి.।

26.**యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు సేవచేయుటకు ఆ చొక్కాయి అంచులమీద చుట్టు ఉంచిరి.

27.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు వారు అహరోనుకును అతని కుమారులకును నేతపనియైన సన్ననార చొక్కాయిలను సన్ననార పాగాను అందమైన సన్ననార కుళ్లాయిలను పేనిన సన్ననార లాగులను నీలధూమ్రరక్తవర్ణములుగల పేనిన సన్ననారతో బూటాపనియైన నడికట్టును చేసిరి.

30.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు వారు మేలిమి బంగారుతో పరిశుద్ధకిరీట భూషణము చేసి చెక్కిన ముద్రవలె దాని మీద –**యావె** పరిశుద్ధుడు[1] (లేక **యావె**కు ప్రతిష్ఠితము) అను వ్రాత వ్రాసిరి.।

31.**యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు పాగాకు మీదుగా కట్టునట్లు దానికి నీలిసూత్రమును కట్టిరి.।

32.ప్రత్యక్షపు గుడారపు మందిరము యొక్క పని యావత్తును సంపూర్తి చేయబడెను. **యావె** మోషేకు ఆజ్ఞాపించిన ప్రకారముగానే ఇశ్రాయేలీయులు చేసిరి.।

33.అప్పుడు వారుమందిరమును గుడారమును దానిఉపకరణములన్నిటిని దాని కొలుకులను పలకలను కమ్ములను స్తంభములను దిమ్మలను ।

34.ఎరుపురంగువేసిన పొట్టేళ్ల తోళ్ల పైకప్పును సముద్రవత్సల తోళ్ల పైకప్పును కప్పు తెరను.।

35.సాక్ష్యపు మందసమును దాని మోత కఱ్ఱలను, కరుణాపీఠమును ।

36.బల్లను, దాని ఉపకరణములన్నిటిని, సముఖపు రొట్టెలను

37.పవిత్రమైన దీపవృక్షమును, సవరించు దాని ప్రదీపములను, అనగా దాని ప్రదీపముల వరుసను దాని ఉపకరణములన్నిటిని దీపముకొరకు తైలమును ।

38.బంగారు వేదికను అభిషేక తైలమును పరిమళ ధూపద్రవ్యములను శాలద్వారమునకు తెరను ।

39.ఇత్తడి బలిపీఠమును దానికుండు ఇత్తడి జల్లెడను దాని మోతకఱ్ఱలను దాని ఉపకరణములన్నిటిని, గంగాళమును దాని పీటను ।

40.ఆవరణపు తెరలు దాని స్తంభములను దాని దిమ్మలను ఆవరణ ద్వారమునకు తెరను దాని త్రాళ్లను దాని మేకులను ప్రత్యక్షపు గుడారములో మందిర సేవకొరకైన ఉపకరణములన్నిటిని, పరిశుద్ధస్థలములోని ।

41.యాజకసేవార్థమైన వస్త్రములను, అనగా యాజకుడైనఅహరోనుకు పరిశుద్ధవస్త్రములను అతని కుమారులకు వస్త్రములను మోషే యొద్దకు తీసికొనివచ్చిరి.।

42.**యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు ఇశ్రాయేలీయులు ఆ పని అంతయు చేసిరి.।

43.మోషే ఆ పని అంతయు చూచినప్పుడు **యావె** ఆజ్ఞాపించినట్లు వారు దానిని చేసియుండిరి; ఆలాగుననే చేసియుండిరి గనుక మోషే వారిని దీవించెను.।

●**40.**మరియు **యావె** మోషేతో ఇట్లనెను.

2.మొదటి నెలలో మొదటి దినమున నీవు ప్రత్యక్షపు గుడారపు మందిరమును నిలువబెట్టవలెను.।

3.అచ్చట నీవు సాక్ష్యపు మందసమును నిలిపి ఆ మందసమును అడ్డతెరతో కప్పవలెను.।

4.నీవు బల్లను లోపలికి తెచ్చి దాని మీద క్రమముగా ఉంచవలసినవాటిని ఉంచి దీపవృక్షమును లోపలికి తెచ్చి దాని ప్రదీపములను వెలిగింపవలెను.।

5.సాక్ష్యపు మందసము నెదుట ధూపము వేయుబంగారు వేదికను ఉంచి మందిరద్వారమునకు తెరను తగిలింపవలెను.।

6.ప్రత్యక్షపు గుడారము మందిరద్వారము నెదుట దహనబలిపీఠమును ఉంచవలెను;।

7.ప్రత్యక్షపు గుడారమునకును బలిపీఠమునకును మధ్యను గంగాళమును ఉంచి దానిలో నీళ్లు నింపవలెను.।

8.తెరలచుట్టు ఆవరణమును నిలువబెట్టి ఆవరణద్వారముయొక్క తెరను తగిలింపవలెను.।

9.మరియు నీవు అభిషేకతైలమును తీసికొని మందిరమునకును దానిలోని సమస్తమునకును అభిషేకము చేసి దానిని దాని ఉపకరణములన్నిటిని ప్రతిష్ఠింపవలెను, అప్పుడు అది పరిశుద్ధమగును.।

10.దహనబలిపీఠమునకు అభిషేకముచేసి ఆ పీఠమును ప్రతిష్ఠింపవలెను, అప్పుడు ఆ పీఠము అతిపరిశుద్ధమగును.।

11.ఆ గంగాళమునకు దాని పీటకు అభిషేకము చేసి దాని ప్రతిష్ఠింప వలెను.।

12.మరియు నీవు అహరోనును అతని కుమారులను ప్రత్యక్షపు గుడారము యొక్క ద్వారమునొద్దకు తోడుకొనివచ్చి వారిని నీళ్లతో స్నానము చేయించి।

13.అహరోను నాకు యాజకుడగునట్లు అతనికి ప్రతిష్ఠితవస్త్రములను ధరింపచేసి అతనికి అభిషేకముచేసి అతని ప్రతిష్ఠింపవలెను.।

14.మరియు నీవు అతని కుమారులను తోడుకొనివచ్చి వారికి

చొక్కాయిలను తొడిగించి ।
15.వారు నాకు యాజకులగుటకై నీవు వారి తండ్రికి అభిషేకము చేసినట్లు వారికిని అభిషేకము చేయుము. వారి అభిషేకము తరతరములకు వారికి నిత్యమైన యాజకత్వ సూచనగా ఉండుననెను.।
16.మోషే ఆ ప్రకారము చేసెను; **యావె** అతనికి ఆజ్ఞాపించిన వాటినన్నిటిని చేసెను, ఆలాగుననే చేసెను.।
17.రెండవ సంవత్సరమున మొదటి నెలలో మొదటి దినమున మందిరము నిలువబెట్టబడెను.।
18.**యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు మోషే మందిరమును నిలువబెట్టి దాని దిమ్మలను వేసి దాని పలకలను నిలువబెట్టి దాని పెండెబద్దలను చొనిపి దాని స్తంభములను నిలువబెట్టి ।
19.మందిరముమీద గుడారమును పరచి దానిపైని గుడారపు కప్పును వేసెను.।
20.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు అతడు శాసనములను తీసికొని మందసములో ఉంచి మందసమునకు మోతకఱ్ఱలను దూర్చి దానిమీద కరుణాపీఠమునుంచెను.।
21.మందిరములోనికి మందసమును తెచ్చి కప్పుతెరను వేసి సాక్ష్యపు మందసమును కప్పెను ।
22.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు అతడు ప్రత్యక్షగుడారములో మందిరముయొక్క ఉత్తరదిక్కున, అడ్డతెరకు వెలుపల బల్లను ఉంచి ।
23.**యావె** సన్నిధిని దానిమీద రొట్టెలను క్రమముగా ఉంచెను.।
24.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు అతడు ప్రత్యక్షపు గుడారములో మందిరమునకు దక్షిణదిక్కున బల్లయెదుట దీపవృక్షమును ఉంచి ।
25.**యావె** సన్నిధిని ప్రదీపములను వెలిగించెను.।
26.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు అతడు ప్రత్యక్షపు గుడారములో అడ్డ తెరయెదుట బంగారు ధూపవేదికను ఉంచి ।
27.దాని మీద పరిమళద్రవ్యములను ధూపము వేసెను.।
28.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు అతడు మందిర ద్వారమునకు తెరను వేసెను. అతడు ప్రత్యక్షపు గుడారపు మందిరపు ద్వారమునొద్ద దహనబలిపీఠమును ఉంచి ।
29.దానిమీద దహనబలి నర్పించి నైవేద్యమును సమర్పించెను.।
30.మరియు **యావె** మోషేకు ఆజ్ఞాపించినట్లు అతడు ప్రత్యక్షపు గుడారమునకును బలిపీఠమునకును మధ్య గంగాళమును ఉంచి ప్రక్షాళనకొరకు దానిలో నీళ్లు పోసెను.।
31.దానియొద్ద మోషేయు అహరోనును అతని కుమారులును తమ చేతులును కాళ్లును కడుగుకొనిరి.।
32.వారు ప్రత్యక్షపు గుడారములోనికి వెళ్లునప్పుడు బలిపీఠమునకు సమీపించునప్పుడును కడుగుకొనిరి.।
33.మరియు అతడు మందిరమునకును బలిపీఠమునకును చుట్టు ఆవరణమును ఏర్పరచి ఆవరణద్వారపు తెరను వేసెను. ఆలాగున మోషే పని సంపూర్తిచేసెను.
34.అప్పుడు మేఘము ప్రత్యక్షపు గుడారమును కమ్మగా **యావె** తేజస్సు మందిరమును నింపెను.।
35.ఆ మేఘము మందిరముమీద నిలుచుటచేత మందిరము **యావె** తేజస్సుతో నిండెను గనుక మోషే ప్రత్యక్షపు గుడారములోనికి వెళ్లలేకుండెను.।
36.మేఘము మందిరముమీదనుండి పైకి వెళ్లునప్పుడు ఇశ్రాయేలీయులు ప్రయాణమైపోయిరి.।
37.ఇదే వారి ప్రయాణపద్ధతి. ఆ మేఘము పైకి వెళ్లనియెడల అది వెళ్లు దినమువరకు వారు ప్రయాణము చేయకుండిరి.।
38.ఇశ్రాయేలీయులందరి కన్నుల ఎదుట పగటివేళ **యావె** మేఘము మందిరముమీద ఉండెను. రాత్రివేళ అగ్నిదానిమీద ఉండెను. వారి సమస్త ప్రయాణములలో ఈలాగుననే జరిగెను.।